




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 20 మంగళవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 245

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# మళ్లీ కరోనా!

- భారత్‌లో పెరుగుతున్న కరోనా కేసులు..
- వారం రోజుల్లో 164 కొత్త కేసులు
- కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో అధిక వ్యాప్తి
- పరిస్థితి అదుపులోనే ఉందన్న కేంద్ర ప్రభుత్వ వర్గాలు
- సింగపూర్, హాంగ్‌కాంగ్‌ల ప్రభావంతోనే కేసుల పెరుగుదల
- మహేశ్‌బాబు వదినెలకు సోకిన కరోనా

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశంలో కరోనా మహమ్మారి మరోమారు కలకలం రేపుతోంది. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇటీవలి కాలంలో మొత్తం 257 కరోనా కేసులు నమోదైనట్లు వెల్లడైంది. ముఖ్యంగా మే 12వ తేదీ నుంచి వారం రోజుల వ్యవధిలోనే 164 కొత్త కేసులు వెలుగు చూడటం గమనార్హం. అయితే దేశంలో ప్రస్తుత కోవిడ్-19 పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని కేంద్ర ప్రభుత్వ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో కరోనా కేసులు ఇటీవల పెరుగుతున్నాయని, ఆ ప్రభావం కొంతమేర భారత్‌పై కనిపిస్తోందని వారు విశ్లేషిస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని సూచిస్తున్నారు.

కేసుల వారీగా పరిశీలిస్తే, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కరోనా ప్రభావం ఎక్కువగా ఉంది. గత వారం రోజుల్లో కేరళలో 69 కొత్త కరోనా కేసులు నమోదు కాగా,

# ఉగ్ర కదలికలు?

- ఏపీలోని విజయనగరం జిల్లాల్లో ఉగ్ర కదలికలు?
- సీఎస్, డీజీపీకి పవన్ లేఖలు..!
- విజయనగరానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- ఐసిస్ ఆదేశాలతో వారు బాంబులు తయారు చేసినట్లు గుర్తింపు
- పేలుళ్లకు కుట్ర పన్నినట్లుగా నిఘా వర్గాలు గుర్తింపు

2



**విజయనగరం-నవభూమిబ్యూరో**

కేంద్రం పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత ఏపీలోని విజయనగరంలో ఉగ్ర కదలికలు కలకలం రేపాయి. విజయనగరానికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారు ఐసిస్ ఆదేశాలతో బాంబులు తయారు చేసినట్లు గుర్తించారు. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించారు. సీఎస్, డీజీపీలకు ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. ఇందులో పలు కీలక అంశాల్ని పవన్ ప్రస్తావించారు.

జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏపీలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ రాష్ట్ర సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ గుప్తాల్ని కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, డీజీపీకి లేఖలు రాశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం వచ్చిందనీ, దీనిపై సంబంధిత శాఖలతో సమన్వయం అవసరమని ఇందులో తెలిపారు.

విజయనగరంలో ఒక యువకుడికి ఐసిస్‌తో సంబంధాలున్నాయని, పేలుళ్లకు కుట్ర పన్నిన విషయాన్ని తెలుగు రాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించి అరెస్టు చేసిన క్రమంలో మన రాష్ట్ర పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలని పవన్ కోరారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్, అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికిపై, అలాంటివారి కదలికలపైనా అన్ని జిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తమై, ఎక్కడైనా ఉగ్ర నీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.

ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల పరిధిలో ఈ తరహా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీఎస్, డీజీపీల్ని పవన్ కోరారు. రాష్ట్రంలో సుదీర్ఘమైన సముద్ర తీరం ఉంది. కాబట్టి తీర ప్రాంత నిఘా, తీర ప్రాంత రక్షణపై ప్రత్యేక దృష్టి అవసరం అని ఆ లేఖలో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్ర దాడులు,

## మోదీ చేతులమీదుగా తెలంగాణలో
# 3 రైల్వేస్టేషన్లు ప్రారంభం

- 22న 3 రైల్వే స్టేషన్లను పర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని
- బేగంపేట,వరంగల్,కరీంనగర్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పూర్తి
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధితో బేగంపేట రైల్వేస్టేషన్
- కార్పొరేట్‌స్థాయిలో వరంగల్,కరీంనగర్ రైల్వేస్టేషన్లు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్ లను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే, ఇదే క్రమంలో తెలంగాణా రాష్ట్రంలోనూ రైల్వే స్టేషన్ లను అభివృద్ధి చేస్తుంది. ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 22న తెలంగాణా రాష్ట్రంలోని మూడు రైల్వే స్టేషన్లు పునః ప్రారంభం కానున్నాయి. తెలంగాణా మూడు రైల్వే స్టేషన్ల పునః ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ దేశ వ్యాప్తంగా మొత్తం 102 స్టేషన్లు పునః ప్రారంభం కానుండగా, అందులో మూడు తెలంగాణా రాష్ట్ర రైల్వే స్టేషన్లు ఉన్నాయి. బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్ లను ప్రధాని మోదీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఇక ప్రధాని చేతుల మీదుగా పునః ప్రారంభం కానున్న రైల్వే స్టేషన్ల వివరాలలోకి వెళితే 26.55 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునికంగా బేగంపేట రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి చేశారు. 26.55 కోట్ల రూపాయల వ్యయంతో పునరాభివృద్ధి చేశారు. కొత్త స్టేషన్ భవనం,12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫామ్ షెల్టర్, లిఫ్టులు/ఎస్కలేటర్లు, కొత్త వెయిటింగ్ హాల్, కొత్త టాయిలెట్లు ఇలా ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులను కల్పించారు.పునః ప్రారంభానికి రెడీ అయిన కరీంనగర్ రైల్వే స్టేషన్ అదేవిధంగా మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ కార్పోరేట్ తరహాలో ఏసీ వెయిటింగ్ హాల్స్ నిర్మించారు. రైల్వే స్టేషన్ మొత్తం సీసీటీవీ పరిధిలో ఉంచడంతోపాటు పచ్చదనం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నెల 22 తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్ పద్దతిలో ఆదునీకరించిన కరీంనగర్ రైల్వేస్టేషన్ ను ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ క్రింద 2023 ఆగష్టు లో పీఎం నరేంద్ర మోదీ ప్రారంభించారు.

# ఏపీలో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో ఆవర్తనం
- చురుకుగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు
- ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

2



**చెన్నై-నవభూమిబ్యూరో**

బంగాళాఖాతాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. మరింత విస్తరిస్తోన్నాయి. ఈ సాయంత్రానికి దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమోరిన్ రీజియన్, బంగాళాఖాతం దక్షిణ- మధ్య ప్రాంతం, ఈశాన్య బంగాళాఖాతం ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి.

అదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడిందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది తమిళనాడు ఉత్తర ప్రాంతం దిశగా కదులుతోందని వివరించింది. ఫలితంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లల్లో ఓ మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని చెన్నైలోని రీజినల్ ఐఎండీ డైరెక్టర్ అముద తెలిపారు.

బంగాళాఖాతం నైరుతి ప్రాంతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో అప్పర్ ఎయిర్ సైక్లోనిక్ సర్కులేషన్ ఏర్పడిందని, దీని ప్రభావంతో తమిళనాడులో రాబోయే రెండు రోజులు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆమె అన్నారు. ఈ నెల 21వ తేదీ నాటికి అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని, 22న అల్పపీడనంగా మారుతుందని అన్నారు.

ఇది తమిళనాడు ఉత్తర ప్రాంతం దిశగా కదులుతుందని వివరించారు. ఫలితంగా- చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, ఉలుంతూర్ పేట, మైలాడుథురై సహా ఉత్తర ప్రాంతంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. నీలగిరి, కోయంబత్తూర్, తిరుప్పూర్, థేని, దిండిగల్, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తిరుపత్తూరు, వెల్లూరు, తిరువణ్ణామలై, సేలం, కరూర్, నామక్కల్, తిరుచిరాపల్లి జిల్లాల్లో ఈ నెల 24వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు

దీని ప్రభావం ఏపీపైనా పడింది. తమిళనాడు ఉత్తర ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి

## రైతులకు ఉచితంగా
# సోలార్ పంపుసెట్లు

- తెలంగాణలో వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం
- అచ్చంపేట నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- నల్లమల డిక్లరేషన్‌ను ఆవిష్కరించిన సీఎం అనుముల రేవంత్ రెడ్డి
- ఆదివాసీలు,బంజారాలు,చెంచులకు లబ్ధి చేకూరేలా డిక్లరేషన్
- నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో
  "ఇందిర సౌర గిరి జల వికాసం" ప్రారంభించిన సీఎం రేవంత్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

నల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి ఇక్కడ నిలబడి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగుతోందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో

# నేతల అరెస్టులు
# జగన్ వరుస భేటీలు

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే దిశగా జగన్ కార్యాచరణ
- క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి పటిష్టమైన ప్రణాళికలు
- కార్యకర్తల్లో ఉత్సాహం పెంచేందుకు వరుస కార్యక్రమాలు
- నేతల్లో అరెస్టుల పట్ల ఉన్న భయాలను దూరం చేసే ప్రయత్నం

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. వరుస భేటీలను నిర్వహిస్తోన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే దిశగా కార్యాచరణకు సిద్ధమౌతున్నారు. జగన్ 2.0 అంటూ గతంలో ప్రకటించారు జగన్. దీనికి అనుగుణంగా అడుగులు వేస్తోన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటోన్నారు. క్యాడర్‌లో ఊపు తెచ్చే నిర్ణయాలను

## డ్రైవింగ్ నేర్చుకుంటూ పిల్లల మీదకు కారు ఎక్కించిన యువతి

### అక్కాతమ్ముళ్లు మృతి




**సంగారెడ్డి-నవభూమిబ్యూరో:** అమీన్‌పూర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఓ యువతి డ్రైవింగ్ నేర్చుకుంటూ ఇద్దరు పిల్లలపైకి కారు ఎక్కించింది. ఈ ప్రమాదంలో అక్కాతమ్ముళ్లు దుర్మరణం చెందారు.వివరాల్లోకి వెళ్తే.. నవ్యనగర్‌కు చెందిన మహేశ్వరి నర్రెడ్డిగూడెంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటుంది. స్థానిక మైదానంలో ఆమె డ్రైవింగ్ నేర్చుకుంటుండగా.. అక్కడే ఆడుకుంటున్న అక్కాతమ్ముళ్లపైకి కారును పోనిచ్చింది. ఈ ప్రమాదంలో పదేళ్ల మణివర్మ మృతి చెందాడు. ఏకవాణి(14) తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే బాలికను ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏకవాణి కూడా మృతిచెందింది.కాగా, డ్రైవింగ్ నేర్చుకుంటూ ఇద్దరు పిల్లలను బలితీసుకున్న యువతిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

# శశిథరూర్‌పై వేటు?

- శశిథరూర్‌పై కీలక నిర్ణయం దిశగా కాంగ్రెస్?
- శశిథరూర్‌పై చర్యలు తీసుకోవాలని సీనియర్ల ఒత్తిడి..!
- ఇటీవల కొద్దిరోజులుగా ప్రధాని మోదీతో అనుబంధం
- పార్టీ వద్దన్నా..అఖిలపక్ష బృంద పర్యటనకు శశిథరూర్
- పార్టీ నుండి బహిష్కరించాల్సిందేనంటున్న సీనియర్లు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:**కేరళలోని తిరువనంతపురం నుంచి వరుసగా నాలుగో సారి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలిచి పదవిలో కొనసాగుతున్న సీనియర్ నేత శశి థరూర్ కు ఈ మధ్య కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో, ప్రధాని మోడీతో అనుబంధం పెరుగుతోంది. కాంగ్రెస్ అధిష్టానంపై నిత్య అసంతృప్తిగా ఉంటారనే పేరున్న శశి థరూర్ తాజాగా ప్రధాని మోడీ కేరళకు వచ్చినప్పుడు స్వయంగా వెళ్లి స్వాగతం పలకడం, తాజాగా ఆపరేషన్ సింధూర్ సమయంలో కేంద్రంపై పొగడ్తల జల్లు కురిపించడం, ఈ ఆపరేషన్‌పై విదేశాలకు వివరించే అఖిలపక్ష బృందానికి సొంత పార్టీ వద్దన్నా నేతృత్వం వహించేందుకు సిద్ధం కావడం జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి శశిథరూర్ వైదొలగడం ఒక్కటే మిగిలి ఉందని భావిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆయన కాంగ్రెస్

## రూ. 6200 కోట్లకు పైగా
# బ్యాంక్ స్కామ్

- యూకో బ్యాంక్ మాజీ చైర్మన్ అరెస్ట్..!
- కోల్‌కతాకు చెందిన కాంక్యాస్ట్ స్టీల్ అండ్ పవర్
- లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కేసులో ఈ అరెస్ట్
- సీఎస్‌పీఎల్‌కు భారీ ఎత్తున క్రెడిట్ సౌకర్యాలు
- ప్రతిఫలంగా గోయెల్‌కు సీఎస్‌పీఎల్ నుండి ప్రయోజనాలు

2





**కోల్‌కతా-నవభూమిబ్యూరో:** రూ. 6,200 కోట్లకు పైగా విలువైన బ్యాంక్ రుణాల మోసం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై యూకో బ్యాంక్ మాజీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుబోధ్ కుమార్ గోయెల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసినట్లు సోమవారం ప్రకటించింది. కోల్‌కతాకు చెందిన కాంక్యాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కేసులో ఈ అరెస్ట్ జరిగింది.

**మే 16న అరెస్ట్, ఈడీ కస్టడీకి అప్పగింత**

ఈడీ అధికారులు మే 16న సుబోధ్ కుమార్

## నవ వార్త



# తెలంగాణలో భారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరో ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైద రాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం కరీంనగర్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపు లతో వానలు పడే చాన్స్ ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది.

## రాజీవ్ యువ వికాసం స్కీం.. డిప్యూటీ సీఎం కీలక ప్రకటన, డేట్ ఫిక్స్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల యువతకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వనుంది. రాష్ట్రంలోని యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందించడం, నిరుద్యోగ సమస్యను తగ్గించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతను ఆర్థికంగా అభివృద్ధి పరచటం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

80 శాతం వరకు సబ్సిడీతో రూ.50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ పథకానికి ఇప్పటికే యువత నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 14 అప్లికేషన్ ప్రాసెస్ ముగియగా.. లక్షల్లో అప్లయ్ చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జరుగుతోంది. మండల స్థాయి కమిటీలు అర్హులను ఎంపిక చేసి జిల్లా స్థాయి కమిటీలకు జాబితాను అందజేస్తాయి. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువతకు శుభవార్త అందించారు. అచ్చంపేటలో జరిగిన 'ఇందిరా సౌర గిరి జల వికాస' పథకం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. రుణాల మంజూరు ప్రక్రియపై కీలక ప్రకనట చేశారు. రాజీవ్ యువ వికాస పథకానికి జూన్ 2న రూ.1000 కోట్ల నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షమని, ఇందిరమ్మ రాజ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా, రాజీవ్ యువ వికాసం పథకం తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశమనే చెప్పాలి. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందడం ద్వారా యువకులు తమ స్వంత వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా స్థిరపడవచ్చు. ఇది రాష్ట్రంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే కాకుండా, ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది.

## గొడవ మధ్యలో దూరిందని.. మహిళ చూపుడు వేలు కొరేశాడు

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ మధురానగర్‌లో అమానుష ఘటన చోటు చేసుకుంది. చిట్టీ డబ్బుల విషయంలో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీయగా.. ఓ వ్యక్తి మహిళ చూపుడు వేలు కొరికేశాడు. గొడవ మధ్యలో కలుగుజేసుందనే కోపంతో క్షణికావేశంలో చూపుడు వేలును పూర్తిగా కొరికేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చాలామంది చిన్న చిన్న విషయాలకే సహనం కోల్పోయి, ఏం చేస్తున్నామనే ఆలోచన లేకుండా ప్రవర్తిస్తున్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాంతం బాధపెట్టేలా ఉంటున్నాయి. చిన్న విషయాలకే విచక్షణ కోల్పోయి వైలెంట్‌గా తయారవుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ మధురా నగర్‌లో చిట్టీ డబ్బుల విషయంలో తలెత్తిన గొడవ చిలికి చిలికి గాలి వానగా తయారైంది. గొడవ మధ్యలో దూరిందని ఓ వ్యక్తి మహిళ చూపుడు వేలు కొరికేశాడు. ఘటన వివరాల్లోకి వెళితే.. మధురానగర్ జవహర్‌నగర్‌కు చెందిన మమత అనే మహిళ గత మూడేళ్లుగా మధురానగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటోంది. ఆ ఇంటి యజమానురాలు సుజిత చిట్టీలు వేస్తుండగా.. మమత కూడా ఆమె వద్ద చిట్టీలు వేసింది. ఈ చిట్టీల లావాదేవీల్లో సుజిత మమతకు రూ 30 వేలు చెల్లించాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం మమత ఆ ఇల్లు ఖాళీ చేసి తన స్నేహితురాలు సుప్రిను ఆ ఇంట్లోనే అద్దెకు దించింది. అయితే, సుప్రియ హఠాత్తుగా ఇంటిని ఖాళీ చేయడంతో ఇంటి అద్దె విషయంలో సుజితకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో.. తమకు రావాల్సిన చిట్టీ డబ్బుల గురించి మమత, ఆమె భర్త హేమంత్ సుజితను కలిసి అడిగారు. అప్పుడు సుజిత.. సుప్రియ అద్దె చెల్లించకుండా వెళ్లిపోయిందని ఆ అద్దె డబ్బును వారే చెల్లించాలని పట్టుబట్టింది. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ గొడవ జరుగుతుండగా.. సుజిత తల్లి లత మధ్యలో కలగజేసుకుంది. ఆ సమయంలో ఆగ్రహంతో ఉన్న హేమంత్ ఆమె కుడిచేతి చూపుడు వేలును కొరికేశాడు. ఆ దెబ్బకు లత చూపుడు వేలు పూర్తిగా తెగి కింద పడిపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు ఆ వేలును తిరిగి అతికించలేమని తేల్చి చెప్పారు. ఈ సంఘటనతో తీవ్రంగా కలత చెందిన లత మానసిక వేదనకు గురైంది. సుజిత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు హేమంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. క్షణికావేశంలో చేసిన తప్పుకు ఓ మహిళ చూపుడు వేలు కోల్పోవటమే కాకుండా.. వ్యక్తి జైలు పాలయ్యాడు.



## ఐదో రోజు సరస్వతీ పుష్కరాలు.. కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

**కాళేశ్వరం-నవభూమి:** అరకొర సౌకర్యాల నడుమ కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. సోమవారం సందర్భంగా కాళేశ్వర క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి సైకత లింగాలకు పూజలు చేస్తున్నారు. కాళేశ్వర ముక్తేశ్వరుడు, శుభానంద దేవిని దర్శించుకునేందుకు బారులు తీరారు. రద్దీకి తగినవిధంగా ఏర్పాట్లు లేకపోవడంతో భక్తుల ఇబ్బందులు తప్పడంలేదు. పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేయడానికి, దుస్తులు మార్చుకోవడానికి మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక దర్శనాలకోసం క్యూలైన్లలో భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. కాళేశ్వరంలో సర్వస్వతీ పుష్కరాల నిర్వహణ సరిగా లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ధర్మదర్శనం కోసం నిలబడిన భక్తుల క్యూలైన్ ఎంతకూ కదలకపోవడం.. అధికారి పార్టీ నాయకులు తమ అనుచరులు, బంధువులకు నేరుగా గర్భగుడిలోకి తీసుకెళ్లి దర్శనం కల్పించడం వంటి చర్యలతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు సైతం అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సహనం నశించిన భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. క్యూ లైన్‌లో నుంచి బయటికి వచ్చి తోసుకుంటూ ప్రధాన ద్వారం ద్వారా గర్భగుడిలోకి చొచ్చుకెళ్లారు.

ఈ క్రమంలో పోలీసులు మిగిలిన వారిని అడ్డుకుని క్యూలైన్ ద్వారా

# పది రోజుల్లోనే అర్హులకు ఇండ్లు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తొలి దశలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి ఇండ్లు మంజూరు చేశారు. నియోజవర్గానికి 3500 చొప్పున లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకం కింద ఇండ్లులేని నిరుపేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనుంది. మొత్తం నాలుగు విడతల్లో సాయం అందిచనుండగా.. తొలి విడత రూ. లక్ష పలువురి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. తాజాగా.. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. చెంచులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో భూమి లేని చెంచుల విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తామన్నారు. రానున్న పది రోజుల్లోగా అందరికీ ఇండ్లు కేటాయిస్తామని కీలక ప్రకటన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించిన సీఎం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని సోలార్ విద్యుత్ ఆధారిత వ్యవసాయానికి దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రాబోయే వంద రోజుల్లో నియోజకవర్గంలోని రైతులందరికీ వంద శాతం సబ్సిడీతో సోలార్ విద్యుత్ పంపుసెట్లను అమర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా రైతులు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను వ్యవసాయానికి, గృహావసరాలకు వినియోగించుకుని మిగులు విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా నెలకు 3 నుంచి 5 వేల రూపాయల ఆదాయం పొందవచ్చని సీఎం తెలిపారు. ఈ పథకంపై లబ్దిదారులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ఇదే రోజున ఈ పథకం పురోగతిని పరిశీలిస్తానని ఆయన వెల్లడించారు. అందులో భాగంగానే.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో భూమి లేని చెంచుల విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి పది రోజుల్లోగా అందరికీ ఇళ్లు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. సీఎం ప్రకటనతో చెంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా సరైన గూడు లేక కాలం వెళ్లదీస్తున్నామని.. ఇండ్ల నిర్మాణానికి సాయం చేస్తే తమ బతుకులు బాగుపడతాయని అంటున్నారు.

# వరంగల్ రైల్వే స్టేషన్‌కు నయా లుక్



**హైదరాబాద్-నవభూమి:** ఫిబ్రవరి 2024లో వరంగల్ స్టేషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా.. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ప్రయాణికుల కోసం మెరుగైన రవాణా సౌకర్యాలు, ఆధునిక స్టేషన్ భవనం, విశాలమైన వెయిటింగ్ రూమ్‌లు, పరిశుభ్రమైన టాయిలెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత వైఫై సదుపాయంతో పాటు స్టేషన్‌ను నగరంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసే పనులు కూడా చురుగ్గా జరుగుతన్నాయి. మొత్తంగా ఎయిర్‌పోర్టు తరహాలో స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. బీజేపీ తెలంగాణ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అశ్వినీ వైష్ణవ్ ట్వీట్‌ను రీట్వీట్ చేసారు. అమృత్ భారత్ పథకం కింద తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల కల్పనకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోంది. ఇటీవల మనోహరాబాద్-మహబూబ్‌నగర్, మెదక్-సికింద్రాబాద్ వంటి కొత్త లైన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో పాటు కాజీపేట రైల్వే స్టేషన్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఇతర ముఖ్యమైన రైల్వే స్టేషన్లు అయిన నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి వాటిని కూడా అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 117 రైల్వే స్టేషన్లను అభివృద్ధి పరుస్తుండగా.. ఒక్క తెలంగాణలోనే 40 స్టేషన్లు కొత్తగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా తెలంగాణలోని రైల్వే ప్రయాణికులకు విమానాశ్రయ తరహా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

# ఉగ్ర కదలికలు?

(1వపేజీ తరువాయి)తదనంతర పరిణామాలతో దేశ అంతర్గత భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకునే విషయంలో రాష్ట్రంలోని అక్రమ వలసదారులు, ఉగ్రవాద సానుభూతిపరులపై ఇప్పటి వరకూ ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని అనుసరించి మరింత లోతుగా విచారణ చేపట్టాలని కోరారు.

గతంలో రాష్ట్రంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై పూర్తి స్థాయి అప్రమత్తత అవసరం అని.. ఉత్తరాంధ్ర, గోదావరి, మన్యం జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పవన్ సూచించారు. స్లీపర్ సెల్స్, తీవ్రవాద సానుభూతిపరుల ఉనికిని గుర్తించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని తెలిపారు. ఈ లేఖల్లో రోహింగ్యాలపైనా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుంటూరుతోపాటు ఇతర జిల్లాల్లోనూ రోహింగ్యాల ఉనికిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. వీరిలో కొందరికి రేషన్, ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయనే సమాచారం వస్తోందని, ఇది ఆందోళనకర పరిణామం అన్నారు. అనుమానితుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ మొదలైన గుర్తింపు పత్రాలు కలిగి ఉన్నారా? లేదా? అనుమానిత వ్యక్తులు ప్రభుత్వ శాఖల నుంచి ఐడీ కార్డులు, ధ్రువపత్రాలు పొంది ఉంటే వాటిని ఎలా పొందారు? వారికి ఆశ్రయం ఎవరు ఇచ్చారు? స్థానికంగా వారికి ఎవరు సౌకర్యాలు కల్పిస్తున్నారు? వారికి సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థల గుర్తింపు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

జాతీయ భద్రత, ప్రజల భద్రతను అత్యంత ప్రాధాన్యంతాంశంగా పరిగణించి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నేళ్ళ కిందట గుంటూరు, గతేడాది రాయలసీమ ప్రాంతాల్లో ఎన్.ఐ.ఏ. దాడులు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొందన్నారు.

ఈ విషయాన్నీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన పోలీసులు గమనంలోకి తీసుకోవాలని సూచించారు. దేశ భద్రత, రక్షణ అనేవి ఈ తరుణంలో అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నవని, పోలీసులు శాంతిభద్రతలతోపాటు అంతర్గత భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తే కేంద్ర ప్రభుత్వ చర్యలకి రాష్ట్రం సహకారం తోడవుతుందన్నారు.

# జగన్ వరుస భేటీలు

(1వపేజీ తరువాయి)తీసుకుంటోన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి వేగంగా కోలుకున్న జగన్..నూతనోత్తేజాన్ని నింపేలా 2.0ను సిద్ధం చేస్తోన్నారు. ' ఇప్పటికే పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ, జిల్లా అధ్యక్షులతో సమావేశం అయ్యారాయన. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు- పవన్ కల్యాణ్ ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలం కావడం వంటి అంశాలను మరింత ఉధృతంగా జనంలోకి తీసుకెళ్లాలంటూ సూచించారు అప్పట్లో. అదే సమయంలో ఏపీ మద్యం కుంభకోణం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. ఈ కేసులో ఆరోపణలు, విచారణను ఎదుర్కొంటోన్న మాజీ ఐఏఎస్ అధికారి కే ధనంజయ రెడ్డి, పీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధనంజయ రెడ్డి సీఎంఓ కార్యదర్శిగా, కృష్ణమోహన్ రెడ్డి జగన్ కు ఓఎస్డీగా పని చేశారు. ఇప్పుడు వీరిద్దరూ అరెస్ట్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా చెబుతోన్న మద్యం కుంభకోణం కేసులో వీరిద్దరూ విచారణను ఎదుర్కొంటోన్నారు. ఈ కేసులో వీరిద్దరూ ఏ31, ఏ32గా ఉన్నారు. ఇదే కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప అరెస్ట్ అయ్యారు. ఇప్పుడు ధనంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ కావడం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల మధ్య తాజాగా వైఎస్ జగన్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీ కానున్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ ఏర్పాటైంది. కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కార్పొరేటర్లతో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లను ఆహ్వానించారు. వీరితో పాటు ఆయా జిల్లాలకు సంబంధించిన పార్టీ ముఖ్య నాయకులు కూడా హాజరు కానున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన హామీల అమలును నిలదీసేలా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించడంపై దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సంపద సృష్టిస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత సంపద సృష్టించే చిట్కాలను తన చెవిలో చెప్పాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను అడుగుతున్నాడంటూ గతంలో వైఎస్ జగన్ విమర్శించిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి లేనిపోని అపోహలు, అనుమానాలను సృష్టించిందని, దీనివల్ల కొన్ని వర్గాలు తమకు దూరం అయ్యారని జగన్ భావిస్తోన్నారు. వాళ్లందరిని కూడా మళ్లీ పార్టీ వైపు ఆకర్షితులను చేసేలా కార్యాచరణ ప్రణాళిక ఉండాలని అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే విషయంలో జిల్లా అధ్యక్షులు కీలక పాత్ర పోషించాల్సి రావడం, జిల్లా స్థాయిలో జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టడం, అవినీతి, దౌర్జన్యం, ఇతర అక్రమాలపై నిరంతరం స్పందించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా అధ్యక్షులకు జగన్ దిశానిర్దేశం చేస్తారని తెలుస్తోంది.

## రూ. 6200 కోట్లకు పైగా బ్యాంక్ స్కామ్

(1వపేజీ తరువాయి)గోయెల్‌ను ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. మే 17న కోల్‌కతాలోని ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కోర్టులో హాజరుపరచగా, మే 21 వరకు ఈడీ కస్టడీ విధించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దర్యాప్తులో భాగంగా ఏప్రిల్‌లో గోయెల్‌తో పాటు మరికొందరి నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తోంది. CSPL సంస్థకు క్రెడిట్ సౌకర్యాలు మంజూరు చేయడం, ఆ తర్వాత రూ. 6,210.72 కోట్లకు పైగా (వడ్డీ లేకుండా అసలు మొత్తం) రుణాలను పెద్ద ఎత్తున మళ్లించడం, దుర్వినియోగం చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయి. గోయెల్ యూకో బ్యాంక్ సీఎండి ఉన్న సమయంలోనే సీఎస్‌పీఎల్‌కు భారీ ఎత్తున క్రెడిట్ సౌకర్యాలు మంజూరయ్యాయని, వాటిని ఆ తర్వాత లబ్ధిదారులు మళ్లించి, దుర్వినియోగం చేశారని ఈడీ ఆరోపించింది. దీనికి ప్రతిఫలంగా గోయెల్ సీఎస్‌పీఎల్ నుండి "గణనీయమైన అక్రమ ప్రయోజనాలు" (కిక్‌బ్యాక్‌లు) పొందారని ఈడీ తెలిపింది.

ఈ అక్రమంగా సంపాదించిన డబ్బును పలు సంస్థల ద్వారా మళ్లించి, చట్టబద్ధమైన లావాదేవీలుగా చూపించే ప్రయత్నం జరిగిందని ఈడీ పేర్కొంది. దర్యాప్తులో భాగంగా, గోయెల్ డబ్బు, స్థిరాస్తులు, విలాసవంతమైన వస్తువులు, హోటల్ బుకింగ్‌లు వంటి వాటిని షెల్ కంపెనీలు, నకిలీ వ్యక్తులు, కుటుంబ సభ్యుల ద్వారా పొందారని, తద్వారా డబ్బు అసలు మూలాన్ని దాచిపెట్టారని వెల్లడైంది.

షెల్ లేదా నకిలీ కంపెనీల ద్వారా కొనుగోలు చేసిన అనేక ఆస్తులను ఈడీ గుర్తించింది. ఈ షెల్ సంస్థలు గోయెల్ అతని కుటుంబ సభ్యుల ఆధీనంలోనే ఉన్నాయని ఆరోపించింది. ఈ సంస్థలకు చేరిన నిధులు సీఎస్‌పీఎల్ నుండి వచ్చినవే అని ఈడీ పేర్కొంది. కిక్‌బ్యాక్‌లను పద్ధతి ప్రకారం సెటిల్ చేయడానికి ఫ్రంట్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిపినట్లు ఆధారాలు లభించాయని ఈడీ తెలిపింది.

## ఏపీలో భారీ వర్షాలు

(1వపేజీ తరువాయి)అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. వారం రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడానికి అనుకూల వాతావరణం నెలకొని ఉందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకావం ఉందని తెలిపింది.

వచ్చే 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. బాపట్ల, నంద్యాల, అన్నమయ్య రాయచోటి, శ్రీసత్యసాయి పుట్టపర్తి, అనంతపురం, కడప జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## శశిథరూర్‌పై వేటు?

(1వపేజీ తరువాయి)పెద్దలతో టచ్‌లో లేకుండా పోవడం, బీజేపికి క్రమంగా దగ్గరవడం చూస్తుంటే ఇక ఆయన్ను బహిష్కరించడం మినహా మరో మార్గం లేదని పార్టీలో సీనియర్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ పై వివరించేందుకు అమెరికాకు వెళ్లే అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహిస్తున్న శశి థరూర్ అక్కడి నుంచి రాగానే ఆయనపై వేటు వేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ వైఖరికి భిన్నంగా అడుగులు వేస్తున్న శశి థరూర్ ను ఇప్పటికిప్పుడు బహిష్కరించాలని పార్టీలో సీనియర్లు ఒత్తిడి పెంచుతుండటం వెనుక మరో కీలక కారణం కనిపిస్తోంది. థరూర్ ను కాంగ్రెస్ లోనే కొనసాగిస్తే వచ్చే ఏడాది జరిగే కేరళ అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే బీజేపీ కూడా ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే థరూర్ లో ఈ మైండ్ గేమ్ ఆడుతుందని కాంగ్రెస్ సీనియర్లు అంచనా వేస్తున్నారు. అందుకే సాధ్యమైనంత త్వరగా థరూర్ పై వేటు వేసేలా అధిష్టానంతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద వంటి నేతలు చివరి వరకూ పార్టీలోనే ఉండి ఝలక్ ఇచ్చి బీజేపీలోకి వెళ్లారు. ఇప్పుడు ఆ చేదు అనుభవాలు రిపీట్ కాకుండా కాంగ్రెస్ జాగ్రత్త పడుతోంది.

## మళ్లీ కరోనా!

(1వపేజీ తరువాయి)మహారాష్ట్రలో 44, తమిళనాడులో 34 కేసులు నమోదయ్యాయి. కరోనా కారణంగా మహారాష్ట్రలో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, అవి కోవిడ్ మరణాలు కావని వైద్యులు ధృవీకరించారు. మరణించిన ఇద్దరికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినప్పటికీ వారు ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఆ కారణాలతోనే మరణించారని వైద్యులు వివరించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో 56 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**మహేశ్ బాబు వదినకు కరోనా పాజిటివ్**

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు కుటుంబంలో కరోనా వైరస్ కలకలం రేపింది. ఆయన అర్ధాంగి నమ్రతా శిరోద్కర్ సోదరి, ఒకప్పటి ప్రముఖ బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్‌కు కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని శిల్పా స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తున్న ఆమె, తనకు వైరస్ సోకినట్లు అభిమానులకు తెలియజేస్తూ, అందరూ సురక్షితంగా ఉండాలని, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు.

## రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు

(1వపేజీ తరువాయి)రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, పార్టీ నేతలు సహా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికి ఆదర్శంగా నిలిచే.. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నా రు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని.. ఆ దిశగా అధికారులకు సూచనలు చేశానని చెప్పారు. సభా వేదిక నుంచి నల్లమల్ల డిక్లరేషన్‌ను, మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ డిక్లరేషన్‌తో ఆదివాసీలు, బంజారాలు, చెంచులకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుంది. గిరిజన సంక్షేమానికి రూ.12,600 కోట్లు పనులు చేపట్టనున్నారు. నల్లమల్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని, గతంలో పోడు భూములు పోరు భూములుగా మారాయని, ఇప్పుడు వాటిని వ్యవసాయ యోగ్యంగా మారుస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. పోడు భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిది అంటూ ఎద్దేవా చేశారు. పోడు భూముల్లో సోలార్ పంపుసెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిది అని కొనియాడారు.

ప్రస్తుతం వ్యవసాయంలో ఉపయోగిస్తున్న కరెంట్ పంప్ సెట్ల స్థానంలో 100 రోజుల వ్యవధిలో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా.. ప్రభుత్వమే నూటికి నూరు శాతం ఖర్చును భరిస్తుందని చెప్పారు. రైతులకు 5 హెచ్‌పీ , 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల సోలార్ పంప్ సెట్లు ఉచితంగా అందిస్తామన్నారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించిన తరువాత మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం సేకరించి.. ఆ విలువను మహిళా రైతుల ఖాతాల్లో ప్రతి నెల జమ చేస్తుందని వివరించారు. ఈ విధంగా ప్రతి రైతు నెలకు రూ. 3 వేల నుంచి 5 వేల వరకు అదనంగా సంపాదించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 60 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసిందని గుర్తు చేశారు. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని రేవంత్ తెలిపారు. వరి వేస్తే ఉరే అనే పరిస్థితుల నుంచి వరి వేస్తే సిరి అనే పరిస్థితులు కల్పించామని స్పష్టం చేశారు. పేదలందరికీ సన్న బియ్యం అందించి వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది పేదలకు సన్న బియ్యం.. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు సీఎం. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని.. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించామని వివరించారు.

## గొగోయ్‌పై నా ఆరోపణలు తప్పని తేలితే రాజీనామా చేస్తా



న్యూఢిల్లీ-నవభూమి: కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని పదే పదే ఆరోపిస్తున్న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ఆదివారం మరోసారి తన వాదనను పునరుద్ఘాటించారు. తాను చెప్పింది ఏదైనా తప్పు అని తేలితే రాజీనామా చేస్తానని అన్నారు. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ఆహ్వానం మేరకు గొగోయ్ పాకిస్థాన్ వెళ్లారని, అక్కడ శిక్షణ పొందారని శర్మ ఆరోపించారు. తిరిగి వచ్చిన తర్వాత రాఫెల్ కొనుగోలును ఆయన వ్యతిరేకించారని తెలిపారు. గొగోయ్ భార్యకు పాక్ సైన్యంతో మంచి సంబంధాలున్నాయని ఆరోపించారు. నా ఒక్క మాట కూడా తప్పు అని నిరూపితమైతే ముఖ్యమంత్రి పదవికి నేను రాజీనామా చేస్తా అని ఆయన అన్నారు. మరోవైపు తనతోపాటు తన భార్యపై సీఎం హిమంత బిస్వా శర్మ పదే పదే చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తోసిపుచ్చారు. ఆయన చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని అన్నారు. 'అస్సాం ముఖ్యమంత్రి ఆరోగ్యం గురించి నేను ఆందోళన చెందుతున్నా. ఆయన బాగా తెలిసిన వ్యక్తి. నేను అస్సాంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఏదో ఒక కారణంతో నాపై నిఘా ఉంచారు. గత 13 ఏళ్లలో నా గురించి చాలా నిరాధారమైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి వ్యాఖ్యలు పిచ్చితనం, అసంబద్ధతకు దారితీస్తాయి' అని అన్నారు. ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి హిమంత బిస్వా శర్మ లెక్కలేనన్ని సార్లు అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. 2026 తర్వాత

## శరణార్థులకు భారత్ ధర్మసత్రం కాదు..సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ-నవభూమి:ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వాకితి శరణార్థులుగా భారతదేశంలో ఆశ్రయం కల్పించేందుకు.. దేశమేమీ ధర్మశాల కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శ్రీలంకకు చెందిన ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తనను శరణార్థిగా గుర్తించాలని చేసుకున్న అభ్యర్థనపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ సందర్భంగా.. వివిధ దేశాల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం ఇచ్చే ధర్మశాల భారత్ కాదని కోర్టు స్పష్టం చేసింది. ఎల్‌టీటీఈతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో.. 2015లో అరెస్ట్ అయిన ఆ వ్యక్తి.. తన ప్రాణాలకు శ్రీలంకలో ముప్పు ఉందని పేర్కొన్నాడు. అదే సమయంలో తన భార్య పిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని కూడా కోర్టుకు విన్నవించాడు. అయితే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు కేవలం.. భారతీయ పౌరులకు మాత్రమే వర్తిస్తాయని.. పిటిషనర్ చట్ట ప్రకారమే నిర్బంధించబడ్డాడని కోర్టు తేల్చింది. ఒకవేళ ప్రాణాలకు ముప్పు ఉంటే వేరే దేశానికి వెళ్లాలని సూచించింది.శ్రీలంకలో ఒకప్పుడు యాక్టివ్‌గా ఉన్న ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయనే అనుమానంతో.. ఒక శ్రీలంకకు చెందిన ఆ వ్యక్తిని 2015లో అరెస్ట్ చేశారు. అతడిని చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద 2018లో దోషిగా తేల్చిన ట్రయల్ కోర్టు.. 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే ఆ శిక్షను 7 ఏళ్లకు తగ్గిస్తూ.. 2022లో మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే శిక్ష పూర్తి అయిన తర్వాత దేశం విడిచి వెళ్లాలని, బహిష్కరణకు ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది.శ్రీలంక తమిళుడైన ఆ వ్యక్తి.. తాను వీసా పొందిన తర్వాతే భారత్‌కు వచ్చానని సుప్రీంకోర్టుకు విన్నవించాడు. అదే సమయంలో తన స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నాడు. తన భార్య, పిల్లలు ప్రస్తుతం భారత్‌లోనే స్థిరపడ్డారని.. దాదాపు 3 సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్నానని, బహిష్కరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని కూడా కోర్టుకు తెలిపాడు. పిటిషనర్ వాదనలు విన్న జస్టిస్ దీపాంకర్ దత్తా.. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులను భారతదేశం ఆదరించాలా అని ప్రశ్నించారు. ఇప్పటికే 140 కోట్ల మందితో భారత్ ఇబ్బందులు పడుతోందని.. అలాంటి సమయంలో విదేశీయులను ఆదరించడానికి ఇదేమీ ధర్మశాల కాదని తేల్చి చెప్పారు.ఇక భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ).. ఆర్టికల్ 19 (వాక్, సంచలన స్వేచ్ఛతో సహా ప్రాథమిక హక్కులు) కింద పిటిషనర్ తరపు లాయర్ వాదించారు. అయితే పిటిషనర్ చట్ట ప్రకారం అదుపులోకి తీసుకోబడినందున అతని నిర్బంధం ఆర్టికల్ 21ని ఉల్లంఘించదని కోర్టు తేల్చి చెప్పింది. మరోవైపు.. ఆర్టికల్ 19 భారతీయ పౌరులకు మాత్రమే అమలు అవుతుందని స్పష్టం చేసింది. భారత్‌లో స్థిరపడేందుకు ఏం హక్కు ఉందని ఈ సందర్భంగా కోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇక పిటిషనర్‌కు శ్రీలంకలో ప్రాణాలకు ముప్పు ఉంటే.. మరొక దేశానికి వెళ్లాలని సూచించింది.

## అమెరికా డాక్టర్ వద్ద శాటిలైట్ ఫోన్.. విమానం ఎక్కకుండా ఆపేసిన సిబ్బంది




చెన్నై-నవభూమి: అమెరికాకు చెందిన డాక్టర్ వద్ద శాటిలైట్ ఫోన్‌ను ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. దీంతో విమానం ఎక్కకుండా ఆమెను నిలువరించారు. భారత్‌లో నిషేధించిన శాటిలైట్ ఫోన్‌ను ఆ డాక్టర్ కలిగి ఉండటంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అమెరికాకు చెందిన 32 ఏళ్ల రాచెల్ అన్నే స్కాట్ కంటి వైద్యురాలు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులను సందర్శించడానికి ఆమె అక్కడకు వెళ్లింది.కాగా, అనంతరం హైదరాబాద్‌కు వెళ్లేందుకు పుదుచ్చేరి ఎయిర్‌పోర్టుకు రాచెల్ అన్నే స్కాట్ చేరుకున్నది. తనిఖీ సందర్భంగా అమెరికా డాక్టర్ వద్ద ఇరిడియం శాటిలైట్ ఫోన్ ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో విమానం ఎక్కకుండా ఆమెను నిలువరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు. అమెరికాకు చెందిన డాక్టర్ రాచెల్ అన్నే స్కాట్ తమిళనాడులోని మధురైతో పాటు మరికొన్ని ప్రాంతాలను సందర్శించినట్లు తెలుసుకున్నారు.మరోవైపు తురాయ, ఇరిడియం వంటి ఉపగ్రహ ఫోన్‌లను ముందస్తు అనుమతి లేకుండా భారత్‌లో వినియోగించడాన్ని టెలికమ్యూనికేషన్ల శాఖ నిషేధించింది. దీంతో దేశంలోని అన్ని విమానయాన స్థంస్థలు ఈ నిషేధం గురించి ప్రకటించాలని, విదేశీ కార్యాలయాలు, విమాన మ్యాగజైన్ల ద్వారా ప్రయాణికులకు తెలియజేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈ ఏడాది జనవరి 30న ఆదేశించింది. ఈ నేపథ్యంలో శాటిలైన్ ఫోన్లు కలిగిన అమెరికా జాతీయులను డెహ్రాడూన్, చెన్నై విమానాశ్రయాల్లో ఇటీవల నిర్బంధించారు.

## పాకిస్థాన్‌కు జలక్.. ఆసియా కప్ నుంచి తప్పుకున్న బీసీసీఐ



న్యూఢిల్లీ-నవభూమి: ఇండియా, పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. ఆసియా క్రికెట్ మండలి నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండేందుకు ఇండియా డిసైడైంది. దీంతో పాకిస్థాన్‌ను ఏకాకిని చేయాలన్న ఉద్దేశంతో బీసీసీఐ కసరత్తులు చేస్తోంది. మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇప్పటికే ఏసీసీకి బీసీసీఐ చెప్పింది. ఆ టోర్నీని వచ్చే నెలలో శ్రీలంకలో నిర్వహించనున్నారు. ఇక సెప్టెంబర్‌లో జరగనున్న పురుషుల ఆసియా కప్ టోర్నీ నుంచి కూడా ఇండియా తప్పుకున్నట్లు బీసీసీఐ పేర్కొన్నది. వాస్తవానికి ఆ టోర్నీని ఇండియానే నిర్వహించాల్సి ఉంది.ఆసియా క్రికెట్ మండలి ప్రస్తుతం అధిపతిగా మోషిన్ నఖ్వీ ఉన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ కూడా ఆయనే. పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. ఏసీసీ చీఫ్ ఓ పాకిస్థాన్ మంత్రి, అలాంటి వ్యక్తి నేతృత్వంలో జరిగే టోర్నీల్లో ఇండియా పాల్గొనబోదని బీసీసీఐ పేర్కొన్నది. టోర్నీల నుంచి తప్పుకున్న విషయాన్ని ఏసీసీకి చెప్పామని, కేంద్ర ప్రభుత్వంతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు బీసీసీఐ పేర్కొన్నది.ఇండియా తప్పుకోవడంతో ఆసియా కప్ టోర్నీపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఎందుకంటే ఆ టోర్నీకి ఈసారి ఇండియానే ఆతిథ్యం ఇవ్వాల్సి ఉన్నది. ఆసియా కప్ ప్రసార హక్కులను గత ఏడాది సోనీ పిక్చర్స్ నెట్వర్క్ సుమారు 17 కోట్ల డాలర్లకు 8 ఏళ్ల కోసం కొనుగోలు చేసింది. ఒకవేళ టోర్నీ రద్దు అయితే, అప్పుడు ఆ డీల్ గురించి సోనీ వర్కౌట్ చేయాల్సి ఉంటుంది.ఇండోపాక్ ఉద్రిక్తతల వేళ గతంలో కూడా ఆసియాకప్‌పై ప్రభావం చూపాయి. 2023లో పాకిస్థాన్‌కు భారత జట్టును బీసీసీఐ పంపలేదు. దీంతో ఆ టోర్నీని తటస్థ వేదిక శ్రీలంకలో నిర్వహించారు. ఇండియా అక్కడే అన్ని మ్యాచ్‌లు ఆడింది. ఇలాగే ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించారు.

## యూట్యూబర్ జ్యోతికి షాక్.. ఇన్‌స్టా ఖాతా సస్పెండ్



న్యూఢిల్లీ-నవభూమి: గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కు బిగ్ షాక్ తగిలింది. పాక్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సస్పెండ్ అయ్యింది ఆమె ఖాతాను మెటా బ్లాక్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇన్‌స్టా ఖాతా బ్లాక్ అయినప్పటికీ ఆమె యూట్యూబ్ ఛానల్ మాత్రం అందుబాటులోనే ఉంది.పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రా ను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆమె 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది.అంతేకాదు ఓ పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో సన్నిహితంగా మెలుగుతున్నట్లు కూడా తేలింది. అతడితో ఆమె అంతర్జాతీయ ట్రిప్‌కు కూడా వెళ్లింది. ఇండోనేషియాలోని బాలికి విహారయాత్రకు వెళ్లి వచ్చినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. జ్యోతిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ఇక దర్యాప్తులో తాను తప్పు చేసినట్లు జ్యోతి రాతపూర్వకంగా అంగీకరించినట్లు సమాచారం. జ్యోతితోపాటు మరో ఐదుగురి గుట్టును కూడా అధికారులు బయటపెట్టారు. వారందరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.కేసు విచారణలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు అక్కడ వీడియోలు తీసినట్లు కూడా అధికారులు గుర్తించారు. ఆ వీడియోలను పాక్ ఏజెంట్ల తో పంచుకున్నట్లు భావిస్తున్నారు. దీనిపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడికి దాదాపు మూడు నెలల ముందు ఆమె తరచూ జమ్ము కశ్మీర్‌లో పర్యటించినట్లు కూడా అధికారులు గుర్తించారు. ఒకసారి చైనాకు కూడా వెళ్లొచ్చినట్లు తేలింది.

## కల్నల్‌పై మంత్రి మాటలకు మరోసారి సుప్రీం ఫైర్



న్యూఢిల్లీ-నవభూమి:ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలు అందజేసిన మహిళా అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్య ప్రదేశ్ మంత్రి విజయ్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే మంత్రిపై ఇప్పటికే దేశ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తం కాగా.. నాలుగు రోజుల క్రితమే సుప్రీం కోర్టు సైతం దీనిపై స్పందించింది. మీరు ఎవరు గురించి ఏ మాట్లాడుతున్నారంటూ మండి పడింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండని కూడా సూచించింది. ఇలా సుప్రీం ఆదేశాలతో మంత్రి విజయ్ షా క్షమాపణలు చెప్పారు. కానీ సారీ చెప్పిన విధానం చూస్తుంటే.. తప్పు తెలుసుకుని చెప్పినట్లు అనిపించలేదని, న్యాయ విచారణ నుంచి తప్పించుకోవడానికి మాత్రమే చెప్పినట్లు అనిపించిందని వ్యాఖ్యానించింది. అందుకే ఆయన క్షమాపణలను తిరస్కరిస్తూ.. ప్రత్యేక సిట్ నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆరపేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషి గురించి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలు అందరికీ తెలిసిందే. అయితే దేశ చరిత్రలోనే తొలిసారి మిలటరీ ఆపరేషన్‌కు సంబంధించి బ్రీఫింగ్ ఇచ్చిన తొలి మహిళా అధికారిగా రికార్డు సాధించిన ఆమెపై మధ్య ప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా కల్నల్ సోఫియా ఖురేషి ఉగ్రవాదుల సోదరి అంటూ తీవ్ర అభ్యంతరకరంగా మాట్లాడారు. ఆపై ఈ వీడియో వైరల్ కాగా.. దేశ వ్యాప్తంగా మంత్రిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. ముఖ్యంగా ఆయన్ను మంత్రి పదవిలోంచి తొలగించాలంటూ డిమాండ్ చేశారు. జాతీయ మహిళా కమిషన్ సైతం దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.మరోవైపు హైకోర్టు కూడా దీనిపై స్పందించి కేసును సుమోటోగా స్వీకరించింది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీకి తెలిపింది. ఇలా ఆయనపై కేసు నమోదు కాగా.. మంత్రి సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీనిపై నాలుగు రోజుల క్రితమే స్పందించిన అత్యున్నత న్యాయస్థానం ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరిస్తూనే.. ఆయన తీరును తప్పు పట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారంటూ మండి పడింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు తెలపండి అంటూ వ్యాఖ్యానించింది. అలాగే ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించడని ఆగ్రహం వ్యక్తం చేసింది.దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లి క్షమాపణలు చెప్పినప్పటికీ.. అవి తప్పు తెలుసుకుని చెప్పినట్లు అనిపించలేదని సుప్రీం కోర్టు నేడు వ్యాఖ్యానించింది. క్షమాపణలు ఎక్కడ చెప్పారు, ఎలా చెప్పారని ప్రశ్నించింది. సారీ చెబుతున్నప్పుడు అందులో అర్థం ఉంటుందని.. కొందరు న్యాయ విచారణను తప్పించుకునేందుకు మాత్రమే సారీ చెబుతారని వివరించింది. అలాగే మరికొన్ని సార్లు మొసలి కన్నీరు కారుస్తారని చెప్పింది. ఇందులో మీ క్షమాపణ ఎలాంటిదో చెప్పాలని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. అలాగే మీరో ప్రజాప్రతినిధిగా ఉన్నారని, అలాంటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రతీ పదాన్ని ఆచితూచి మాట్లాడాలని మీ వీడియోను మేము కూడా చూశామని చెప్పుకొచ్చారు.మీరు చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలంతా సిగ్గుతో తలవంచుకోవాల్సి వచ్చిందని.. ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలపై విచారణకు ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక సిట్ నియమించాలని ఆదేశారు జారీ చేశారు. అలాగే అందులో ఒక మహిళా ఐపీఎస్ ఉండాలని తేల్చి చెప్పారు. ఈ నెల 28వ తేదీ లోపు విచారణకు సంబంధించిన నివేదికను అందజేయాలని కూడా సూచించారు. అయితే అరెస్టు నుంచి మనహాయింపు కల్పించిన కోర్టు.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.

## ఇలాంటి తల్లి ఎవ్వరికీ ఉండకూడదు.. మరీ నీచంగా..



న్యూఢిల్లీ-నవభూమి:ప్రియుడి మోజులో పడి ఓ తల్లి మానవత్వం మరిచి పోయింది. పసి పాపపై దారుణానికి పాల్పడింది. ఏ తల్లీ చేయకూడని నీచానికి ఒడికట్టింది. కన్న కూతురిపై ప్రియుడితో అత్యాచారం చేయించింది. దీంతో పాప చనిపోయింది. ఈ దారుణ సంఘటన ముంబైలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముంబై, మల్వానీకి చెందిన 30 ఏళ్ల మహిళను మూడేళ్ల క్రితం భర్త వదిలేశాడు. ఆ సమయంలో ఆమె గర్భంతో ఉంది. భర్త దూరంగా వెళ్లిపోయిన తర్వాత ఓ పాపకు జన్మనిచ్చింది.ఆ మహిళ పుట్టింటి దగ్గర ఉంటోంది. గత కొంత కాలం నుంచి 19 ఏళ్ల ఓ యువకుడితో సంబంధం కొనసాగిస్తోంది. ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుస్తూ ఉండేవారు. గత రాత్రి ఆ తల్లి, ప్రియుడు రాక్షసుల్లా మారిపోయారు. ఆ యువకుడు తల్లి కళ్ల ముందే కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తీవ్రంగా గాయపడింది. కేకలు వేస్తూ అక్కడికక్కడే చనిపోయింది. బాలిక ఉలుకు, పలుకు లేకుండా పడిపోవటంతో భయపడిపోయిన తల్లి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లింది.అక్కడి వైద్యులు పాపను పరీక్షించారు. అత్యాచారం కారణంగా పాప చనిపోయిందని ధ్రువీకరించారు. ఆ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఆస్పత్రికి వచ్చారు. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పాప తల్లిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆమె అసలు విషయాలు బయటపెట్టింది. ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జ్యోతిని పావుగా వాడుకున్న పాక్! కొత్త తరహా యుద్ధంతో..




న్యూఢిల్లీ-నవభూమి:పహల్గాం దాడి దరిమిలా ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా గాలింపులు చేపడుతోంది. ఇందులో భాగంగా టెర్రరిస్టులకు సహకరిస్తున్న వారిని గుర్తించడం మీద నిఘా వర్గాలు ఫోకస్ చేశాయి. గూఢచర్యం చేస్తూ మన ఆర్మీ రహస్యాలను శత్రుదేశానికి చేరవేస్తున్న దేశద్రోహుల కోసం వేటాడుతున్నాయి. ఇప్పటికే గూఢచర్యం చేస్తున్న పలువుర్ని అదుపులోకి తీసుకున్నారు అధికారులు. వారిలో జ్యోతి మల్హోత్రా ఉదంతం సంచలనంగా మారింది. ఆమె కేసులో ఒక్కొక్కటిగా నమ్మలేని విషయాలు బయటకు వస్తున్నాయి. పహల్గాం దాడికి కొన్ని నెలల ముందు ఆ ప్రాంతానికి ఆమె వెళ్లడం, పాక్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ రాయబార కార్యాలయ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధం ఉందనే విషయాలు సంచలనంగా మారాయి. ఈ తరుణంలోనే జ్యోతిని పాక్ పావుగా వాడుకుందనే మరో విషయం బయటకు వచ్చింది.

ఆయుధంలా వాడాలని..కొత్త తరహా యుద్ధం కోసం జ్యోతి మల్హోత్రాను పాకిస్థాన్ ఆయుధంగా వాడుకుందని తెలిస్తోంది. భారత్‌తో సమాచార యుద్ధం (ఇన్‌ఫర్మేషన్ వార్‌ఫేర్)లో జ్యోతిని కీలక ఆయుధంగా మలచుకోవాలని, సమయాన్ని బట్టి వాడుకోవాలని పాక్ అనుకుందట. ఇందులో భాగంగానే ఆమెతో పాకిస్థాన్‌కు అనుకూలంగా ప్రచారం చేయించారని సమాచారం. ఇన్‌ఫర్మేషన్ వార్‌ఫేర్‌లో భాగంగా ఒకవైపు పాక్ అనుకూలిత ప్రచారం చేయించడంతోపాటు మరోవైపు భారత్‌పై విద్వేషం పెరిగేలా చేయడంలోనూ జ్యోతిని వాడుకోవాలని డిసైడ్ అయ్యారని వినిపిస్తోంది.కూపీ లాగుతున్నారు!పాకిస్థాన్ అనుకూల ప్రచారాలను పక్కనబెడితే.. భారత మిలటరీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రుదేశానికి పంపారా? అనే కోణంలో జ్యోతిని విచారిస్తున్నారట పోలీసులు. జ్యోతితోపాటు పాక్‌ను సందర్శించిన ఆమె స్నేహితులు, ఇతర ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్లనూ అధికారులు ఇన్వెస్టిగేట్ చేస్తున్నారట. కాగా, 2023, 2024తోపాటు 2025లోనూ పాక్‌కు జ్యోతి వెళ్లినట్లు బయటపడింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు మార్చి నెలలో శత్రుదేశాన్ని ఆమె సందర్శించిందని తెలిసింది.

## మౌనం విపత్కరం.. జైశంకర్‌పై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు, బీజేపీ కౌంటర్..


న్యూఢిల్లీ-నవభూమి:కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ విమర్శల పర్వం కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడానికి ముందే కేంద్రం ఆ సమాచారాన్ని పాక్‌కు తెలియజేయడం తప్పిదమే కాకుండా నేరమని అన్నారు. "విదేశాంగ మంత్రి నిశ్శబ్దం కేవలం సమాచారాన్ని వెల్లడించడం కాదు, అది విపత్కరం" అని రాహుల్ గాంధీ తాజా ట్వీట్‌లో పేర్కొన్నారు. గతంలో అడిగిన ప్రశ్ననే మళ్లీ అడుగుతున్నానని, పాకిస్థాన్‌కు ముందుగానే సమాచారం తెలిసినందు వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? ఇది తప్పిదం కాదు, నేరం. దేశానికి నిజం తెలియాలని ఆ ట్వీట్‌లో విదేశాంగ మంత్రిని రాహుల్ ప్రశ్నించారు. రాహుల్ విమర్శలపై బీజేపీ వెంటనే స్పందించింది. మంత్రి వ్యాఖ్యలను విపక్ష నేత వక్రీకరిస్తున్నారని, ఆయన ఇలాంటి ప్రశ్నలు వేస్తున్న సమయం చూస్తే దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారనే విషయం అవగతమవుతోందని తప్పుపట్టింది.

## అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్‌ను టార్గెట్ చేసిన పాకిస్తాన్




న్యూఢిల్లీ-నవభూమి:జమ్మూ కాశ్మీర్‌లోని నవభూమి:జమ్మూ కాశ్మీ ర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లలోని ఉగ్రవాద శిబిరాలే టార్గెట్‌గా భారత సైన్యం విరుచుకుపడింది. మొత్తం 9 ఉగ్రవాద క్యాంప్‌లపై దాడులు చేసి 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ ఘటన తర్వాత రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తగా.. భారత్‌పైకి చైనా ఇచ్చిన డ్రోన్లు, క్షిపణులను పాకిస్తాన్ ప్రయోగించింది. అయితే భారత్ తయారు చేసినవే కాకుండా రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ఎస్-400 మిసైల్ సిస్టమ్ కూడా పాక్ దాడులను సమర్థవంతంగా అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్‌లోని కీలక ప్రాంతాలపై పాకిస్తాన్ దాడులు చేయాలని నిర్ణయించుకున్నా.. భారత డిఫెన్స్ సిస్టమ్ ముందు అవేమీ పని చేయలేదు. దీంతో ప్రపంచ దేశాల ముందు పాక్ నవ్వులపాలైంది. అయితే ఈ దాడులకు సంబంధించి కీలక విషయాలు బయటికి వచ్చాయి.పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ భారీ వైమానిక దాడిని జరిపిందని.. అయితే ఈ దాడిని భారత సైన్యం విజయవంతంగా తిప్పికొట్టింది. డ్రోన్లు, లాంగ్ రేంజ్ మిసైల్స్‌లతో పాక్ నుంచి దాడులు జరగ్గా.. అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఉన్న భారత్.. వాటిని గుర్తించి తక్షణమే అడ్డుకున్నట్లు ఇండియన్ ఆర్మీ తెలిపింది. ఆకాష్ మిసైల్ సిస్టమ్, ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్‌లతో సహా అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించి.. అమృత్‌సర్ స్వర్ణ దేవాలయానికి ఎలాంటి నష్టం జరగకుండా కాపాడినట్లు వెల్లడించింది. అయితే ఆపరేషన్ సిందూర్ వేళ.. దేశంలోని ముఖ్యమైన మతపరమైన ప్రదేశాలపై దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని నిఘా వర్గాలు ముందుగానే హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే గోల్డెన్ టెంపుల్ చుట్టూ మరిన్ని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను మోహరించారు. ఈ కారణంగానే పాకిస్తాన్ వైమానిక దాడి నుంచి రక్షణ లభించినట్లు ఇండియన్ ఆర్మీ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి ఇండియన్ ఆర్మీకి చెందిన సీనియర్ అధికారి మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి మాట్లాడుతూ.. మే 8వ తేదీన తెల్లవారుజా మున పాకిస్తాన్ మానవరహిత వైమానిక ఆయుధాలు, ప్రధానంగా డ్రోన్లు, లాంగ్ రేంజ్ క్షిపణులతో భారీ వైమానిక దాడికి దిగిందని తెలిపారు. అయితే ఇలాంటి దాడులను ముందుగానే ఊహించినందున తాము ప్రతిదాడికి పూర్తిగా సిద్ధమై ఉన్నట్లు చెప్పారువెంటనే అలర్ట్ అయిన ఇండియన్ ఆర్మీ.. ఎయిర్ డిఫెన్స్ గన్నర్లను ఉపయోగించి పాకిస్తాన్ దాడులను భగ్నం చేశారని స్పష్టం చేశారు. స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకున్న జరిపిన అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేసినట్లు తెలిపారు. దీంతో గోల్డెన్ టెంపుల్‌కు చిన్న గీత కూడా పడకుండా ఇండియన్ ఆర్మీ కాపాడినట్లు మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు.

## దాయాదీ మళ్లీ దుష్టపన్నాగాలు



న్యూఢిల్లీ-నవభూమి: ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో 26 మంది పర్యాటకుల ప్రాణాలు పోయిన ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య మొదలైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన భారత సైన్యం.. మే 7 తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి ప్రవేశించి ఉగ్రస్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీనిని జీర్ణించుకోలేని పాకిస్థాన్.. భారత్ సరిహద్దు నగరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా దాడులకు యత్నించింది. నాలుగు రోజులు ఇరు సైన్యాల మధ్య కొనసాగిన ఘర్షణలు.. మే 10న కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టాయి. ఇదిలా ఉండగా, సరిహద్దుల్లో మరోసారి ఉగ్రమూకలను కశ్మీర్‌లోకి ఎగదోసేందుకు పాకిస్థాన్ కుట్రలు చేస్తున్నట్టు సంచలన నివేదిక వెలుగులోకి వచ్చింది.ఆ నివేదిక ప్రకారం.. లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన ముష్కరులు భారత సరిహద్దుకు సమీపంలో చొరబాటుకు సిద్ధంగా ఉన్నారు. పహల్గామ్ దాడి కూడా లష్కరే సంబంధం ఉన్న ది రెసిడెంట్ ఫ్రంట్ హస్తం ఉన్న విషయం తెలిసిందే.ఓ జాతీయ పత్రిక నివేదిక ప్రకారం..శనివారం పాకిస్థాన్ సైన్యం, లష్కరే తొయిబా (ఉగ్రవాదులు నియంత్రణ రేఖ వద్ద చేరినట్టు తెలుస్తోంది. న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్ట్ తాహా సిద్దీకీ ఎక్స్ ( ట్విట్టర్)లో పోస్ట్ చేస్తూ.. పాక్ సైనికాధికారులతో లష్కరే తొయిబా కమాండర్లు పాక్-ఆధిపత్య కశ్మీర్లో సమావేశమయ్యారని, ఆ తరువాత వారు నియంత్రణ రేఖ వద్దకు వెళ్లారని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆర్మీ.. సరిహద్దుల్లో భూగర్భ సొరంగాలను ద్వారా భారత్‌లోకి లష్కర్ తొయిబా ఉగ్రవాదులను పంపే ప్రయత్నాలు చేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వైమానిక, సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. పాకిస్థాన్ సొరంగాలను ఉపయోగించుకుని అడవుల్లో, గిరిజన ప్రాంతాల్లో దాడులకు ఉగ్రవాదులు ప్రయత్నించినట్టు గతంలో నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఏప్రిల్‌లో ఓ జాతీయ మీడియా నివేదిక కూడా భూగర్భ సొరంగాలను చొరబాటుకు ఉపయోగించ్చేకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో మరోసారి అలాంటి నివేదికలు వెలుగులోకి రావడంతో బీఎస్ఎఫ్, భారత సైన్యం తమ నిఘాను పెంచాయి.పహల్గామ్ దాడి తర్వాత ఒక అధికారి మాట్లాడుతూ.. 'పాకిస్థాన్ కందకాల కింద చాలా లోతైన సొరంగాలు తవ్వింద? తద్వారా చొరబాట్లు జరగొచ్చా? అవసరమైతే మన దళాలను పంపొచ్చా? అని తెలుసుకునే పనిని మాకు అప్పగించారు' అని చెప్పారు. సొరంగం నిర్మాణంలో సహాయానికి సరిహద్దు సమీపంలో మాజీ సైనికులను కూడా పాక్ మోహరించిందని అధికారులు చెప్పినట్లు నివేదిక పేర్కొంది.



## మోకాలడ్డిన టీఎంసీ, డెలిగేషన్ నుంచి యూసుఫ్ పఠాన్ ఔట్

**న్యూఢిల్లీ-నవభూమి:** దాయాది పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఎలా ఆశ్రయం కల్పిస్తుందో ప్రపంచానికి చెప్పడానికి, భారతదేశం మీద పాక్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడానికి కేంద్రం ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ సిందూర్ ఔట్రీచ్' కార్యక్రమానికి సహకరించేందుకు తృణమూల్ కాంగ్రెస్ అభ్యంతరం చెప్పింది. తమ పార్టీ ఎంపి అయిన యూసుఫ్ పఠాన్‌ను తమకు తెలియపర్చకుండా డెలిగేషన్‌లోకి ఎలా తీసుకుంటారని కేంద్రాన్ని నిందించింది. అంతేకాదు, తమ పార్టీ ఎంపీ అయిన యూసఫ్ పఠాన్ ఈ బృందం నుంచి తప్పుకుంటున్నారని తేల్చిచెప్పింది.కాగా, మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'ఆపరేషన్ సిందూర్ ఔట్రీచ్' ప్రతినిధి బృందంలో యూసఫ్ పఠాన్‌ను చేర్చిన సంగతి తెలిసిందే. కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు చెందిన ఈ ఎంపీల బృందం 30 దేశాలను సందర్శించి భారత వాణి వినిపించాలని తలపెట్టారు. అయితే, తమ పార్టీని సంప్రదించకుండానే బహరాంపూర్ ఎంపి అయిన యూసఫ్ పఠాన్ పేరును చేర్చారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపిస్తోంది."తృణమూల్ ప్రతినిధిపై కేంద్ర ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదు? ఒక పార్టీ ఏ ప్రతినిధిని పంపాలో నిర్ణయించడానికి వారు ప్రతిపక్షాలతో చర్చలు జరపాలి. తృణమూల్ ఏ ప్రతినిధిని పంపాలో బిజెపి ఎలా నిర్ణయించగలదు" అని టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ అన్నారు.పాకిస్తాన్ సరిహద్దు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి వివిధ దేశాలను సందర్శించే బహుళ-పార్టీ ప్రతినిధులలో పఠాన్ లేదా మరే ఇతర టిఎంసి ఎంపి భాగం కాదని కూడా తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి."దేశం అన్నింటికంటే గొప్పదని మేము విశ్వసిస్తున్నాం. మన గొప్ప దేశాన్ని రక్షించడానికి అవసరమైన ఏ చర్య తీసుకున్నా కేంద్ర ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుందని చెప్పాం. మన సాయుధ దళాలు మన దేశాన్ని గర్వించేలా చేశాయి.

## సిక్కిం విలీనానికి ఏభై ఏళ్ళు

స్వతంత్ర భారత చరిత్రలో సిక్కిం విలీనం ఒక ప్రధాన ఘట్టం. మే 16, 1975న జరిగిన ఈ చారిత్రక ఘట్టానికి ఏభై ఏళ్ళు నిండినందున నాటి గొలుసుకట్టు సంఘటనలు, రాజకీయ పరిస్థితులు, ఇందిరాగాంధీ దూరదృష్టి వంటి అంశాలను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భారతదేశానికి ఈశాన్య సరిహద్దులో నేపాల్, భూటాన్‌ల నడుమ ఒక రాష్ట్రం సిక్కిం. వైశాల్యంలో గోవాకు ఒక మెట్టు పైన ఉండే సిక్కిం, జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రం. ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంతతకు నెలవై, హిమాలయాల పర్వతశ్రేణి ఒడిలో ఒదిగి 500 సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్న దీని చరిత్ర ఆద్యంతం ఆసక్తికరమైనదే. ఎనిమిదవ శతాబ్దంలో పద్మసంభవ (టిబెటన్ భాషలో గురు రింపోచే) అనే బౌద్ధగురువు టిబెట్‌తో పాటు సిక్కింకు వజ్రయాన బౌద్ధాన్ని పరిచయం చేయగా, కొన్ని శతాబ్దాల తరువాత రాజ వంశీకులు (చొగ్యాల్) దానిని అవలంబించారు. ఇరుగు పొరుగు రాజ్యాలైన నేపాల్, భూటాన్‌ల దాడులకు గురైనప్పుడల్లా సిక్కింను టిబెట్ కాపాడేది. 18వ శతాబ్దపు చివర్లో చైనాకు చెందిన క్వింగ్ రాజులు కొన్నాళ్ళు పాలించగా, 1853లో ఈస్ట్ ఇండియా కంపెనీ (బ్రిటిష్) పరమైంది. ఎన్నో మలుపులు తిరిగిన తరువాత 1918లో బ్రిటిష్ ప్రభుత్వం... రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా సిక్కింకు అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సిక్కిం స్టేట్ కాంగ్రెస్ 1948లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించింది. సిక్కిం రాజు%-% భారత ప్రధాని నెహ్రూ సహాయం కోరగా, భారత్ ఒక దివాన్‌ను, కొంత భద్రతా బలగాన్ని అక్కడకు పంపించింది. అప్పుడు ఉత్పన్నమైన విలీన ప్రతిపాదనను "చిన్నదైన ఒక సార్వభౌమ దేశాన్ని కబళించామన్న అపప్రథ తమకు అక్కరలేదని, పైగా ఆ విలీనం చైనాను రెచ్చగొట్టేదిగా కనిపిస్తుంది" అంటూ తిరస్కరించారు నెహ్రూ. 1950లో భారత రక్షణలో మెసిలే రాజ్యంగా సిక్కిం అవతరించింది. 1962లో జరిగిన చైనా%-%భారత్ యుద్ధం భారత రక్షణ వ్యవస్థలో పెను మార్పులకు దారి తీసింది. రక్షణ విషయంలో లాల్ బహదూర్ శాస్త్రి, తరువాత ఇందిరా గాంధీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 1967లో సిక్కిం%-%చైనా సరిహద్దుల్లో గల నాథులా, చోలా కనుమల వద్ద ఇనుప కంచె వేస్తున్న భారత సరిహద్దు దళాల సైనికులను చైనా సైనికులు వెనక్కు జరగమన్నారు. అయినా భారత దళాలు వెనుకడుగు వేయలేదు. ఫలితంగా ఘర్షణ జరిగింది. నాథులా కనుమ వద్ద సెప్టెంబర్‌లో, చోలాలో అక్టోబర్‌లో జరిగిన ఘర్షణలలో ఇరువైపులా ప్రాణ నష్టం జరిగింది. భారత శక్తిని తక్కువ అంచనా వేసిన చైనా దళాలు, మన సైనికుల తెగువతో వెనుదిరిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కిం భౌగోళిక, వ్యూహాత్మక ప్రాముఖ్యతపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రణాళికా రచనలో నిమగ్నమయ్యారు. సిక్కిం ఉత్తరాన ఉన్న చుంబి లోయపై చైనా కన్నువేసిందని ఆమెకు స్పష్టమైన సంకేతాలు అందాయి. సిక్కిం విషయంలో ఒక బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించి, వెంటనే పావులు కదిపారు. 1973లో జరిగిన ప్రజా ఉద్యమం ధాటికి చొగ్యాల్ (సిక్కిం చక్రవర్తిని చొగ్యాల్‌గా పిలిచేవారు) భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించగా, భారత్ 1200 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పంపి ఉద్యమాన్ని నియంత్రించింది. అయినా 1974లో సిక్కిం ప్రధానమంత్రి కాజీ లెండుప్ దర్జీ, సిక్కింను భారత్‌లో విలీనం చేయమని ఇందిరా గాంధీకి విజ్ఞప్తి చేయగా, ఆ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. విలీనం రెఫరెండం ద్వారా జరగాలని నిర్ణయించి, భారత ప్రభుత్వ బలగాల పర్యవేక్షణలో సిక్కిం ఎలక్షన్ కమిషన్‌కు ఆ పని అప్పజెప్పారు. ఏప్రిల్ 6న భారత్ భద్రతా సైనికులు రాజప్రాసాదంలోకి ప్రవేశించి 243 మంది సిక్కిం సైనికులను నిరాయుధులను చేశారు. దురదృష్టవశాత్తు ఒక సైనికుడు మరణించాడు.

రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, విలీనానికి మద్దతుగా 59,637 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 1,496 ఓట్లు పడ్డాయి. ఈ రెఫరెండం ప్రక్రియ మోసపూరితంగా భారత భద్రతా దళాల తుపాకుల కనుసన్నలలో జరిగిందని చైనా, పాకిస్తాన్‌లు విమర్శించాయి. దీనిని తిప్పికొడుతూ ఆజాద్ కశ్మీర్, టిబెట్‌ల వైనాలను ఇందిరాగాంధీ ఉదహరించారు. సిక్కిం విద్యార్థుల నిరసనను మన దళాలు సునాయాసంగా అణచివేశాయి. ఆండ్రూ డఫ్ అనే ఆంగ్ల పాత్రికేయుడు తన '%హాఅనెనెఅఎ: =వనబఅవఎ టశీతీ ఖ ఎఅఝెశ్రీఝఖఅ ఖఅఅస్త్రసశీఎ%' గ్రంథంలో నాటి సంఘటనలు పూసగుచ్చినట్లు వర్ణించాడు. 1975, ఏప్రిల్ 11%-%16 మధ్య జరిగిన రెఫరెండం భారత్‌లో సిక్కిం విలీనానికి మార్గం సుగమం చేసింది. సిక్కిం భారత్‌లో విలీనానికి రాజకీయ పరిస్థితులకు, సాంస్కృతిక కారణాలు కూడా తోడయ్యాయి. అదే ఏడాది మే 16న పార్లమెంట్‌లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను 22వ రాష్ట్రంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి సిక్కిం విలీనం ద్వారా ఇందిరాగాంధీ తన రాజకీయ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మరొకసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. పర్యాటకుల స్వర్గధామమైన ఈ రాష్ట్రం, భారత సరిహద్దులలో ప్రకాశించే

## నగరాల్లో మారణహోమం సృష్టిస్తున్న అగ్నిజ్వాలలు: నిర్లక్ష్యానికి భారీ మూల్యం



హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహ పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. ఇది కేవలం వార్త కాదు, మేల్కొలుపు పిలుపు. భారతదేశం వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు ఎంత నిస్సహాయంగా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక విషాద ఘటన మాత్రమే కాదుబీ వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయని అనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల కలయిక పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి.

**తక్షణ కారణాలు:**
నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేని వ్యక్తులతో చేయించిన తాత్కాలిక మరమ్మతులు – ఇవన్నీ షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే వస్తువులైన పెయింట్స్, రసాయనాలు, ప్లాస్టిక్ వంటివి అజాగ్రత్తగా నిల్వ చేయడం, ఇంకా
మానవ నిర్లక్ష్యంకూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి



చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.

**పట్టణ సవాళ్లు:**
ఈ తక్షణ కారణాలు భారతీయ నగరాల ప్రత్యేకమైన, తరచుగా గందరగోళ పరిస్థితులలో వేళ్ళూనుకుపోతాయి. ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనంలో వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు, ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసివేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగినప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది.

నియంత్రణ వైఫల్యం – చట్టాలున్నాయి, అమలు లేదు:
సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్ , వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్స్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం
తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి.

**ఇందుకు కారణాలు:**
తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం. జరిమానాలు సరిపోవు, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియ నెమ్మదిగా ఉంటుంది. ఇది నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తుంది. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పనిచేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.
అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.
నివారణ చర్యలు: ఎవరు ఏం చేయాలి?
ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. ముందుగా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వభవనాలకు తప్పనిసరి, నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం, నీటి వనరుల లభ్యత (ఫైర్ హైడ్రెంట్లు) వంటివి వారికి తప్పనిసరిగా అందించాలి. పట్టణ ప్రణాళికలోనే అగ్ని భద్రతను ఒక భాగంగా చూడాలి. పాత భవనాలకు ఆధునిక భద్రతా సదుపాయాలను కల్పించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చి, క్రమంగా వాటిని తప్పనిసరి చేయాలి. మూడవది, భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా వహించాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. చివరగా, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక శిక్షణ ద్వారా పౌరులను అగ్ని భద్రతపై చైతన్యపరచాలి. ప్రమాదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నిబంధనలు పాటించని వారిపై ఫిర్యాదు చేయడానికి సులభ మార్గాలను అందుబాటులో ఉంచడం కూడా పౌర పర్యవేక్షణను పెంచుతుంది.

**సురక్షిత భవిష్యత్తుకు మనందరి బాధ్యత:**
పట్టణ అగ్ని ప్రమాదాల పరంపర మన దేశానికి ఒక అవమానకరం. ఇది వేగవంతమైన అభివృద్ధి, ఖర్చు తగ్గించుకోవడాన్ని మానవ ప్రాణాల కన్నా ఎక్కువగా విలువ ఇవ్వడం వల్ల సంభవిస్తున్న పర్యవసానం. అగ్ని భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, నిపుణుల సూచనలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. కావలసింది ఏమిటంటే, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిల నుండి సాధారణ పౌరుల వరకు అందరిలో నిబద్ధత, చట్టాలను పటిష్టంగా అమలు చేసే సంకల్పం, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతిని పెంపొందించడం, బాధ్యతాయుతమైన వారిపై చర్యలు తీసుకోవడం. అప్పుడే మనం ఇలాంటి విషాదాలు పునరావృతం కాని సురక్షితమైన నగరాలను నిర్మించగలం. చర్య తీసుకోవాల్సిన సమయం నిన్ననే గడిచిపోయిందిబీ మరో ప్రమాదం జరిగే వరకు మనం వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది.

జనక మోహన రావు దుంగ
8247045230

## కృత్రిమ మేధస్సు, చాట్‌జిపిటి- వాస్తవం ఏమిటి?



ఇతిహాసంలో ఎన్నడూ లేనివిధంగా మన మానవ జీవితాన్ని తలకిందులుగా మార్చేసిన శక్తి అంటే అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధస్సు. ఈ విప్లవాత్మక సాంకేతికత మన జీవనశైలిని మార్చుతోంది. విజ్ఞానం పొందే తీరునూ పునర్నిర్వచిస్తోంది. ఇక ఇందులో అత్యంత ప్రాచుర్యం పొందిన రూపం చాట్‌జిపిటి. ఇది ఓ చాట్‌బాట్‌గా కనిపించినా, దాని వెనుక ఉన్న మేధస్సు, పరిజ్ఞానం మన ఊహలకు అందని స్థాయిలో ఉంది. కానీ ఈ సాధనాల వాస్తవ రూపం ఏమిటి? ఇవి మానవ మేధస్సును అధిగమిస్తాయా? మన భవిష్యత్తు మీద వీటి ప్రభావం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ విశ్లేషణ.21వ శతాబ్దపు అతి వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు అనేది మానవ చరిత్రలోనే బహుశా అతిపెద్ద శాస్త్రీయ కృషి. ప్రత్యేకంగా 2022 నవంబర్‌లో విడుదలైన చాట్‌జిపిటి పేరుతో ఓ భవిష్యత్ సాంకేతిక సంచలనం ప్రపంచాన్ని విస్మయపరిచింది. ఓ వ్యక్తిలా మాట్లాడే శక్తిని కలిగిన ఈ యంత్రం వెనుక గల గణాంకాలు, దాని పని తీరుపై స్పష్టమైన అవగాహన అవసరం.చాట్‌జిపిటి అనేది ఓ లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది ఓ వ్యక్తిలా మాట్లాడుతుంది కానీ భావించడం, నిర్ణయం తీసుకోవడం వంటి సామర్థ్యాలు ఇందులో లేవు. ఇది శిక్షణ పొందిన వాక్యాల ప్రాతిపదికన తదుపరి పదాలను అంచనా వేసి ప్రతిస్పందనలు రూపొందిస్తుంది. దీని వెనుక జెనరేటివ్ ప్రీట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ (జిపిటి) అనే మోడల్ పని చేస్తుంది. దీన్ని ఓ సాఫ్ట్‌వేర్ అనుకోవచ్చు కానీ ఇది తెలివిగా కనిపించడంలో మానవులకు సమానం. వేల కోట్ల పదజాలం, వ్యాకరణ, వాక్య నిర్మాణాలను అధ్యయనం చేసిన ఈ మోడల్ అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది.

మానవ మేధస్సును అనుకరించేలా రూపొందించబడిన ఎఐ వ్యవస్థలు విద్య, పరిశోధన, వాణిజ్యం, వైద్యం, జర్నలిజం, సమాచార సాంకేతిక రంగాలు ఇలా అన్ని విభాగాల్లో విస్తృతంగా ప్రవేశించాయి. ఈ పరిణామాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన రూపం చాట్‌జిపిటి. ఇది ఓపెన్‌ఎఐ అనే అమెరికన్ పరిశోధనా సంస్థ అభివృద్ధి



చేసిన మోడల్. మానవ సంభాషణ తరహాలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే సామర్థ్యం గల ఈ భాషా మోడల్ 2022లో విడుదలైన జిపిటి-3.5 రూపంలో ఆరంభమైంది. తరువాత జిపిటి-4 మరియు 2024లో విడుదలైన జిపిటి-4ఓ మరింత సామర్థ్యంతో ప్రపంచాన్ని ఆకర్షించాయి. ఇవి జెనరేటివ్ ప్రీట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ అనే సాంకేతిక పద్ధతిలో నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (భాషా ప్రాసెసింగ్)ను ఉపయోగించి పని చేస్తాయి. జిపిటి-3.5 సుమారు 175 బిలియన్ పారామీటర్లతో పని చేస్తే, జిపిటి-4 మరియు జిపిటి-4ఓలో ఈ సంఖ్య ట్రిలియన్ స్థాయిలో ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు, అయితే ఖచ్చితమైన సంఖ్య బహిరంగంగా వెల్లడించబడలేదు. వీటి శిక్షణకు వందల గిగాబైట్ల సమాచారం %-% వికీపీడియా, కామన్ క్రాల్, గూగుల్ బుక్స్, గిట్‌హబ్, స్టాక్ ఓవర్‌ఫ్లో లాంటి వనరుల నుంచి సేకరించబడిన డేటాను రీఇన్‌ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ విత్ హ్యూమన్ ఫీడ్‌బ్యాక్ (ఆర్‌ఎల్‌హెచ్‌ఎఫ్) అనే ప్రక్రియలో ఉపయోగించారు.2025 నాటికి చాట్‌జిపిటి నెలకు బిలియన్ల సంఖ్యలో పేజీ వీక్షణలు, రోజుకు లక్షల యాక్టివ్ యూజర్లు కలిగి ఉందని అంచనా వేయబడింది, అయితే ఖచ్చితమైన గణాంకాలు బహిరంగంగా అందుబాటులో లేవు. భారతదేశం ఈ వినియోగంలో కీలక స్థానంలో ఉంది. విద్యార్థులు గణితం, సైన్స్, చరిత్ర, ప్రాజెక్ట్ రిపోర్టుల తయారీకి దీనిని ఉపయోగిస్తుండగా, ఉద్యోగస్తులు నివేదికలు, ఈమెయిళు ,, డాక్యుమెంట్లు తయారీలో దీని సేవల్ని తీసుకుంటున్నారు. కోడర్లు బగ్‌ల నివారణ, కోడ్ తయారీకి దీనిని వినియోగిస్తున్నారు. వ్యాపార రంగాల్లో కస్టమర్ సపోర్ట్, మార్కెటింగ్ కంటెంట్ తయారీ, డేటా విశ్లేషణ వంటి అంశాల్లో ఇది ఉపయుక్తంగా మారింది.

వైద్య రంగంలో సిమ్టమ్స్ ఆధారంగా ప్రాథమిక సమాచారం అందించడంలో కూడా ఇది వినియోగించబడుతోంది. జర్నలిజం రంగంలో పరిశోధన సహాయంగా ఇది ముఖ్యంగా నిలుస్తోంది.
భారతదేశంలో చాట్‌జిపిటి విద్య, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వ్యాపార రంగాలలో విస్తృతంగా ఉపయోగించబడుతోంది. ఇండియా ఎఐ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు, అనేక ఎఐ స్టార్టప్‌లు దేశంలో ఎఐ ఆవిష్కరణలను వేగవంతం చేస్తున్నాయి. ఎఐ వృద్ధి వల్ల ప్రపంచవ్యాప్తంగా 97 మిలియన్ ఉద్యోగాలు తలెత్తగా, ఎఐ మార్కెట్ విలువ 2025 నాటికి 244 బిలియన్ డాలర్లను దాటి, 2030 నాటికి 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేయబడింది. గోల్డ్‌మాన్ శాచ్స్ నివేదిక ప్రకారం 2030 నాటికి ఎఐ కారణంగా సుమారు 300 మిలియన్ ఉద్యోగాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమవుతాయని అంచనా వేయబడింది. అయితే, ఎఐ వల్ల రొటీన్ ఉద్యోగాలు తగ్గినప్పటికీ, సృజనాత్మక, సాంకేతిక రంగాలలో కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయి, కానీ సామాజిక అసమానతలను తగ్గించడానికి సమతుల్య విధానం అవసరం.2025 నాటికి, చాట్‌జిపిటి (జిపిటి-4ఓ ఆధారితం) ఎఐ రంగంలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఎక్స్‌ఎఐ యొక్క గ్రోక్, అంత్రోపిక్ యొక్క క్లాడ్, గూగుల్ యొక్క జెమిని, మెటా ఎఐ యొక్క లామా వంటి ఇతర మోడల్స్ కూడా వివిధ రంగాల్లో పోటీని పెంచుతున్నాయి. ఈ పోటీ ఎఐ ఆవిష్కరణలను మరింత వేగవంతం చేస్తోంది, వినియోగదారులకు విభిన్న ఎంపికలను అందిస్తోంది.
చాట్‌జిపిటి ప్రయోజనాలనేకం ఉన్నా, పరిమితులూ ఉన్నాయి. పాత వెర్షన్‌లలో దీని డేటా 2023 నవంబర్ వరకు పరిమితమై ఉండేది, తాజా సమాచారం ఇవ్వలేకపోవడం, కొన్ని సందర్భాల్లో అసత్య సమాచారాన్ని కల్పించడం వంటి లోపాలు ఉండేవి. ఇవి హాల్యూసినేషన్ అనే రూపంలో కనిపిస్తాయి. అయితే, 2025 నాటికి జిపిటి-4ఓ వంటి వెర్షన్‌లు రియల్-టైమ్ శోధన సామర్థ్యాలను కలిగి ఉన్నప్పటికీ, హాల్యూసినేషన్‌లు ఇప్పటికీ సవాలుగా ఉన్నాయి. పైగా, ఇది మానవ భావోద్వేగాలను, నైతికతను, మానవ సంబంధ విలువలను అర్థం చేసుకోలేని ప్రాబబిలిస్టిక్ మెషిన్ మాత్రమే. విద్యారంగంలో విద్యార్థులు దీన్ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల సృజనాత్మక ఆలోచన తగ్గిపోతుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని దేశాల్లో చాట్‌జిపిటి వినియోగాన్ని నిషేధించిన సందర్భాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు దీని వినియోగంపై నియంత్రణలు విధిస్తున్నాయి.డేటా గోప్యత,భద్రత ఎఐ వినియోగంలో కీలక సవాళ్లుగా ఉన్నాయి, ఎందుకంటే వినియోగదారుల ఇన్‌పుట్‌లు శిక్షణ డేటాగా ఉపయోగించబడే అవకాశం గురించి ఆందోళనలు ఉన్నాయి. ఓపెన్‌ఎఐ గోప్యతా విధానాలను మెరుగుపరిచినప్పటికీ, ఈ అంశం వినియోగదారులకు ముఖ్యమైన ఆందోళనగా మిగిలిపోయింది. అయితే, ఎఐ వల్ల ప్రాంప్ట్ ఇంజినియర్, ఎఐ డేటా అనోటేటర్, కాంటెంట్ వెరిఫైయర్, ఎఐ ట్రైనర్, అల్గోరిథం ఆడిటర్ వంటి కొత్త ఉద్యోగాలు ఏర్పడుతున్నాయి. యూరోపియన్ యూనియన్ 2024లో ఎఐ యాక్ట్‌ను ఆమోదించింది, ఇది 2026 నాటికి పూర్తిగా అమలులోకి వస్తుంది. అమెరికా, బ్రిటన్, చైనా లాంటి దేశాలు కూడా ఎఐ వినియోగంపై నియంత్రణల దిశగా అడుగులు వేస్తున్నాయి. ఎఐ పనితీరుపై నైతిక నియంత్రణలు, పారదర్శకత, డేటా భద్రత వంటి అంశాలు నిర్దిష్టంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.చాట్‌జిపిటి భవిష్యత్తు మానవుల చేతుల్లోనే ఉంది. దీనిని మానవ మేధస్సును అధిగమించే మిషన్‌గా కాకుండా, మన ఆలోచనను విస్తరించే ఉపకరణంగా భావిస్తేనే దీని వాడకం సార్థకమవుతుంది. అపోహలతో కాకుండా అవగాహనతో, బాధ్యతతో, వివేచనతో దీన్ని వినియోగించాలి. మానవత్వాన్ని మరచిపోయేలా కాదు, మానవతను మెరుగుపరచేలా ఈ సాధనాన్ని ఉపయోగించుకుంటేనే భవిష్యత్తు సుస్థిరంగా ఉంటుంది. ఎఐ కాలంలో మనిషి విలువ మరింత పెరగాలంటే, ఆవిష్కరణల వెనుక నైతికత కూడా అవసరమని గుర్తించాలి. మన చేతుల్లో ఉన్న శక్తిని ఎలా మలుచుకుంటామో%ఔ%.అదే మన భవిష్యత్తు.

మహమ్మద్ అక్బర్
జర్నలిస్ట్, నవభూమి దినపత్రిక
మహబూబాబాద్జి

## సమత్వ సాధనే మోక్ష మార్గం

భక్తి



అజ్ఞానంతో జీవించడం చీకట్లో జీవించడం లాంటిది. చీకట్లో తడుముకుంటూ, పడుతూ, లేస్తూ...మనల్ని మనం గాయపరుచుకుంటాం. తదుపరి స్థితి... కొన్ని వెలుగు రేఖలను అనుభూతి చెందడం లాంటిది. అప్పుడు కూడా క్షణకాలం పాటు అవగాహన పొంది, తిరిగి అజ్ఞానంలోకే జారిపోతాం. చివరి స్థితి సూర్యకాంతి లాంటి శాశ్వతమైన కాంతిని పొందడం. ఇక్కడ అవగాహన అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇక వెనక్కి తిరిగి రావడం అనేది ఉండదు. ఇటువంటి స్థితిని 'మోక్షం' అంటారు. ఇది 'నేను' (సంబంధిత వ్యక్తి) పొందే స్వేచ్ఛ కాదు, 'నేను' (అనే భావన) నుంచి స్వేచ్ఛ. ఎందుకంటే బాధలన్నిటికీ కారణం ఈ 'నేను' కనుక.
"ఎవరైతే తమ మనసును, బుద్ధిని ఆత్మలో స్థిరపరుచుకుంటారో... వారు జ్ఞాన సాధనతో పాపరహితులై, పునరావృతరహితమైన పరమగతిని (మోక్షాన్ని) పొందుతారు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి ఆ స్థితిని పొందాలంటే కావలసింది ఏమిటి? సమత్వం. విద్యాసంపన్నులైన ఉన్నత వర్ణాలవారి పట్ల, నిమ్న కులాల వారిపట్ల, అలాగే గోవు, ఏనుగు, శునకం లాంటి జంతువుల పట్ల జ్ఞానులు సమదృష్టిని కలిగి ఉంటారన్నాడు శ్రీకృష్ణుడు. ఈ 'సమత్వం' అనేది భగవద్గీతకు పునాదుల్లో ఒకటి. అందరిలోనూ స్వయాన్ని (తనను), స్వయంలో అందరినీ చూడగలగడం అనేది సమత్వానికి కేంద్రం లాంటిది. అంటే ఇతరులలో కూడా మనలాగే మంచి వి ష య ా ల ు ఉన్నాయని, మనలో కూడా ఇతరుల మాదిరిగా చెడు విషయాలు ఉన్నాయని గుర్తించడం. కనిపించే వైరుధ్యాలను సమానంగా చూడడం, అజ్ఞానం నుంచి ఉద్భవించిన ద్వేషాల్ని, అయిష్టాల లాంటి వాటిని త్యజించడం తరువాతి స్థాయిలు. 'ఒకే కారణం వల్ల ఒకసారి లాభం కలగవచ్చు, మరోసారి నష్టం కలుగవచ్చని తెలుసుకొని... మనం నిమిత్రమాత్రులం' అని గ్రహించాలి.
సమతుల్యత లేని మనసుతో చేసిన కర్మ దుఃఖాన్ని తీసుకువస్తుందని అర్థం చేసుకోవాలి. ఈ అవగాహన నుంచి సమత్వభావం ఉద్భవిస్తుంది. "వర్తమానంలో ఎవరైతే సమత్వ భావంలో స్థిరపడతారో... వారు నిష్పక్షపాతులవుతారు. లోపరహితులై... పరమాత్మతో ఏకత్వాన్ని పొంది, జీవన్ముక్తులవుతారు" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.



# అందానికి సబ్జా సాయం!



చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయడంలో సబ్జా గింజలు సమర్థంగా పనిచేస్తాయి. వీటిలో సహజంగా ఉండే డీటాక్స్ గుణాలు.. చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటికి పంపిస్తాయి. దాంతో చర్మం కాంతిమంతంగా మారుతుంది. మొటిమలూ తగ్గుముఖం పడతాయి.
తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్‌తో నిండిన సబ్జా గింజలు.. ఆకలిని నియంత్రిస్తాయి. ఫలితంగా బరువు తగ్గడంలో సాయపడతాయి.
సబ్జా గింజల్లో ఉండే యాంటి బయోటిక్, యాంటి ఫంగల్, యాంటి మైక్రోబియల్ లక్షణాలు.. చర్మ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఇందుకు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. సబ్జాలో ఉండే చర్మ స్థితిస్థాపక లక్షణాలు.. చర్మం త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి.
చర్మానికే కాదు.. జుట్టుకూ సబ్జా గింజలు మంచి పోషణ అందిస్తాయి. వీటిలో అధికంగా లభించే విటమిన్ కె, బీటా కెరోటిన్, ఇతర ప్రొటీన్లు.. జుట్టు, కుదుళ్లు దృఢంగా ఉండేలా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.

# రోజులో ఎవరు ఎంత నీటిని తీసుకోవాలి?



గర్భిణీలు, లేదా బిడ్డకు పాలు ఇస్తున్న బాలింతలు శరీరం హైడ్రేటెడ్ గా ఉండే విధంగా అదనపు నీటిని తీసుకోవాలి. హైడ్రేటెడ్‌గా ఉండటానికి శరీరం అధిక స్థాయిలో పనిచేయడానికి నీరు సహాయపడుతుంది.

**రోజులో ఎవరు ఎంత నీటిని తీసుకోవాలి?**

శరీరం ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారంతో పాటు నీరు కూడా అంతే ముఖ్యం, నీటిని సరైన శాతంలో తీసుకుని హైడ్రేట్‌గా ఉండాలనేది అందరికీ తెలిసిన సంగతే. కనీసం రోజుకు నాలుగు నుండి 12 కప్పుల నీటిని తీసుకోవాలి. అయితే తక్కువ శ్రమ చేస్తున్న వారిలో ఈ నీటి శాతం సరిపోతుంది. కానీ తరచుగా వ్యాయామం చేసే వారిలో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. జ్వరం, లేదా ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే వాంతులు, విరేచనాలు ద్వారా ద్రవాలను కోల్పోతుంటే కనుక ద్రవ నష్టాన్ని తగ్గించడానికి ఎక్కువ నీరు త్రాగాలి. అయితే ఈ కొలమానాలతో ఎంత నీరు త్రాగాలి అనేది తెలుసుకుందాం.

**ఎంత నీరు అవసరం..**

1. వేడి, తేమ, పొడి ప్రాంతాల్లో నివసించే వారికి ఎక్కువ నీరు అవసరం అవుతుంది. అధిక ఎత్తు ఉన్న ప్రాంతాల్లో నివసించేవారు కూడా ఎక్కువ నీరు తీసుకోవడం ముఖ్యం.

%=బఅఅఅస్త్ర% : కీళ్లను బలహీనం చేసే రన్నింగ్ మిస్టేక్స్ ఇవే.. !

2. కాఫీ, లేదా ఇతర కెఫీన్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటే మూత్రవిసర్జన ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. తక్కువ కెఫిన్ పానీయాలు తాగడం, నీటిని ఎక్కువ తీసుకోవడం చేయాలి.
3. తాజా పండ్లు, కూరగాయలు వంటివి తినవివారు నీరు ఎక్కువగా తాగాల్సి ఉంటుంది.
4. పర్యావరణం అంటే ఎండ, వేడి ఉష్ణోగ్రతలలో ఆరుబయట గడిపినట్లయితే పెరిగిన చెమట కారణంగా ఎక్కువగా నీటిని తీసుకోవడం అవసరం.
5. గర్భిణీలు లేదా బిడ్డకు పాలు ఇస్తున్న బాలింతలు శరీరం హైడ్రేటెడ్ గా ఉండే విధంగా అదనపు నీటిని తీసుకోవాలి.

సమ్మర్ హీట్‌కి చెక్ పెట్టే సమ్మర్ డ్రింక్స్ తీసుకుంటే..!

హైడ్రేటెడ్‌గా ఉండటానికి శరీరం అధిక స్థాయిలో పనిచేయడానికి నీరు సహాయపడుతుంది. దీనికి..

1. తక్కువ పొడి చర్మాన్ని ప్రోత్సహిస్తుంది.
2. అధిక చక్కెర ఉన్న పానీయాలను తీసుకున్నప్పుడు ఎక్కువ నీటిని తీసుకుంటే బరువు పెరిగే అవకాశం తక్కువ ఉంటుంది.
3. ఆరోగ్యకరమైన మూత్రాశయం, మూత్ర పిండాల పనితీరును నీరు పెంచుతుంది.
4. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
5. ఆరోగ్యకరమైన కీళ్లను ప్రోత్సహిస్తుంది.

# అదిరిపోయే కాంబినేషన్



అందాన్ని రెట్టింపు చేసే ఆభరణాల ఎంపికలో అతివల అభిరుచే వేరు! ఒక్కొక్కరూ ఒక్కో రకమైన నగలను ఇష్టపడతారు. అంతేకాదు వేడుకకు తగ్గట్టు డిఫరెంట్ కాంబినేషన్స్ సెట్ చేసుకుంటారు. కొందరు సంప్రదాయ దుస్తులపైన భారీ ఆభరణాలు ఇష్టపడితే, మరికొందరు ఆధునిక దుస్తులపైన తేలికపాటి నగలను అలంకరించుకుని మురిసిపోతారు. అదేవిధంగా ఆభరణాల తయారీలోనూ రకరకాల కాంబినేషన్లు జిగేల్ మంటున్నాయి. రత్నాలు, ముత్యాలు పొదిగిన బంగారం, వెండి, రోజ్ గోల్డ్ కాంబినేషన్ జువెలరీ విశేషాలు ఇవి..
వివిధ రకాల ఆభరణాల తయారీలో వాడే బంగారం, వెండి లాంటి లోహాలతోపాటు వజ్రాలు, పగడాలు, ముత్యాలు ఇలా నానాజాతి రత్నాలు కలిపి తయారు చేసే ఆభరణాలను కాంబినేషన్ జువెలరీ అంటారు. సంప్రదాయంతోపాటు ఆధునికతను కలబోసిన ఈ నగలు ఈతరం మహిళలను అమితంగా ఆకర్షిస్తున్నాయి. వీటి తయారీలో బంగారం ప్రధాన లోహం. దీనికి వెండి, ప్లాటినం, రోజ్ గోల్డ్, రాగి లాంటి ఇతర లోహాలనూ జోడిస్తున్నారు. ఆపై రూబీ, ఎమరాల్డ్, సఫైర్ వంటి రత్నాలు, ముత్యాలు, కుందన్లను పొదిగి రకరకాల డిజైన్లలో అందమైన ఆభరణాలుగా మలుస్తున్నారు.
ఈ నగల్లో కొన్ని కాంబినేషన్లు అత్యంత ఆదరణ పొందుతున్నాయి. కుందన్లు పొదిగిన బంగారు ఆభరణాలు సంప్రదాయ వేడుకల్లో అగ్రపీఠం అందుకుంటున్నాయి. వజ్రాలు పొదిగిన నాజూకు నగలను నవ యువతులు తెగ ఇష్టపడుతున్నారు. రోజ్ గోల్డ్, బంగారం కలిపి చేసే బ్రేస్‌లెట్స్, ఉంగరాలు వెస్ట్రన్‌వేర్‌పై చక్కగా సరిపోతాయి. ముత్యాలు, రత్నాలతో ముస్తాబైన పెండెంట్లు బంగారు హారాలతో జతకట్టి ఆకట్టుకుంటున్నాయి. కాంబినేషన్ ఆధారంగా ఈ ఆభరణాలు అన్ని ధరల్లో అందుబాటులో ఉన్నాయి. వెండి, రోజ్ గోల్డ్ నగలు సరసమైన ధరల్లో లభ్యమవుతున్నాయి. ఈ నగలను సున్నితమైన వస్త్రంతో శుభ్రం చేయాలి. రత్నాలు, ముత్యాలు పొదిగి ఉండటం వల్ల కెమికల్స్, పర్ఫ్యూమ్స్ నుంచి వీటిని దూరంగా ఉంచడం అవసరం. అంతేకాదు వీటిని వేర్వేరు డబ్బాల్లో, పాకెట్స్‌లో భద్రపరచాల్సి ఉంటుంది.



# నిజాం కోడలైన టర్కీ రాకుమారి



కొందరిని ఒక్క సారి కలిస్తే చాలు... మనపై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వారిలో ప్రిన్సెస్ దురేషేవార్ ఒకరు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వ్యవస్థాపకుల్లో ఒకరుగా, బేగంపేట ఎయిర్‌పోర్ట్ మొదటి టెర్మినల్‌కు శంకుస్థాపకురాలిగా హైదరాబాద్ చరిత్రలో ఆమెకు ఒక సుస్థిరమైన స్థానం ఉంది. నాకు 11 ఏళ్లు ఉన్నప్పుడు– నేను తొలి సారి ప్రిన్సెస్ దురేషేవార్‌ను చూశాను. ఆ తర్వాత ఆమెతో నా పరిచయం పెరిగింది. ఓటోమన్ సామ్రాజ్యానికి వారసురాలైన ప్రిన్సెస్ దురేషేవార్ హైదరాబాద్‌కు రావటం, ఇక్కడ స్థిరపడటం ఒక ఆసక్తికరమైన కథ. ఓటోమన్ సామ్రాజ్యంపై తిరుగుబాటుదారులు దాడి చేసినప్పుడు– సుల్తాన్ ముజీబ్ తన ముద్దుల కూతురు దురేషేవార్‌తో, ఇతర కుటుంబ సభ్యులతో కలిపి ఇస్తాంబుల్ నుంచి లండన్‌కు చిన్న బోటులో వెళ్లిపోయారు. ఈ ప్రయాణం దురేషేవార్ జీవితాన్నే మార్చేసింది. టర్కీలో యువరాణిగా దురేషేవార్ అసలైన రాజభోగాలు అనుభవించేది. కానీ లండన్‌కు వచ్చే ముందు తన నగలను, తనకు ఇష్టమైన వస్తువులను వదిలేసి వచ్చేయాల్సి వచ్చింది. ఆఖరికి తను ధరించే వజ్రాల కిరీటాన్ని కూడా వదిలేయాల్సి వచ్చింది. లండన్‌లో సుల్తాన్ ముజీబ్‌కు, ఆయన కుటుంబానికి సాయం చేసేంది హైదరాబాద్ నిజామే! లండన్‌లో ఉన్న హైదరాబాద్ హౌస్‌లో వారికి బస ఏర్పాటు చేయటమే కాకుండా– వారి హోదాకు తగినట్లు పరివారాన్ని, ఇతర సౌకర్యాలను కూడా నిజాం అందించారు. ఇలా కొద్ది కాలం గడిచింది. దురేషేవార్ పెద్దదయింది. ఆ సమయంలో ఆమెను ప్రపంచంలోని అందగత్తెలలో ఒకరిగా చెప్పుకొనేవారు. ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్‌ల నుంచి అనేకమంది రాజకుమారులు ఆమెను పెళ్లిచేసుకోవటానికి ముందుకు వచ్చారు. రాయబారాలు పంపారు. కానీ సుల్తాన్– తనకు నిజాం చేసిన సాయాన్ని మర్చిపోలేదు. నిజాం కుమారుడు ప్రిన్స్ ఆజాంతో ఆమెకు వివాహం చేశారు. లండన్‌లో జరిగిన ఆ వివాహానికి ప్రపంచంలోని ముఖ్యమైన రాజకుటుంబా లకు చెందిన వారందరూ హాజరయ్యారు. ప్రిన్సెస్ దురేషేవార్ హైదరాబాద్‌కు తొలిసారి వచ్చినప్పుడు– హైదరాబాద్‌లో అనేక ఉత్సవాలు జరిగాయి. ప్రిన్స్ ఆజంకు, ప్రిన్సెస్ దురేషేవార్‌కు హైదరాబాద్ ప్రజలు ఘన స్వాగతం చెప్పారు. తొలి రోజుల్లో వారు బెల్లా విస్టా ప్యాలెస్‌లో నివాసం ఉండేవారు. నిజాం ఆమెకు 'ప్రిన్సెస్ ఆఫ్ బీరర్' అనే బిరుదు కూడా ఇచ్చారు. ప్రిన్సెస్‌ను నేను తొలిసారి చూసింది మా ఇంట్లోనే! నాన్న ధన్‌రాజ్‌గిరి వారి గౌరవార్థం ఒక పార్టీ ఇచ్చారు. నాకు అప్పుడు 11 ఏళు అనుకుంటా. ప్రిన్స్ ఆజాం, ప్రిన్సెస్ దురేషేవార్ వస్తున్నారనే వార్త మాకు ముందే తెలిసింది. ఆమె గురించి ఇంట్లో వారు మాట్లాడుకుంటుంటే విన్నామేమో... ఆమెను చూడాలనే ఆతృతతో పిల్లలందరం డైనింగ్ రూమ్ పైన ఉన్న రూమ్‌లో చేరాం. అక్కడ నుంచి ఆమెను తొలిసారి చూశా! 'నిజంగానే ప్రిన్సెస్‌లా ఉంది' అనుకున్నా! ఆ తర్వాతి కాలంలో ప్రిన్సెస్ దురేషేవార్ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొవటం మొదలుపెట్టారు. మహిళలకు విద్య అవసరమని వాదించిన వారిలో, పరదాకు వ్యతిరేకంగా కూడా మాట్లాడినవారిలో ఆమె కూడా ఒకరు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రిన్సెస్ నిలోఫర్‌కు ప్రిన్సెస్ దురేషేవార్ కజిన్ అవుతారు. దాంతో వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉండేది. ఆ రోజుల్లో సాధారణంగా రాజకుటుంబాలలో మహిళలు బయటకు వచ్చేవారు కారు. కానీ నిజాం తన కోడళ్లకు స్వేచ్ఛను ఇచ్చారు. వారు ఫ్రెంచ్ పత్రికల్లో వ్యాసాలు రాసినట్లు జ్ఞాపకం.

# ఇది ఒక జీవితానుభవం



'ప్రపంచ సుందరి పోటీలంటే అందమే కాదు... సామాజిక కోణం కూడా ఉంటుంది' అంటున్న ప్రిన్సెస్ ఇస్సీ... గడచిన ఐదేళ్లుగా మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'మిస్ వరల్డ్' మెగా ఈవెంట్‌లో కామెరూన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె... 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు."మధ్య ఆఫ్రికా దేశమైన కామెరూన్ మాది. 'మిస్ వరల్డ్' పోటీలు నాకు ఒక జీవిత అనుభవం. కేవలం కిరీటం దక్కించుకొనే ఉద్దేశంతోనే ఇక్కడకు రాలేదు. అందంతో పాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక చక్కని వేదిక. అంతేకాదు... ఇందులో సామాజిక కోణం ఉంటుంది. ప్రస్తుత పోటీల 'బ్యూటీ విత్ ఏ పర్పస్' చాలెంజ్‌లో భాగంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, అవసరంలో ఉన్నవారికి, చిన్నారుల విద్యకు సాయం అందించడం లాంటి అంశాలు ఉంటాయి. అంటే పోటీలో పాల్గొనే యువతుల్లోని సామాజిక కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఇది. ఐదేళ్లుగా నేను ఇదే మార్గంలో పయనిస్తున్నా. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. దీనికి ప్రధాన కారణం... ఈ మహమ్మారి నా ప్రాణ స్నేహితురాలిని బలిగొంది. అప్పటినుంచి ఏ స్త్రీ కూడా దీని బారిన పడకూడదనే సంకల్పంతో పని చేస్తున్నాను. ఈ వేదిక ద్వారా నా గళాన్ని ప్రపంచానికి వినిపించే అవకాశం లభించింది. అంతేకాదు... మహిళలకు ఆర్థికంగా సహాయం చేయడానికి కృషి చేస్తున్నాను. వారిలో మానసిక ఆందోళనలు, ఒత్తిడులను దూరం చేసేందుకు నా వంతు ప్రయత్నం సాగిస్తున్నాను. గత ఏడాది వంద మందికి పైగా బ్రెస్ట్ క్యాన్సర్ బాధిత మహిళల పిల్లలకు స్కూలు ఫీజులు చెల్లించాను. నా సామాజిక సేవ ప్రయాణంలో మరింత అవగాహన పెంచుకోవడానికి 'మిస్ వరల్డ్' దోహదపడుతుంది.

**మహిళకకు చదువే అందం...**

ఈ వేదికను నేను శారీరక సౌందర్యం ప్రదర్శించడానికే కాదు... మహిళా సాధికారతకు లభించిన ఒక చక్కని అవకాశంగా కూడా భావిస్తున్నాను. మహిళా సాధికారత అంటే పురుషులను విమర్శించడం కాదని స్త్రీలు అర్థం చేసుకోవాలి. ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం ద్వారా మహిళలు సాధికారత సాధించాలి. దృఢ సంకల్పం, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగల శక్తిసామర్థ్యాలు తమలో ఉన్నాయని గుర్తించాలి. సమాజంలో మనల్ని మనం ఉన్నతంగా నిలుపుకోవాలి. అది జరగాలంటే ప్రతి అమ్మాయి విద్యావంతురాలు అవ్వాలి. చదువుకున్న మహిళ మరింత అందంగా ఉంటుందనేది నా నమ్మకం. అందుకే నేను మహిళలను విద్యావంతులను చేయడానికి కృషి చేస్తున్నాను. స్త్రీకి చదువు చెప్పడమంటే... ప్రపంచ మానవాళిని విద్యావంతులను చేయడమే.

**సమస్యలను అధిగమించాలంటే...**

జీవితం అన్నాక ఎన్నో సవాళ్లు, సమస్యలు ఎదురవుతాయి. వాటిని అధిగమించాలంటే ముఖ్యంగా కావల్సింది మనపై మనకు నమ్మకం. ఆత్మవిశ్వాసమే విజయ తీరాలకు నడిపించే సాధనం. కెరీర్ ప్రారంభంలో నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ఎంతో కష్టంగా అనిపించింది. కానీ ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ అధిగమించాను. ఏదైనా కొత్తగా ప్రారంభించినప్పుడు సమస్యలు ఎదురవుతాయి. వాటికి భయపడి వెనకడుగు వేయకూడదు. మనల్ని మనం అర్థం చేసుకోవడానికి, ఇబ్బందులను దాటి అనుకున్న రంగంలో రాణించడానికి కొంత సమయం పడుతుంది.

**ఇదే మొదటిసారి...**

నేను భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. 'మిస్ వరల్డ్' ఇక్కడ జరుగుతాయని తెలిసినప్పుడు ఎంతో ఆనందపడ్డాను. వచ్చేముందు కామెరూన్‌లోని భారత కాన్సులేట్‌కు వెళ్లి, భారత రాయబారితో మాట్లాడాను. నేను పోటీలకు వస్తున్నప్పుడు హైదరాబాద్‌లో ఒక క్యాన్స ర్ సెంటర్ గురించి తెలుసుకున్నాను. ఆ కేంద్రాన్ని సందర్శించాలని, బ్రెస్ట్ క్యాన్సర్ కోసం వినియోగించే రేడియో థెరపీ, కీమోథెరపీలో కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకోవాలని అనుకొంటున్నాను.
జీవితమనే పరుగులో మనం ఎంత బిజీగా ఉన్నా... పర్యావరణం, పరిసరాల గురించి కూడా ప్రతిఒక్కరూ పట్టించుకోవాలి. ముఖ్యంగా పర్యావరణం గురించి మనం నిత్యం ఏదో ఒక వేదికపై మాట్లాడుతూనే ఉంటాం. కానీ అదొక్కటే సరిపోదు. పర్యావరణ పరిరక్షణకు ఏంచేయాలనేది ప్రజలకు నేర్పించాలి. మన వాతావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో అవగాహన కల్పించాలి. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలి.



# లైబ్రరీ రెస్టారెంట్

"నాకు వివాహం జరిగేనాటికి ఆరో తరగతి చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పరిశీలనాశక్తి ఎక్కువ. పుస్తకాలు చదవడం ఇష్టం. స్కూల్ లైబ్రరీలో పుస్తకాలన్నీ చదివేశాను. కాలేజీకి వెళ్ళాలన్నది నా కోరిక... కానీ హైస్కూల్ దాటలేదు. అత్తవారింట్లో అడుగుపెట్టగానే నా జీవితం పూర్తిగా మారిపోయింది. నా భర్త తాగుబోతు.

లైబ్రరీ రెస్టారెంట్
ఆజీచమ్ పుస్తకాంచమ్ హోటల్...
మహారాష్ట్రలోని ఓర్ఝుర్‌లో...
ముంబయి, ఆగ్రా నేషనల్ హైవేలో ఉన్న ఈ హోటల్‌లో...
ఆకలి తీర్చే వేడివేడి ఆహార పదార్థాలే కాదు, విజ్ఞాన దాహాన్ని తీర్చే పుస్తకాలూ సందర్శకుల్ని ఆహ్వానిస్తాయి.
ఆరో క్లాసుతో చదువు ఆపేసినా...
అక్షరాన్ని ప్రేమించే భీమ్‌బాయి జోంధాలే ఆలోచనకు ప్రతిబింబం ఇది.
ఆ హోటల్ గురించి, దాని ప్రారంభం వెనుక కథ గురించి డెబ్భై నాలుగేళ్ళ భీమ్‌బాయి చెబుతున్నారిలా...

"నాకు వివాహం జరిగేనాటికి ఆరో తరగతి చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పరిశీలనాశక్తి ఎక్కువ. పుస్తకాలు చదవడం ఇష్టం. స్కూల్ లైబ్రరీలో పుస్తకాలన్నీ చదివేశాను. కాలేజీకి వెళ్ళాలన్నది నా కోరిక... కానీ హైస్కూల్ దాటలేదు. అత్తవారింట్లో అడుగుపెట్టగానే నా జీవితం పూర్తిగా మారిపోయింది. నా భర్త తాగుబోతు. ఏ పనీ చేయకుండా ఊరకే తిరుగుతూ ఉండేవాడు. దాంతో ఇంటి పనులే కాదు, మాకున్న కొద్దిపాటి పొలం బాధ్యతలు కూడా నా మీద పడ్డాయి. మాకొక అమ్మాయి, తరువాత అబ్బాయి. నాకెలాగూ సరైన చదువులేదు... పొలాన్ని తాకట్టుపెట్టయినా పిల్లల్ని పెద్ద చదువులు చదివించాలనుకున్నాను. కానీ తాగుడుకూ, జూదానికీ నా భర్త ఆ పొలంలో చాలా భాగం అమ్మేశాడు. దాంతో మేము నడిరోడ్డున నిలబడాల్సి వచ్చింది. వేరే వాళ్ళ పొలంలో కొంతకాలం పనిచేశాను. బంధువులెవరూ మా వైపు చూసేవారు కాదు. మా అబ్బాయి న్యూస్ పేపర్లు వేస్తూ... చదువుకు ఫీజులు కట్టుకొనేవాడు. మా ఊళ్ళో మేము గొప్పగా బతకకపోయినా... గౌరవంగానే బతికాం. కానీ రోజురోజుకూ పరిస్థితులు దుర్భరంగా మారడంతో... వేరే చోటికి మారిపోదామని నిర్ణయించుకున్నాం. మిగిలిన కాస్త పొలాన్నీ అమ్మేసి... నాసిక్ నగరానికి వచ్చేశాం. కొన్నాళ్ళకు మా అబ్బాయి డిగ్రీ పూర్తి చేశాడు. కొందరు స్నేహితులతో మరాఠీ పుస్తకాల ప్రచురణ కంపెనీ పెట్టాడు. నేను చిన్నచిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. దానివల్ల పెద్దగా ఆదాయం వచ్చేది కాదు. నేను, మా అమ్మాయి ఆలోచించి... చిన్న టీస్టాల్ ప్రారంభించాం. "ఆడవాళ్ళు ఇళ్ళలో ఉండాలి. వీధుల్లో టీలు అమ్ముకోడానికా సిటీకి వెళ్ళారు?" అంటూ బంధువులు ఎత్తిపొడిచారు. "మేము కష్టాల్లో ఉన్నప్పుడు మీరు కనీసం పలకరించలేదు. మా బతుకు మేం బతుకుతున్నాం. మీ సలహాలు అవసరం లేదు" అని గట్టిగా చెప్పాను. నా పిల్లలు నాకు అండగా నిలిచారు. కొద్దికొద్దిగా పొదుపుచేసిన డబ్బుతో... మా టీ స్టాల్‌ను టిఫిన్ సెంటర్‌గా మార్చాం. వంటకాలు రుచిగా, శుచిగా ఉండడంతో ఆదరణ పెరిగింది.

**తింటున్నదేంటో తెలియనంతగా...**

మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు ఏదైనా ఆర్డర్ ఇచ్చాక... అది వచ్చే లోపల వాళ్ళ ఫోన్‌లో నిమగ్నమైపోయేవారు. ఒక్కోసారి ఏం తింటున్నారనేది కూడా వాళ్ళు గమనించనంతగా మమేకం అయిపోయేవారు. అన్ని చోట్లా జరిగేది ఇదే! 'ఇది చాలా చెడ్డ అలవాటు. కనీసం నా హోటల్‌లోనైనా ఈ అలవాటు మార్చడానికి ఏదైనా చెయ్యాలి' అని ఆలోచించాను. ఈలోగా మా అబ్బాయి పబ్లిషింగ్ కంపెనీ మూతపడింది. చాలా పుస్తకాలు మిగిలిపోయాయి. వాటిని కట్టలు కట్టి తెచ్చి, మా హోటల్లో పెట్టాడు. తీరిక సమయాల్లో వాటిని చదువుతూ ఉంటే... ఎంతో హాయిగా అనిపించింది. పుస్తకాలు మనకు మంచి స్నేహితులు, ప్రతి సందర్భంలోనూ మనకు చక్కటి సహచరులు. కానీ జనం ఫోన్లలో కూరుకుపోవడంతో పుస్తకాలు చదివే అలవాటు బాగా తగ్గిపోయింది. దాన్ని మా హోటల్ ద్వారా ప్రోత్సహిస్తే బాగుంటుందనే సలహా నా పిల్లలకు నచ్చింది. హోటల్‌లో ఒక మూల స్టాండ్ ఏర్పాటు చేసి... వాటి మీద పుస్తకాలు పేర్చాం. వాటిని ఉచితంగా చదువుకోవచ్చని కస్టమర్లను ప్రోత్సహించాం. క్రమంగా పుస్తకాల సంఖ్య, వాటిని చదివే వారి సంఖ్య పెరిగింది. ఆర్డర్ చేసిన పదార్థాలు వచ్చేలోగా... పుస్తకంలో రెండో మూడో అధ్యాయాలు చదివేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ ఏర్పాటును చాలామంది మెచ్చుకున్నారు. ఇది ఆనోటా ఈనోటా విని... పుస్తక ప్రియుల రాక పెరిగింది. రెగ్యులర్ కస్టమర్లు కూడా ఎందరో. వారిలో కొందరు పుస్తకాలను విరాళంగా కూడా ఇస్తూ ఉంటారు.

**పాతిక నుంచి అయిదు వేలకు...**

ఒక స్థిరమైన బతుకు కోసం ఎంతో పోరాడాను. నా పిల్లలు బాగుండాలనే తపన నన్ను నడిపించింది. నా పిల్లలను చదివించుకోగలిగాను. గత పద్నాలుగు ఏళ్ళలో... మా హోటల్ బాగా అభివృద్ధి చెందింది. పాతికతో మొదలైన పుస్తకాల సంఖ్య అయిదు వేలకు చేరింది. వాటిలో మరాఠీ, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు ఉన్నాయి. దీనితోపాటు... పుస్తక పఠనం మీద ఆసక్తిని పెంచడానికి మహిళా దినోత్సవం, రిపబ్లిక్ డే లాంటి ప్రత్యేక సందర్భాల్లో... ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం. రోగులకు, వారితో వచ్చేవారికి కాలక్షేపం కోసం ఆసుపత్రుల్లో పుస్తకాలను బహుమతులుగా అందజేస్తున్నాం. ఇదంతా మా అబ్బాయి ఆలోచన. మందులు శరీరానికి స్వస్థత కలిగిస్తే... పుస్తకాలు మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి. మా హోటల్లో ఎవరైనా పుస్తకాలు చదవడం చూస్తే... ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. నేను చేసిన చిన్న ప్రయత్నం విజయవంతమయిందనే సంతృప్తి కలుగుతుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్ మంగళవారం 20 । మే । 2025



# స్టాక్ మార్కెట్లకు నష్టాలు.. 25 వేల దిగువకు నిఫ్టీ




**న్యూఢిల్లీ-నవభూమి:**ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో దేశీయ సూచీలు నష్టాలను నమోదు చేశాయి. ఇటీవల మార్కెట్లు వరుసగా లాభాలను ఆర్జిస్తుండడంతో మదుపర్లు ఈ రోజు లాభాల స్వీకరణకు దిగారు. అలాగే అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు కూడా మార్కెట్లకు నెగిటివ్‌గా మారాయి. అమెరికా ప్రభుత్వ క్రెడిట్ రేటింగ్ తగ్గడంతో ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మళ్లీ 25 వేల దిగువకు వచ్చింది. గత శుక్రవారం ముగింపు (82, 330)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభనష్టాలతో దోబూచులాడింది. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. 81, 964 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరింది. సోమవారం సెన్సెక్స్ 81, 964-82, 424 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు 271 పాయింట్ల నష్టంతో 82,059 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 74 పాయింట్ల నష్టంతో 24, 945 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో డెలివరీ, దివీస్ ల్యాబ్స్, సీఈఎస్‌సీ, అస్ట్రాల్ లిమిటెడ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. వొడాఫోన్ ఐడియా, జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్, ఎటర్నల్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 44 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 65 పాయింట్ల లాభాన్ని ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.40గా ఉంది.



## యాప్ ద్వారా లోన్ తీసుకుంటున్నారా.. ఈ తప్పులు అస్సలు చేయకండి..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత రోజుల్లో డబ్బు అవసరం ఎప్పుడు, ఏ సమయంలో ఎందుకైనా రావచ్చు. ఉదాహరణకు వైద్యం, విద్య, పెళ్లి సహా ఇంకా అనేక ఆకస్మాత్తు ఖర్చులు కూడా రావచ్చు. ఇలాంటి సమయంలో తెలిసిన వారి దగ్గర సమయానికి డబ్బు సాయం దొరకకపోతే అనేక మంది కూడా యాప్స్ ద్వారా లోన్స్ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి బ్యాంక్ కూడా మొబైల్ యాప్స్ ద్వారా బ్యాంకింగ్ సేవలను అందిస్తోంది. అయితే కొన్ని యాప్స్ మాత్రం ప్రత్యేకంగా లోన్స్ కోసం (%వాశ్మీఅ ాాజూజూం%) వెలుగులోకి వచ్చాయి. ఇదే అదునుగా భావించిన పలు రకాల ఫేక్ యాప్స్ కూడా ఇదే దందా కొనసాగిస్తున్నాయి. ఇలాంటి క్రమంలో యాప్స్ ద్వారా రుణాలు తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. లేదంటే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మొదటి తప్పులోన్ తీసుకునే ముందు మీరు డైరెక్ట్‌గా యాప్‌ను డౌన్‌లోడ్ చేసి లోన్ కోసం అప్లై చేయొద్దు. ముందుగా ఆ యాప్ నిజంగా ఉందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవాలి. ఆ యాప్ రివ్యూలు చదవాలి. ఇత..ర వినియోగదారులు ఏమంటున్నారనే విషయాలు చూడాలి. వారు ఎలాంటి అనుభవాలు పొందారు. అది ఫేక్ యాప్ సర్వీస్ ఇస్తుందా లేదంటే వేధింపులు చేస్తున్నారా అనే విషయాలను రివ్యూలను చూడటం ద్వారా తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్‌లో లేదా ఆపిల్ స్టోర్‌లో రేటింగ్ ఎంత ఉందనే చూసి నిర్ణయం తీసుకోవాలి.

రెండో తప్పు..మీకు లోన్ ఇవ్వడానికి ముందు యాప్ ఒక "ప్రాసెసింగ్ ఫీజు" లేదా "రిజిస్ట్రేషన్ ఫీజు" అడిగితే, అది చాలా తప్పుడు యాప్ అని నిర్ధారించుకోండి. నిజమైన రుణ సంస్థలు లేదా యాప్స్ మీ నుంచి ఎలాంటి ఫీజులను వసూలు చేయవు. ఒక వేళ మీరు వాటిని నమ్మి డబ్బు చెల్లిస్తే ఆ తర్వాత కూడా మీకు లోన్ లభించదు.

మూడో తప్పుయాప్ డౌన్‌లోడ్ చేసిన తర్వాత అది అడిగే అనుమతుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొన్ని యాప్‌లు మీ ఫోన్ గ్యాలరీ, కాంటాక్ట్స్, లోకేషన్, ఎస్ఎమ్ఎస్‌లకు య..వీటికి అనుమతి ఇవ్వడం వలన మీ వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడుతుంది. కొన్ని యాప్‌లు ఈ సమాచారాన్ని ఉపయోగించి మిమ్మల్ని బెదిరించే ఛాన్సుంది. అందుకే అవసరమైన అనుమతులు మాత్రమే ఇవ్వాలి.

నాల్గో తప్పు..కొందరు యాప్‌ల నుంచి లోన్ తీసుకున్న తరువాత సమయానికి చెల్లింకపోతే ఆయా యాప్‌లు చాలా క్రూరంగా ప్రవర్తిస్తాయి. రోజుకు పదేపదే కాల్స్ చేయడం, బెదిరింపు మెసేజ్‌లు పెట్టడం, లేదంటే మీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నవారికి కాల్ చేసి అసభ్యంగా మాట్లాడటం చేస్తుంటారు. అంతేకాదు ఒక్క నెల చెల్లించకపోయినా మీ లోన్ గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరిస్తారు. కాబట్టి మీరు లోన్ తీసుకునే ముందు ఆయా యాప్ కస్టమర్ సర్వీస్ కేంద్రం మీ ప్రాంతంలో ఉందో లేదో తెలుసుకోవాలి.దీంతోపాటు హెడ్ ఆఫీస్ ఎక్కడ ఉంది. ఎల్లప్పుడు కస్టమర్ సపోర్ట్ ఉందా లేదా అనే విషయాలను తప్పకుండా పరిశీలించాలి. ఇలాంటి విషయాలు తెలుసుకోకుండా ఫేక్ యాప్ ద్వారా మీరు తక్కువ మొత్తం డబ్బు తీసుకున్నా కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పలు యాప్స్ అయితే మీరు చెల్లించిన తర్వాత కూడా చెల్లించలేదని మోసం చేస్తుంటారు. అలాంటి వాటి గురించి ఆర్బీఐ లేదా సైబర్ కేంద్రానికి ఫిర్యాదు చేయాలి.

## బ్రిటిష్ వినోదాన్ని అందించేందుకు బీబీసీ ప్లేయర్‌తో టాటా ప్లే బింజ్ భాగస్వామ్యం





**ముంబయి-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన బ్రిటిష్ వినోదంతో దాని వైవిధ్యమైన కంటెంట్ లైబ్రరీని సుసంపన్నం చేస్తూ, బీబీసీ ప్లేయర్‌తో టాటా ప్లే బింజ్ నేడు ఉత్తేజకరమైన కొత్త భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా టాటా ప్లే బింజ్ వినియోగదారులకు ప్రపంచంలోని అత్యంత మర్యాదపూర్వక కంటెంట్ ప్రొవైడర్లలో ఒకదాని నుంచి అవార్డు విన్నింగ్ టైటిళ్ల విస్తృత శ్రేణిని వీక్షించేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రకటనతో టాటా ప్లే బింజ్ భారతీయ ప్రేక్షకుల అభివృద్ధి చెందుతున్న అభిరుచులకు అనుగుణంగా సాటిలేని వినోద అనుభవాలను అందించాలన్న తన లక్ష్యానికి అనుగుణంగా ముందడుగు వేస్తోంది.

బీబీసీ ప్లేయర్ ఐకానిక్ డ్రామాలు, రక్కున నవ్వు తెప్పించే కామెడీలు, శైలిని నిర్వచించే డాక్యుమెంటరీలు, బాలలు, కుటుంబ సభ్యుల కోసం సురక్షితమైన మరియు విశ్వసనీయ యానిమేటెడ్ సిరీస్, ఆకర్షణీయమైన థ్రిల్లర్లు, స్ఫూర్తిదాయకమైన వాస్తవిక ప్రోగ్రామింగ్ తదితర విభిన్న శైలుల నుంచి అసమానమైన, సమగ్రమైన కేటలాగ్‌ను అందిస్తుంది. లూథర్, ప్రైడ్ అండ్ ప్రిజుడీస్, డాక్టర్ హూ, టాప్ గేర్ వంటి ప్రసిద్ధ బీబీసీ టైటిళ్లతో పాటు గ్రాండ్ ఇండియన్ హోటల్, సిటిజెన్ ఖాన్, మిస్టర్ బీన్ మరియు ది గ్రేట్ బ్రిటిష్ బేక్ ఆఫ్ వంటి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందిన సిరీస్‌లతో ప్రేక్షకులు ఒక విందు కోసం ఎదురుచూస్తున్నారు. ఆహార ప్రియులు నిగెల్లాస్ కుక్, ఈట్, రిపీట్‌లో సెలబ్రిటీ చెఫ్‌లు నిగెల్లా లాసన్ మరియు జామీ ఆలివర్: కుకింగ్ ఫర్ లెస్‌లో జామీ ఆలివర్‌తో పాక ప్రయాణాలలో పాల్గొనవచ్చు. బీబీసీ ప్లేయర్ శైలిని నిర్వచించే సహజ చరిత్ర ఇతిహాసం ప్లానెట్ ఎర్త్ కూడా తెరపైకి తెస్తుంది. యువ ప్రేక్షకుల కోసం, ఈ ఆఫర్‌లో ఆండీస్ అక్వాటిక్ అడ్వెంచర్స్, జోజో మరియు గ్రాన్ గ్రాన్ మరియు జూనియర్ బేక్ ఆఫ్ వంటి ఆకర్షణీయమైన టైటిళ్లు ఉండగా, కుటుంబంలోని ప్రతి సభ్యునికి ఏదో ఒకటి ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉన్నాయి.

ఈ భాగస్వామ్యం గురించి టాటా ప్లే చీఫ్ కమర్షియల్ మరియు కంటెంట్ ఆఫీసర్ పల్లవి పూరి మాట్లాడుతూ, "ఈ భాగస్వామ్యం మా వీక్షకులకు ఉత్తమమైన ప్రపంచ కంటెంట్‌ను ఒకే చోట తీసుకురావాలనే మా నిబద్ధతకు అద్దంపడుతుంది. బీబీసీ స్టూడియో ప్రీమియం స్టోరీ టెల్లింగ్, అత్యంత ప్రసిద్ధి చెందిన షోల గొప్ప లైబ్రరీ వృద్ధి చెందుతున్న మా కంటెంట్ జాబితాను సంపూర్ణంగా పూర్తి చేస్తాయి. మా వినియోగదారులు ఈ కొత్త జోడింపును ఇష్టపడతారని మేము విశ్వసిస్తున్నాము" అని ధీమా వ్యక్తం చేశారు. బీబీసీ స్టూడియోస్ దక్షిణాసియా డిస్ట్రిబ్యూషన్ ఉపాధ్యక్షుడు స్టాన్లీ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ, "టాటా ప్లే బింజ్‌తో భారతదేశం వ్యాప్తంగా మరిన్ని ఇళ్లకు బీబీసీ ప్లేయర్‌ను తీసుకురావడానికి మేము సంతోషిస్తున్నాము. ప్రశంసలు పొందిన డ్రామాల నుంచి స్ఫూర్తిదాయకమైన జీవనశైలి షోలు మరియు పిల్లల ఇష్టమైనవి వరకు అత్యుత్తమ బ్రిటిష్ వినోదం మొత్తాన్ని ఒకే చోట అందుబాటులోకి తీసుకువస్తున్నాము. టాటా ప్లేతో మా భాగస్వామ్యంలో ఇది ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. మేము వారి ఓటీటీ అగ్రిగేషన్ స్థలంలోకి విస్తరించుకుంటూ, మా దృఢమైన భాగస్వామ్యాన్ని పెంచుకుంటాము" అని తెలిపారు. టాటా ప్లే బింజ్‌లో యాప్‌ల జాబితాలో గేమింగ్‌తో పాటు యాపిల్ టీవీం, జియో హాట్‌స్టార్, జీ5, లయన్స్‌గేట్ ప్లే, అమెజాన్ ప్రైమ్ వీడియో, డిస్కవరీం, ఫ్యాన్‌కోడ్, సన్ నెక్ట్స్, ఆహా, ఫ్యూజ్ం, హాల్‌మార్క్ మూవీస్ నౌ, పీటీసీ ప్లే, యానిమ్యాక్స్, వీఆర్ ఓటీటీ, స్టేజ్, రీల్ డ్రామా, చౌపల్, నమ్మ ఫ్లిక్స్, మనోరమ మ్యాక్స్, ఐస్ట్రీమ్, తరంగ్ ప్లస్, హంగామా ప్లే, షిమారూమీ, సోనీ లివ్, క్యూరియాసిటీ స్ట్రీమ్, ఎపిక్ ఆన్, ట్రావెల్ఎక్స్‌పి, డాక్యుబే, షార్ట్స్ టీవీ, ప్లే ఫ్లిక్స్, క్లిక్, డిస్ట్రో టీవీ, మ్యాక్స్ ప్లేయర్ ఓటీటీలు ఉండగా, వీటితో బీబీసీ ప్లేయర్ చేరింది. ఈ అన్ని ప్లాట్‌ఫారమ్‌లలోని కంటెంట్ ఒకే సబ్‌స్క్రిప్షన్ మరియు ఒకే యూజర్ ఇంటర్‌ఫేస్ ద్వారా టాటా ప్లే బింజ్ వీక్షకులకు అందుబాటులో ఉంటుంది. అదనంగా, నెట్‌ఫ్లిక్స్ అన్ని టాటా ప్లే డీటీహెచ్ వినియోగదారుల కోసం డీటీహెచ్ ఛానెళ్లతో కాంబో ప్యాక్‌గా పొందవచ్చు. అయితే, అమెజాన్ ప్రైమ్ వీడియో కంటెంట్‌ను డీటీహెచ్ కనెక్షన్ ఉన్న టాటా ప్లే బింగే సబ్‌స్క్రైబర్‌లందరూ యాడ్-ఆన్‌గా యాక్సెస్ చేసుకోవచ్చు. వీక్షకులు స్మార్ట్‌ఫోన్లు, ఎల్‌జి, శామ్‌సంగ్, ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లు, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్‌తో టాటా ప్లే ఎడిషన్ మరియు %www.TataplayBinge.com% ద్వారా పెద్ద స్క్రీన్ కనెక్ట్ చేసుకుని మొత్తం 30ం యాప్‌లు వీక్షించవచ్చు.

## టెలికాం కంపెనీలకు షాక్ ఇచ్చిన 'సుప్రీం'

### ఆ పిటిషన్లను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ టెలికాం కంపెనీలకు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిలను మాఫీ చేయాలని కోరుతూ వొడాఫోన్, ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ సందర్భంగా మాట్లాడుతూ తమ ముందుకు వచ్చిన ఈ పిటిషన్లను చూసి నిజంగానే షాక్ అయ్యామన్నారు. మల్టీనేషనల్ కంపెనీ నుంచి కంపెనీని నుంచి ఇది ఊహించలేదని.. పిటిషన్‌ను కొట్టివేస్తామంటూ వొడాఫోన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి ధర్మాసనం తెలిపింది. కేంద్రం నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి ధర్మాసనం నిరాకరించింది.వొడాఫోన్ తన ఏజీఆర్ బకాయిల వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీగా సుమారు రూ.30వేలకోట్లను మాఫీ చేయాలని కోరింది. టెలికాం రంగంలో పోటీని కొనసాగించేందుకు సంస్థ మనుగడ ముఖ్యమని రోహత్గి గతంలో తెలిపారు. ఇటీవల బకాయి ఉన్న వడ్డీని ఈక్విటీ మార్పిడి తర్వాత కేంద్రం ఇప్పుడు కంపెనీలో 49 శాతం వాటాను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుత రిట్ పిటిషన్ తీర్పును సమీక్షించాలని కోరడం లేదని.. కానీ తీర్పు ప్రకారం వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీ చెల్లింపు నుంచి మినహాయింపులు కోరుతున్నట్లు కంపెనీ పిటిషన్‌లో పేర్కొంది. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, జరిమానా, జరిమానాపై వడ్డీని చెల్లించాలని పట్టుబట్టకుండా తగిన దిశా నిర్దేశం చేయాలని కోరారు. అలాగే, భారతీ ఎయిర్‌టెల్ సైతం రాయితీలను కోరుతూ అప్పీల్ చేసుకుంది. అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్‌తో కలిసి రూ.34,745 కోట్ల విలువైన వడ్డీ, జరిమానాల మినహాయింపులను కోరింది.అయితే, 2020 సెప్టెంబర్ 1 నాటి ఏజీఆర్ తీర్పును తాము వ్యతిరేకించడం లేదని, జరిమానాలు, పేరుకుపోయిన వడ్డీ తదితర అదనపు భారం నుంచి మాత్రమే ఉపశమనం కోరుతున్నట్లు కంపెనీ పేర్కొంది. వొడాఫోన్ సైతం తాము దివాలా అంచున ఉన్నామని.. కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం అందకపోతే 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొనసాగించలేమని తెలిపింది. రూ.26వేల కోట్ల ఈక్విటీ ఇన్ఫ్యూషన్, ప్రభుత్వం బకాయిలను ఈక్విటీగా మార్చినప్పటికీ బ్యాంకు నిధులను పొందడంలో ఇబ్బందులున్నాయని.. ప్రభుత్వ జోక్యం లేకుండా, నిధులను సేకరించలేమని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఎదుట దివాలా ప్రక్రియను ప్రారంభించాల్సి రావచ్చని కంపెనీ పేర్కొంది. దివాలా కారణంగా కంపెనీలోని కేంద్ర ప్రభుత్వం 49శాతం వాటా నిరుపయోగమవుతుందని.. ఇప్పటికే ఈక్విటీగా మార్చిన స్పెక్ట్రమ్ బకాయిలు రూ.1.18 లక్షల కోట్లు వృధా అవుతాయని వొడాఫోన్ ఐడియా పేర్కొంది.

## పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. మళ్లీ తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:**పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. మే 19, 2025 నాటికి భారతదేశంలో బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా వీటి రేట్లు తగ్గుతుండటం విశేషం. రెండు వారాల క్రితం 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర 98 వేల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం మాత్రం 95 వేలకు వచ్చేసింది.ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం నేడు ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్‌లో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ.95,120గా నమోదైంది. ఇక 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 87,190గా కలదు. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.95,270 కాగా, 22 క్యారెట్ పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 87,340గా ఉంది.

వెండి రేట్లు ఎలా ఉన్నాయంటే..ఇక వెండి ధరల విషయానికి వస్తే ఇవి కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో హైదరాబాద్, విజయవాడ, చెన్నైలో కేజీ వెండి ధర నిన్నటితో పోల్చితే రూ.100 తగ్గిపోయి రూ.106,900 స్థాయికి చేరుకుంది. ఇక ఢిల్లీలో కిలో వెండి రేటు రూ.96,900 కాగా, బెంగళూరు, పూణే, వడోదరా, ముంబై ప్రాంతాల్లో కూడా రూ.96,900 స్థాయిలోనే ఉంది.

గోల్డ్ స్వచ్ఛత గురించి తెలుసా..

24 క్యారెట్ల బంగారాన్ని అత్యంత స్వచ్ఛమైనదిగా పరిగణిస్తారు. స్వచ్ఛమైన బంగారం లేదా 24 క్యారెట్ల బంగారం 99.9 శాతం స్వచ్ఛతను సూచిస్తుంది. బంగారు నాణేలు, కడ్డీలను తయారు చేయడానికి 24 క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తారు. ఆభరణాల తయారీకి 22 క్యారెట్ల బంగారం ఉపయోగిస్తారు. దీనిలో రెండు వంతుల వెండి, నికెల్ లేదా ఏదైనా ఇతర లోహం కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. ఇతర లోహాలను కలపడం వల్ల బంగారం గట్టిపడి, ఆభరణాలకు అనుకూలంగా ఉంటుంది. 22 క్యారెట్ల బంగారం 91.67 శాతం స్వచ్ఛతను సూచిస్తుంది.

ఈ కారణాలతో బంగారం ధరలు..వివిధ కారణాల వల్ల బంగారం ధర హెచ్చుతగ్గులకు లోనవుతుంది. ప్రపంచవ్యాప్తంగా బంగారం డిమాండ్, మారకపు రేటు హెచ్చుతగ్గులు, ప్రస్తుత వడ్డీ రేట్లు సహా బంగారు వ్యాపారాన్ని నియంత్రించే ప్రభుత్వ నిబంధనలు కూడా ఉంటాయి. దీంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలం వంటి అంతర్జాతీయ సంఘటనలు కూడా భారత మార్కెట్లో బంగారం ధరలను గణనీయంగా ప్రభావితం చేస్తాయి.

## ట్రంప్ ఎఫెక్ట్.. పాత ఐఫోన్‌లను రిపేర్ చేసుకుంటున్న అమెరికన్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఐఫోన్.. ఓ స్టేటస్ సింబల్. మార్కెట్‌లోకి కొత్త ఫోన్ విడుదలైందంటే చాలు.. జనాలు షో రూమ్‌ల ముందు క్యూకడతారు. అమెరికాలో ఈ ట్రెండ్ మరింత వేళ్లూనుకుని ఉంది. అయితే, ట్రంప్ సుంకాల దెబ్బ అమెరికన్లలో భారీ మార్పు తీసుకొచ్చింది. ప్రస్తుతం అనేక మంది కొత్త ఐఫోన్లకు బదులు పాత ఫోన్లను రిపేర్ చేయించుకుని వాడుకుంటున్నారు.అమెరికా పరిశ్రమను రక్షించుకునేందుకు ట్రంప్ విదేశీ దిగుమతులపై భారీ సుంకాలు విధించిన విషయం తెలిసిందే. చైనా నుంచి దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్స్‌పై 54 శాతం, వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, భారతీయ వస్తువులపై 26 శాతం సుంకం విధించారు. ఐఫోన్ తయారీకి ఈ మూడు దేశాలే కీలకం. దీంతో, సుంకాల విధింపు ఐఫోన్ ధరలను అమాంతం పెంచేశాయి. అమెరికా ప్రజలు కొత్త ఫోన్లు కొనలేని స్థితికి తీసుకొచ్చాయి.దీంతో, అనేక మంది పాత ఐఫోన్లనే వాడేందుకు మొగ్గు చూపుతున్నారు. రిపేర్లు చేసుకుని మళ్లీ వాడుకుంటున్నారు. ఐఫోన్ 12 మినీ యూజర్ ఒకరు ఫోన్ బ్యాటరీ సామర్థ్యం తగ్గిపోతే 90 డాలర్లు పెట్టి కొత్త బ్యాటరీ వేయించుకుని ఐఫోన్‌ను పునర్ వినియోగించడం ప్రారంభించారు. ఇలా అనేక మంది పాత్ ఐఫోన్‌లను రిపేర్ చేసుకుని వాడుకునేందుకే మొగ్గు చూపుతున్నారు.అసలు యాపిల్ ఫోన్‌లను రిపేర్ చేయడం కష్టం అన్న వాదన ఉంది. దీంతో, స్పేర్ పార్ట్స్ కొరత ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. దీనికి తోడు ధరాభారం కూడా పెరగడంతో ఐఫోన్ ప్రియులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఐఫోన్ తయారీ విషయంలో యాపిల్ అనుసరించే జస్టిన్ ఇన్ టైం సప్లై విధానం కూడా ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చిన్న ఆటకం వచ్చినా ఐఫోన్‌ల కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు.ధరాభారంతో ఐఫోన్‌లు కొనలేని స్థితి, సరఫరాకు అంతరాయాలు, రిపేర్ అవకాశాలు తక్కువగా ఉండటం జనాలకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఫోన్ రిపేరింగ్ అవకాశాలు లేకుండా చేయడంపై యాపిల్‌ను వినియోగదారులు విమర్శిస్తున్నారు.

## బంగ్లా ఆంక్షలకు ప్రతి ఆంక్షలు

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత-బంగ్లాదేశ్ మధ్య వైరం ముదురుతోంది. ఆ దేశం నుంచి దిగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతులను భూమార్గం ద్వారా కాకుండా కోల్‌కతా లేదా ముంబై సమీపంలోని నవసేనా రేవుల ద్వారా మాత్రమే అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత నూలు, బియ్యం దిగుమతులతో పాటు అనేక వస్తువులపై బంగ్లాదేశ్ ఇటీవల ఇదే తరహా ఆంక్షలు విధించింది. ఎవరైనా భారత ఎగుమతిదారు భూమార్గం ద్వారా బంగ్లాదేశ్‌కు సరుకులు ఎగుమతి చేయాలంటే ప్రతి కిలోమీటరుకు టన్నుకు 1.8 టాకాల చొప్పున ప్రత్యేక ఫీజు విధించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లా దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది.

## చర్చల ద్వారా భారత్‌తో వాణిజ్య సమస్యలను పరిష్కరించుకుంటాం



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగ్లాదేశ్ ను కట్టడి చేసేందుకు భారత ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ దేశ దిగుమతులపై న్యూ ఢిల్లీ పలు ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్‌తో నెలకొన్న వాణిజ్య సమస్యలపై మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తాజాగా స్పందించింది. భారత్‌తో ఉన్న అన్ని అపరిష్కృత వాణిజ్య సమస్యలను పరిష్కరించుకుంటామని తెలిపింది.ఈ మేరకు బంగ్లా వాణిజ్య సలహాదారు షేక్ బషీరుద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ.. వాణిజ్య ఆంక్షలపై భారత ప్రభుత్వం నుంచి తమకు ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని తెలిపారు. 'భారతదేశం తీసుకున్న చర్యల గురించి మాకు ఇంకా అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదు. న్యూ ఢిల్లీ నుంచి సమాచారం వచ్చిన తర్వాత మేము చర్యలు తీసుకుంటాం. ఏవైనా సమస్యలు ఉంటే ఇరుపక్షాలు చర్చించి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తాయి' అని అన్నారు.కాగా, గత నెలలో భారత్ నుంచి వచ్చే సరకులపై బంగ్లా ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిస్పందనగా.. బంగ్లాదేశ్ నుంచి దిగుమతులపై న్యూఢిల్లీ ఆంక్షలు విధించింది. బంగ్లాదేశ్ నుంచి రెడీమేడ్ దుస్తులు కేవలం కోల్‌కతా, నవ సేవ నౌకాశ్రయాల గుండా మాత్రమే భారత్‌లోకి అనుమతిస్తామని కేంద్రం తెలిపింది. రెడీమేడ్ గార్మెంట్స్, ప్లాస్టిక్స్, కలప ఫర్నిచర్, కార్బొనేటెడ్ డ్రింక్స్, ప్రాసెస్డ్ ఫుడ్ ఐటమ్స్, వంటి వాటిని ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, అస్సాం, త్రిపుర, మిజోరం, ఫుల్‌బరి, కస్టమ్స్ స్టేషన్స్ గుండా రోడ్డు మార్గంలో భారత్‌లోకి ప్రవేశించడంపై నిషేధం విధించింది. దాదాపు ఐదు వారాల క్రితం ట్రాన్స్‌షిప్‌మెంట్ అవగాహనను భారత్ రద్దు చేసింది. దీనివల్ల ఇతర దేశాలకు భారత్ గుండా రకరకాల ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశాన్ని బంగ్లాదేశ్ కోల్పోయింది.

# సెక్షన్‌తో కొడదాం..




**న్యూఢిల్లీ-నవభూమి:**క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ అనేది స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ లేదా రియల్ ఎస్టేట్ తదితర పెట్టుబడుల నుంచి పొందిన లాభాలపై విధించేది. ఇందులో మళ్లీ లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ/దీర్ఘకాలిక మూలధన లాభాలు), షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎస్‌టీసీజీ/స్వల్పకాలిక మూలధన లాభాలు) పన్నులుంటాయి. అయితే మూలధన నష్టాలను వాడుకొని లాభాలపై ఈ పన్ను భారాన్ని తప్పించడానికి ఓ క్రమపద్ధతిలో, వివరణాత్మక ప్రక్రియను ఆదాయ పన్ను (ఐటీ) చట్టం-1961 కల్పిస్తున్నది. ఇది వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల పన్ను ఆదాకు ఓ చక్కని మార్గమేనని చెప్పుకోవచ్చు.మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఇక్కడ ఒడిదొడుకులు అత్యంత సహజం. అయితే కొన్ని పెట్టుబడుల్లో పురోగతి అనేదే కనిపించదు. అప్పుడు ఆశించిన స్థాయిలో రాబడులను అందించలేకపోతున్న ఆ పెట్టుబడులకు దూరంగా జరగడమే ఉత్తమం. ఇలాంటి తరుణంలో వ్యూహాత్మకంగా పన్నుల భారాన్ని తప్పించుకొనే మార్గాలున్నాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టం-1961లోని సెక్షన్ 112ఏ, సెక్షన్ 50ఏఏ వంటి పలు సెక్షన్లు ఇందుకు దోహదం చేస్తున్నాయి. వీటి ప్రకారం ఇతర పెట్టుబడుల నుంచి పొందిన లాభాలపై చెల్లించాల్సిన లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) లేదా షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎస్‌టీసీజీ) పన్నుల నుంచి ఆయా పెట్టుబడులపై వచ్చిన నష్టాల ద్వారా పూర్తిగా మినహాయింపు లేదా తగ్గింపును పొందవచ్చు. దీన్నే ట్యాక్స్-లాస్ హార్వెస్టింగ్ అంటారు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం.

ఇదీ సంగతి..ఉదాహరణకు.. ఏ, బీ అనే ఓ రెండు కంపెనీల్లో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షలతో మీరు కొన్ని షేర్లను కొన్నారు. కొంతకాలం తర్వాత ఏ కంపెనీ షేర్లను రూ.1.20 లక్షలకు అమ్మేశారు. దీంతో మీకు రూ.20,000 స్వల్పకాలిక మూలధన లాభం వచ్చింది. అలాగే బీ కంపెనీ షేర్లనూ అమ్మేశారు. కానీ అందుకు మీకు రూ.80,000 మాత్రమే వచ్చాయి. ఇక్కడ రూ.20,000 నష్టపోయారు.అప్పుడు ఏ కంపెనీ షేర్ల అమ్మకం ద్వారా వచ్చిన రూ.20,000 లాభాన్ని.. బీ కంపెనీ షేర్ల విక్రయం ద్వారా వాటిల్లిన రూ.20,000 నష్టంతో సర్దుబాటు చేసుకోవచ్చు. దీనివల్ల మీరు పొందిన స్వల్పకాలిక మూలధన లాభంపై ఎస్‌టీసీజీ ట్యాక్స్‌ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. తద్వారా రూ.4,000 (రూ.20,000లలో 20 శాతం) ఆదా చేసుకున్నట్టవుతుంది. ఒకవేళ దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వర్తించినట్టైతే రూ.2,500 (రూ.20,000లలో 12.5 శాతం) ఆదా చేసుకున్నట్టు చెప్పుకోవచ్చు.ఎల్‌టీసీజీ

స్టాక్ మార్కెట్ నమోదిత షేర్లు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడుల ద్వారా ఏడాదిలోపు లాభాలను పొందినట్టైతే స్వల్పకాలిక మూలధన లాభం (ఎస్‌టీసీజీ)గా పరిగణిస్తారు. దీనికిగాను లాభాల్లో 20 శాతాన్ని పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.స్టాక్ మార్కెట్ నమోదిత షేర్లు, ఈక్విటీయేతర ఆస్తుల్లో (భూములు, భవనాలు, నగలు, క్రిప్టోకరెన్సీల వంటివి) పెట్టుబడుల ద్వారా ఏడాది తర్వాత లాభాలను అందుకున్నట్టైతే దీర్ఘకాలిక మూలధన లాభం (ఎల్‌టీసీజీ)గా పరిగణిస్తారు. దీనికిగాను లాభాల్లో 12.5 శాతాన్ని పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.

**గుర్తుంచుకోండి..**

మార్కెట్ ఒడిదొడుకులు పెట్టుబడులపై ఓ నిర్ణయం తీసుకునేటప్పుడు దాన్ని లోతుగా అధ్యయనం చేసిగానీ తీసుకోవద్దు. ఎందుకంటే మార్కెట్‌లో ఒడిదొడుకులు సహజం. అప్ అండ్ డౌన్స్‌కు భయపడితే అది తొందరపాటు నిర్ణయాలకు దారితీసే ప్రమాదమున్నది. దానివల్ల నష్టాలు ఎదురుకావచ్చు. కాబట్టి పెట్టుబడుల ఉపసంహరణకు ముందు మీకు వాటిల్లుతున్న నష్టాలకు గల కారణాలను విశ్లేషించండి. తాత్కాలికమేనని భావిస్తే పెట్టుబడులను కొనసాగించడమే తెలివైన పని. బలమైన కారణం ఉండి ఇకపైనా సదరు పెట్టుబడి వృథానేనని అనుకుంటే దాన్ని వదిలించుకోండి.


**పోర్ట్‌ఫోలియో రీబ్యాలెన్స్**

పోర్ట్‌ఫోలియో రీబ్యాలెన్సింగ్ అనేది ప్రతీ మదుపరికి చాలాచాలా ముఖ్యం. ఒకే రకమైన పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వకుండా వైవిధ్యం కనబరిస్తే మీ ఇన్వెస్ట్‌మెంట్స్ పోర్ట్‌ఫోలియో సమతూకంగా ఉంటుంది. ఆర్థిక లక్ష్యాల సాధనకు కూడా అనువుగా ఉంటుంది. కొన్ని పెట్టుబడులు స్వల్పకాలానికి, మరికొన్ని పెట్టుబడులు దీర్ఘకాలానికి సరిపోయేలా ఉంటాయి. ఈ విచక్షణను గుర్తెరిగి ముందుకెళ్తే ఆకర్షణీయ లాభాలను సొంతం చేసుకోవచ్చు.

**లాంగ్-టర్మ్ వర్సెస్ షార్ట్-టర్మ్**

స్వల్పకాలిక మూలధన నష్టాలను స్వల్పకాలిక, దీర్ఘకాలిక మూలధన లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ దీర్ఘకాలిక మూలధన నష్టాలను దీర్ఘకాలిక మూలధన లాభాలతోనే సర్దుబాటు చేసుకోగలం.

## నవ విశ్వం



# మదురైలో అక్రమ మైనింగ్.. సీఎం స్టాలిన్‌కు బీజేపీ నేత సవాల్



**చెన్నై-నవభూమి:** తమిళనాడులోని ప్రముఖ మదురై ఆలయం సమీపంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నదని ఆ రాష్ట్ర బీజేపీ కార్యదర్శి వినోజ్ పీ సెల్వం ఆరోపించారు. అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సవాలు చేశారు. మదురై జిల్లాలోని అలంగనల్లూర్ చుట్టుపక్కల ఉన్న రాతి ప్రాంతాల్లో, ముఖ్యంగా కొండయంపట్టి గ్రామంలోని వాగుతుమలై, వన్నతిమలై కొండల్లో పగలు, రాత్రి వేళల్లో అనధికార మైనింగ్ జరుగుతున్నదని వినోజ్ పీ సెల్వం ఆరోపించారు. పొరుగున ఉన్న దిండిగల్ జిల్లా వరకు ఈ తవ్వకాలు విస్తరించాయని విమర్శించారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ పేలుళ్ల వల్ల ఈ ప్రాంత వాసులతోపాటు వన్యప్రాణులకు తీవ్ర ముప్పు కలుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.కాగా, ఈ ప్రాంతంలో ప్రతిపాదిత టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టును డీఎంకే ప్రభుత్వం నిలిపివేసినట్లు సీఎం ఎంకే స్టాలిన్ గొప్పలు పోయారని బీజేపీ నేత వినోజ్ పీ సెల్వం గుర్తు చేశారు. అయితే అక్రమ మైనింగ్ నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 'మదురై, పరిసరాల ప్రాంతాలను పీడిస్తున్న అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను నేను సవాలు చేస్తున్నా' అని అన్నారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్..!

## ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులో సూపర్‌యాప్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త చెప్పింది. ప్రయాణికులకు అందించే సేవలను మెరుగుపరచడంతో పాటు అత్యాధునిక సేవలు అందించేందుకు ఐఆర్‌సీటీసీ సరికొత్తగా 'స్వరైల్' పేరుతో సరికొత్త యాప్‌ని తీసుకువచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఈ యాప్‌ని అభివృద్ధి చేసింది. ఈ యాప్‌ని రైల్వేశాఖ సూపర్ యాప్‌గా పేర్కొంటుంది. అయితే, భారతీయ రైల్వే అందిస్తున్న వివిధ రకాల సేవలు అన్ని ఈ యాప్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌తో పోలిస్తే ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది.అయితే, ఈ యాప్ ప్రస్తుతం ఇంకా బీటా వెర్షన్‌లో ఉంది. అయినా ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ అకౌంట్‌తో లాగిన్ చేసుకోవచ్చు. కొత్తగా యూజర్ అకౌంట్‌ని తీసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్‌తో పాటు ప్లాట్‌ఫాం టికెట్లను సైతం తీసుకోవచ్చు. ప్రయాణికులు యాప్‌లో రైలు ఎక్కబోయే స్టేషన్, గమ్యస్థానం, తేదీ, క్లాస్ వివరాలన్నీ నమోదు చేసి సెర్చ్ చేయాలి. అప్పుడు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ తరహాలో అందుబాటులో ఉన్న రైళ్ల వివరాలు కనిపిస్తాయి. ప్రయాణికుల వివరాలన్నీ ఇచ్చి టికెట్లను బుక్ చేసుకోవచ్చు. అయితే, యాప్‌లో కేవలం టికెట్ల బుకింగ్‌కాకుండా.. అత్యాధునిక ఇంటర్‌ఫేస్ కారణంగా యూజర్లు తాము కోరుకున్న సేవలను సులభంగా, వేగంగా మిగతా యాప్స్‌తో పని లేకుండా ఒకే చోట పొందవచ్చు.ఆండ్రాయిడ్ యూజర్లు ఫింగర్‌ప్రింట్ సెన్సార్ ద్వారా లాగిన్ అయ్యే వెసులుబాటు ఉంది. యాప్ హోమ్ స్క్రీన్‌పై రైళ్లను వెతకడం, పీఎన్‌ఆర్ స్టేటస్, కోచ్ ఇన్ఫర్మేషన్, రైలు ట్రాకింగ్, ఫుడ్ ఆర్డర్ ఇవ్వడంతో పాటు అధికారుల సహాయం, ఫీడ్‌బ్యాక్, టికెట్ రీఫండ్ తదితర అన్ని ఆప్షన్లు ఒక్క ట్యాప్‌తోనే చేసుకోవచ్చు. కొత్త స్వరైల్ యాప్ తరుచూ రైలు ప్రయాణాలు చేసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే వర్గాలు తెలిపాయి. అలాగే, ఈ యాప్‌లో లార్జ్ షిప్‌మెంట్ సర్వీసెస్ ఫీచర్ సైతం ఉంది. ఈ ఫీచర్ సహాయంతో రైలులో లగేజీలు పంపేవారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

# అన్నదాత కష్టం చూస్తే గుండె తరుక్కుపోతోంది.. వీడియోపై స్పందించిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ-నవభూమి:**అకాల వర్షాలు అన్నదాతల నోట్లో మట్టికొడుతు న్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట విలువ రైతుకు తెలుస్తుంది. తాజాగా, మహారాష్ట్రకు చెందిన ఓ రైతు వర్షం నీటిలో కొట్టుకుపోతున్న తన పంటను కాపాడుకోడానికి ప్రయత్నిస్తోన్న వీడియో వైరల్‌గా మారింది. తన కష్టం నీటిపాలు కావడంతో ఆ కర్షకుడు ఆవేదన ఇంతా అంతా కాదు. తాజాగా, ఈ వీడియోపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందించారు. పంట నష్టపోయిన రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రకు చెందిన రైతు గౌరవ్ పన్వార్ తన వేరుశనగ పంటను అమ్ముకోవడానికి వాషిం మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ సమయంలో వర్షం కారణంగా పంట నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆ రైతు వర్షంలో తడుస్తూనే పంటను కాపాడటానికి శాయశక్తులా ప్రయత్నించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో మంత్రి స్పందించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రైతుతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ""ఈ విషయం నన్ను చాలా బాధించింది. అయితే ఆందోళనవద్దు. మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలపై చాలా సున్నితంగా వ్యవహరిస్తోంది' అని అన్నారు. అంతేకాకుండా, ఈ విషయంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. 'నష్టపోయిన పంటకు పరిహారం చెల్లిస్తాం. మీరు, మీ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా చూస్తాం' అని రైతుకు కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.కాగా, అంతకుముందు, ఎన్‌సీపీ (శరద్ పవార్) అధ్యక్షుడు జయంత్ పాటిల్ కూడా ఈ వీడియోపై స్పందించారు. బాధిత రైతులకు ఉపశమనం కలిగించి, మద్దతు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 'రాష్ట్రంలో అకాల వర్షాలు భారీగా కురుస్తున్నాయి, అనేక ప్రాంతాలలో వడగళ్ల వానలు పడ్డాయి. దీనివల్ల గణనీయమైన పంట నష్టం వాటిల్లింది రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. బాధిత రైతులకు తక్షణ సహాయం అందించాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను'అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉద్యోగంలో ఎప్పుడు చేరినా, ఎంత అనుభవం ఉన్నా వారందరికీ సమాన పెన్షన్..: సుప్రీంకోర్టు సంచలనం



**న్యూఢిల్లీ-నవభూమి:** కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండడంపై తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇందులో భాగంగానే హైకోర్టు మాజీ న్యాయమూర్తులు అందరికీ పూర్తి స్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఉద్యోగంలో చేరిన తేదీ, ఇతర విషయాలతో ఏమాత్రం సంబంధం లేకుండా జడ్జీలు అందరికీ పెన్షన్ ఇవ్వాలని వెల్లడించింది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయమూర్తులకు, అన్ని జిల్లాలు జడ్జీలకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు సమానంగా ఉండాలని స్పష్టం చేస్తూ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పును ఇచ్చింది.న్యాయ వ్యవస్థలో సమానత్వం మాటల్లో కాదు.. చట్టాల్లోనే కనిపించాలనే సూత్రాన్ని నిశ్చలంగా నిలబెట్టిన తీర్పే సుప్రీం కోర్టు తాజాగా ఇచ్చింది. అన్ని హైకోర్టుల న్యాయమూర్తులు అందరికీ సమానంగా పెన్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. న్యాయ వ్యవస్థకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయమూర్తుల జీతాల మాదిరిగానే పదవీ విరమణ తర్వాత కూడా ప్రయోజనాలు ఒకే రకంగా ఉండాలని చెబుతూ.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శాశ్వత, అదనపు న్యాయమూర్తుల మధ్య ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి తేడాను చూపించకూడదని పేర్కొన్నారు.వితంతువులు సహా ఇతర ఆధార పడిన కుటుంబ సభ్యులకు గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలను కూడా అందరు న్యాయమూర్తులకు ఒకే రకంగా అందించాలని వివరించారు. టెర్మినల్ ప్రయోజనాల కోసం పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తుల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లు అవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అందువల్ల అన్ని హైకోర్టు న్యాయమూర్తులు.. వారు ఎప్పుడు ప్రవేశించారనే దానితో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులు అని పేర్కొన్నారు.మాజీ సీజేఐలకు రూ.15 లక్షలు, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలకు రూ.13.5 లక్షలు..

ఇకపై అన్ని హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులకు సంవత్సరానికి రూ.15 లక్షల పెన్షన్, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలకు రూ.13.5 లక్షల పూర్తి పెన్షన్ చెల్లించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్‌కు కరోనా పాజిటివ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా మళ్లీ కరోనా మహమ్మారి విజృంభిస్తున్నది. ఆసియావ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. హాంకాంగ్, సింగపూర్, చైనా, థాయిలాండ్‌లో కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ సైతం కొవిడ్ పాజిటివ్‌గా తేలారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కొవిడ్ పాజిటివ్ వచ్చిందని.. అందరూ జాగ్రత్తగా ఉండాలని.. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో సూచించారు. టాలీవుడ్ నటుడు మహేశ్ బాబు భార్య నమ్రతా శిరోద్కార్ సోదరియే శిల్పా శిరోద్కర్. కొవిడ్ పాజిటివ్‌గా తేలిందని శిల్పా శిరోద్కర్ వెల్లడించిన నేపథ్యంలో బాలీవుడ్‌ను షాక్‌కు గురి చేస్తుంది. పలువురు అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. శిల్పా శిరోద్కర్ పలు బాలీవుడ్ సినిమాల్లో నటించారు.టీవీ సీరియల్స్‌లోనూ నటిస్తున్నారు. ఇటీవల రియాలిటీ షో బిగ్ బాస్ 18లో పాల్గొంది. గ్రాండ్‌ఫినాలే వీక్‌లో ఎనిమిలేట్ అయ్యింది. ఫైనలిస్ట్ అయ్యే అవకాశం త్రుటిలో చేజారింది. బిగ్‌బాస్‌తో శిల్పా లపు ప్రాజెక్టులు, ఎండార్స్‌మెంట్లతో ఫుల్ బిజీ అయ్యారు. ఇదిలా ఉండగా.. గత కొద్దికాలంగా కొవిడ్ మహమ్మారితో జనమంతా ఊపిరిపీల్చుకుంటుండగా.. ప్రస్తుతం మళ్లీ విజృంభిస్తున్నది. ఇంతకు ముందు ఆస్ట్రేలియాకు చెందిన బ్యాటర్ ట్రావిస్ హెడ్ సైతం కొవిడ్ బారినపడ్డ విషయం తెలిసిందే. వరుసగా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జనమంతా ఆందోళనకు గురవుతున్నారు. అయితే, కొవిడ్‌తో పెద్దగా ఇబ్బంది లేదని.. సాధారణంగా ఫ్లూ మాదిరిగానే సోకుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. టీకా ప్రభావం తగ్గిన నేపథ్యంలో కొత్త కేసులు నమోదవుతున్నాయి.. తప్పనిసరిగా బూస్టర్ డోస్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# గాయపడిన కుక్క.. పిల్లలు ఏం చేశారంటే?



**లక్నో-నవభూమి:** గాయపడిన కుక్కను చూసి ఇద్దరు పిల్లలు చలించిపోయారు. అట్టపెట్టెతో బండిని తయారు చేశారు. గాయంతో బాధపడుతున్న కుక్కను అందులో ఉంచి పశు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. ఒక వీధి కుక్క గాయపడటాన్ని ఇద్దరు పిల్లలు చూశారు. అట్ట పెట్టెతో చక్రాల బండిని తయారు చేశారు. కుక్కను అందులో ఉంచి పశువైద్యశాలకు తరలించారు. చికిత్స తర్వాత అట్ట పెట్టె బండిలో దానిని ఉంచి ఇంటికి తిరిగి వెళ్లారు. పెద్ద పిల్లవాడు తాడుతో ఆ బండిని లాగగా, చిన్న పిల్లవాడు వెనుక నుంచి దానిని తోశాడు.కాగా, గాయపడిన కుక్కకు చికిత్స కోసం అట్టపెట్టె బండిలో ఉంచి మండుటెండలో పశు వైద్యశాలకు పిల్లలు తీసుకెళ్లిన ఈ సంఘటనను ఒక వ్యక్తి రికార్డ్ చేశాడు. మే 14న 'స్ట్రీట్ డాగ్స్ ఆఫ్ బాంబే' ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశాడు. దీంతో ఇది వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో జంతువుల పట్ల ఆ పిల్లలు చూపిన ప్రేమ, దయకు నెటిజన్లు ముగ్ధులయ్యారు. వారి చర్యను పలువురు ప్రశంసించారు.

## కారిడార్‌లో చెప్పుల స్టాండ్ పెట్టినందుకు..

# అపార్ట్‌మెంట్ వాసికి రూ.15 వేలు ఫైన్



**బెంగళూరు-నవభూమి:**అపార్ట్‌మెంట్ కారిడార్‌లో చెప్పులు స్టాండ్ పెట్టారని ఓ కుటుంబానికి అసోసియేషన్ రూ.15 వేలు జరిమానా వేసింది. విస్తుగొలిపే ఈ ఘటన దేశ ఐటీ రాజధాని బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది. ఎలక్ట్రానిక్ సిటిలోని ప్రెస్టేజ్ సన్‌రైజ్ పార్క్‌లోని నార్త్ బ్లాక్‌లో నివాసం ఉండే ఓ కుటుంబం.. తన చెప్పుల స్టాండును కారిడార్‌లో పెట్టింది. అయితే, తమ నిబంధనలకు విరుద్ధంగా చెప్పుల స్టాండ్ ఉంచడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అసోసియేషన్.. దానిని తీసేయాలని నోటీసులు పంపింది. అయినా, యజమాని పట్టించుకోకపోవడంతో రూ.15,000కు పైగా జరిమానా వసూలు చేశారు.

ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం.., బహుళ అంతస్తుల భవనం ఎగ్జిట్ మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదు. కారిడారుల్లోని వ్యక్తిగత వస్తువులు, చెప్పుల స్టాండ్లు, మొక్కల వంటివి తొలగించడానికి సొసైటీ ఓ క్యాంపెయిన్ ప్రారంభించింది. ఇందుకోసం రెండు నెలల గడువు ఇచ్చి.. నివాసితులకు నోటీసులు పంపి, కారిడార్‌లో ఉన్నవాటిని తొలగించాలని సూచించింది. గేటెడ్ కమ్యూనిటీలోని మొత్తం 1,046 ఫ్లాట్లకుగానూ ఇద్దరు మాత్రమే తమ వస్తువులను తొలగించలేదు. దీంతో నోటీసులు పంపిన తరువాత వారిలో ఒకరు స్పందించి.. తమ వస్తువులను తొలిగించారు. ఒక్క కుటుంబం మాత్రం అలాగే ఉంచేసింది. దీనిపై ముందే హెచ్చరించిన సొసైటీ.. వారికి రూ.15 వేలు జరిమానా వేసింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలపై పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీచేసిన విషయం తెలిసిందే.రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ ప్రసాద్ మాట్లాడుతూ.., కారిడార్లో చెప్పుల స్టాండు పెడితే రోజుకు రూ.100 జరిమానా విధిస్తున్నారు. కానీ అతడు మాత్రం ముందస్తుగా రూ.15,000 జరిమానా చెల్లించి, రోజువారీ జరిమానా కింద జమచేసుకోవాలని పేర్కొన్నాడు. ఇటువంటి సమస్యను పరిష్కరించడానికి రోజువారీ జరిమానాను రూ.200కు పెంచాలని అసోసియేషన్ భావిస్తోంది. 'కామన్ ఏరియాలో వ్యక్తిగత వస్తువులను ఉంచడం కుదరదు.. రెండు మూడుసార్లు చెప్పినప్పటికీ ఇలాగే చేస్తే ప్రమాద సమయంలో సురక్షితంగా బయటప డటం కష్టమవుతుంది' అని చెప్పారు.క్యాంపెయిన్ ప్రారంభించిన మొదట్లో సగం మంది బయటే వ్యక్తిగత వస్తువులు ఉంచేవారు.. కానీ వారికి విషయం వివరించి, అవగాహన కల్పించడంతో తొలగించడానికి ఒప్పుకున్నారు.. అయితే, రోజువారీ జరిమానా ఇకపై కూడా కొనసాగించి.. కామన్ ఏరియాలో ఎలాంటి వ్యక్తిగత వస్తువులు లేకుండా చూడటమే మా లక్ష్యం' అని ఆయన అన్నారు.

# మద్యం సేవించిన పొరుగు వ్యక్తితో వాగ్వాదం.. ఘర్షణలో ముగ్గురు మృతి




**న్యూఢిల్లీ-నవభూమి:** మద్యం సేవించిన పొరుగు వ్యక్తితో వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరు కుటుంబాల వారు పదునైన ఆయుధాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ముగ్గురు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. గణపత్ పాటిల్ నగర్‌లోని మురికివాడలో షేక్, గుప్తా కుటుంబాలు చాలా కాలంగా నివసిస్తున్నాయి. 2022లో ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో నాటి నుంచి ఆ రెండు కుటుంబాల మధ్య శతృత్వం కొనసాగుతున్నది.కాగా, ఆదివారం సాయత్రం 4.30 గంటల సమయంలో హమీద్ నసీరుద్దీన్ షేక్ తాగిన మత్తులో రామ్ నవీల్ గుప్తా కొబ్బరికాయల షాపు ముందు నడుచుకుంటూ వెళ్లాడు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇది ఆ రెండు కుటుంబాల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది. దీంతో రామ్ నవీల్ గుప్తా, అతడి కుమారులైన అమర్ గుప్తా, అరవింద్ గుప్తా, అమిత్ గుప్తా పదునైన ఆయుధాలతో వచ్చారు. హమీద్ నసీరుద్దీన్ షేక్, అతడి కుమారులు అర్మాన్ హమీద్ షేక్, హసన్ హమీద్ షేక్‌తో గొడవపడ్డారు.మరోవైపు ఈ ఘర్షణలో రామ్ నవీల్ గుప్తా, అతడి కుమారుడు అరవింద్ గుప్తా అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు కుమారులైన అమర్ గుప్తా, అమిత్ గుప్తా తీవ్రంగా గాయపడ్డారు. అలాగే షేక్ కుటుంబంలో హమీద్ నసీరుద్దీన్ షేక్ మరణించగా, అతడి కుమారులైన అర్మాన్, హసన్ షేక్ గాయపడ్డారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘర్షణలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒక నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన అతడ్ని హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ఆ ప్రాంతంలో పోలీసులను మోహరించినట్లు వెల్లడించారు.

# మరో పాక్ గూఢచారి నెట్‌వర్క్ గుట్టురట్టు..



**చండీగఢ్-నవభూమి:** పాకిస్థాన్‌కు రహస్యాలు చేరవేసే మరో గూఢచార నెట్‌వర్క్ గుట్టు రట్టయ్యింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు కీలక సమాచారాన్ని లీక్ చేసిన ఇద్దరిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను గురుదాస్‌పూర్‌కు చెందిన సుఖ్‌ప్రీత్ సింగ్, కరణ్‌బీర్ సింగ్‌గా గుర్తించారు. 19 నుంచి 20 ఏళ్ల వయస్సున్న ఇద్దరు యువకులు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలతోపాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లో సైనిక దళాల కదలికలు, కీలకమైన వ్యూహాత్మక ప్రదేశాల సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు అందించారని పంజాబ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ గౌరవ్ యాదవ్ తెలిపారు. నిఘా సంస్థల సమాచారం ఆధారంగా వారి మొబైల్ ఫోన్లు పరిశీలించగా పాక్‌కు గూఢచర్యం వహిస్తున్నట్లుగా నిర్ధారణ అయ్యిందని చెప్పారు.కాగా, మూడు మొబైల్ ఫోన్లు, ఎనిమిది లైవ్ కార్ట్రిడ్జ్‌లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారి బ్యాంకు ఖాతాలకు లక్ష బదిలీ అయ్యిందని బోర్డర్ రేంజ్ డీఐజీ సతీందర్ సింగ్ చెప్పారు. గత 20 రోజులుగా పాకిస్థాన్‌కు రహస్య సమాచారాన్ని వారు లీక్ చేస్తున్నారని ఆరోపించారు. గురుదాస్‌పూర్ పోలీసులు దీనిని ఛేదించారని తెలిపారు. నిందితులైన యువకులు డ్రగ్స్‌కు బానిస అయ్యారని అన్నారు. అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలిసే అవకాశమున్నదని వెల్లడించారు.

# యూపీలో మరో పాక్ ఏజెంట్ అరెస్ట్




**రాంపూర్-నవభూమి:**పహల్గామ్ ఉగ్ర దాడిపై దర్యాప్తులో సంచలనాలు బయటపడుతున్నాయి. పాకిస్థాన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారం సంచలనం రేపింది. తాజాగా, రాంపూర్‌కు చెందిన షహజాద్ అనే వ్యాపారి పాకిస్థాన్ గూఢచారి సంస్థ కోసం పనిచేస్తూ పట్టుబడ్డాడు. అతడు సరిహద్దుల్లో స్మగ్లింగ్‌కు పాల్పడుతూ, జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తున్నాడని పోలీసులు తెలిపారు. గతంలో అతడు పలుమార్లు పాకిస్థాన్ వెళ్లి వచ్చి, ఏజెంట్లకు డబ్బులు, సిమ్ కార్డులు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి.పాకిస్థాన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తోన్న హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ క్రమంలో పాక్‌కు గూఢచార్యం చేస్తోన్న మరో వ్యక్తిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. రాంపూర్‌కి చెందిన వ్యాపారి షహజాద్.. పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నట్టు ఆరోపించారు. నిందితుడు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ కోసం పనిచేస్తున్నట్టు యూపీ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. సరిహద్దుల్లో స్మగ్లింగ్‌లో కూడా పాల్గొన్నట్టు ఆధారాలు దొరకడంతో మురాదాబాద్‌లో అరెస్టు చేసినట్టు వెల్లడించారు. షహజాద్.. జాతీయ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఐఎస్ఐకు చేరవేస్తున్నట్టు ఎస్టీఎఫ్ ప్రకటనలో పేర్కొంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిపై దర్యాప్తులో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడికి ముందు పాక్‌కు గూఢచారులుగా వ్యవహరించి సున్నితమైన సమ్మాచారం చేరవేసినట్టు గుర్తించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులకు పలువురు సహకరించినట్టు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది.

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అతను గత కొన్ని సంవత్సరాలుగా నిందితుడు అనేక సార్లు పాకిస్థాన్ వెళ్లి.. కాస్మెటిక్స్, దుస్తులు, మసాలా పొడులు, ఇతర వస్తువులను అక్రమంగా దేశంలోకి దిగుమతి చేసుకున్నట్టు గుర్తించారు. ఈ అక్రమ వ్యాపారం ఐఎస్ఐ కోవర్టు ఆపరేషన్‌కు మార్గంగా పనిచేసింది. షహజాద్ పాక్‌లో ఐఎస్ఐ ఏజెంట్లకు డబ్బులు, భారత సిమ్ కార్డులు సమకూర్చినట్టు పోలీసులు వెల్లడించారు. అంతేకాదు, రాంపూర్ జిల్లాతో పాటు ఉత్తర్ ప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల నుంచి ఐఎస్ఐ కోసం పనిచేయడానికి వ్యక్తులను పాకిస్థాన్‌కు పంపించేవాడని తెలిపారు. వీరికి వీసాలను ఐఎస్ఐ ఏర్పాటుచేసిందని చెప్పారు.


ఆర్మీ యూనిఫాంలో వచ్చి.. ముస్లిం కాని వారిపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు.. అనే ఛానెల్ నిర్వహించే జ్యోతి మల్హోత్రాకు ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ సిబ్బంది ఒకరికి సమాచారం అందిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మే 13న కేంద్ర ప్రభుత్వం ఆ పాకిస్థానీ అధికారిని దేశం నుంచి బహిష్కరించింది. గూఢచర్యం ఆరోపణలతో జ్యోతితోపాటు ఆమెకు సహకరించిన మరో ఆరుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఉగ్రదాడికి ముందు ఆమె జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్ బైసరన్ లోయకు వెళ్లినట్టు దర్యాప్తులో తేలింది. అక్కడ వీడియోలు తీసి.. యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. అంతేకాదు, దాడికి ముందు ఆమె పాకిస్థాన్‌లోనే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. తరుచూ పాక్‌లో పర్యటించిన జ్యోతి.. ఒకసారి చైనాకూ వెళ్లినట్లు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాక్ ఏజెంట్లతో ఆమె టచ్‌లో ఉన్నారని హిస్సార్ ఎస్పీ అన్నారు. దీనిపై మరింత లోతైన విచారణ కొనసాగుతోందని ఆయన తెలిపారు.

# పార్టీ జాతీయ అధ్యక్షుడిని ప్రకటించిన ప్రశాంత్ కిషోర్



**న్యూఢిల్లీ-నవభూమి:** వ్యూహకర్త ప్రశాంత్ కిషోంజన్ సూరజ్ ఎన్నికల పార్టీ స్థాపించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీకి చెందిన జాతీయ అధ్యక్షుడి పేరును ఇవాళ ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. బీజేపీ మాజీ ఎంపీ ఉదయ్ సింగ్‌ను.. జన్ సూరజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఉదయ్ సింగ్‌ను పప్పూ సింగ్ అని కూడా పిలుస్తుంటారు. పూర్నియా లోక్‌సభ సీటు నుంచి గతంలో ఉదయ్ సింగ్ రెండు సార్లు గెలిచారు. జన సూరజ్ కమిటీలో ఉన్న 150 మంది సభ్యులు ఏకగ్రీవంగా పప్పు సింగ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. పాట్నాలోని పప్పు సింగ్ ఇంట్లోనే ప్రశాంత్ కిషోర్ ఉంటున్నారు. జన్ సూరజ్ పాదయాత్ర సమయంలో ఇద్దరి మధ్య సఖ్యత పెరిగింది.

# అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకు వెళ్లిన అశోకా వర్సిటీ ప్రొఫెసర్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆపరేషన్ సింధూర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మెహమూదాబాద్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతను తన అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ అతని పిటీషన్‌ను సుప్రీంలో వాదించనున్నారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ బెంచ్ ముందుకు ఆ పిటీషన్ వెళ్లింది. మంగళవారం లేదా బుధవారం ఆ పిటీషన్‌పై విచారణ చేపట్టనున్నట్లు సీజేఐ తెలిపారు. ఆదివారం ప్రొఫెసర్ అలీ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. హర్యానా రాష్ట్ర మహిళా కమీషన్ కూడా ఆ ప్రొఫెసర్‌కు నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నట్లు మహబూదాబాద్ పేర్కొన్నారు.



# నటుడు మాస్టర్ భరత్‌కు మాతృవియోగం


టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి కమలహాసిని ఆదివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆమె అకాల మరణంతో భరత్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ విషయాన్ని కుటంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్.. ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు.తెలుగులో అంజి సినిమాతో కెరీర్ ప్రారంభించాడు. రెడీ, ఢీ, దూకుడు, హ్యాపీ, దేనికైనా రెడీ ఇలా తెలుగు, తమిళ భాషల్లో వందకుపైగా సినిమాల్లో నడించాడు. రెడీ, బిందాస్ సినిమాల్లో నటనకుగాను నంది అవార్డులు అందుకున్నాడు.



# మంచు వార్

మంచు ఫ్యామిలీలో గత సంవత్సర కాలంగా ఘర్షణలు, వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. తర్వాత కోర్టు , పోలీసుల జోక్యంతో ఆ వ్యవహారం కాస్త వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. అయినప్పటికీ నివురుగప్పిన నిప్పులా, ఆరని రావణ కాష్టంలా లోలోన ఈ వ్యవహారం కొనసాగుతూ వస్తూ ఇప్పుడు ఇంటి గొడవ కాస్త సినిమా వేదికలపైకి వచ్చి చేరింది. మనోజ్ ప్రధాన పాత్రలో నటించిన భైరవంమే30న, మంచు విష్ణు నటించిన కన్నప్ప ) జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ క్రమంలో వారి సినిమాల విడుదల సమయం దగ్గర పడుతున్న కొద్దీ మంచు సోదరులు ఇద్దరు విష్ణు, మనోజ్‌లు తమ సినిమా ప్రమోషన్స్ లో ఒకరికిపై మరొకరు పంచ్‌లు వేసుకుంటూ, విమర్శలు చేసుకుంటూ మీడియాకు సరిపోను సరుకు ఇస్తూనే ఉన్నారు. దీంతో విష్ణు, మనోజ్‌ల మాటలు విన్న నెటిజన్లు వీరి ఫ్యామిలీ సమస్యలు ఇంకా ఎన్నాళ్లు సీరియల్‌గా సాగుతాయో.. వీటికి ఎప్పుడు తెర పడుతుందో అంటూ కామెంట్లు చేస్తున్నారు.ఇటీవల కన్నప్ప సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో విష్ణు, మనోజ్‌ను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో హీరో ప్రభాస్ గురించి మాట్లాడిన విష్ణు.. తాను ప్రభాస్ ఎప్పటికీ సోదరులమని, రక్తం పంచుకుని పుట్టినవాళ్లే ఈ రోజు నా పతనాన్ని కోరేటప్పుడు.. ప్రభాస్ నేను రక్తం పంచుకుని పుట్టలేదు కానీ నా మంచి కోరి, నా సక్సెస్ కోరుతున్నాడు. ఎన్ని జన్మలకైనా నేను అతడికి రుణపడి ఉంటానని విష్ణు చెప్పుకొచ్చాడు. అదేవిధంగా మోహన్ బాబు గురించి విష్ణు మాట్లాడుతూ. మా నాన్న ఆనందమే నాకు ముఖ్యం. దాని కోసం ఏదైనా చే స్తా న ం . ఆయన సంతోషంగా లేకపోతే నాకు ఏది అక్కర్లేదు. ఆయనకు చెడ్డ పేరు తీసుకొచ్చినరోజు నేను బతికున్నా చచ్చినట్లే. ఆ రోజు ఎప్పటికీ తీసుకురాను. ఆయన పేరు నిలబెట్టడానికే ప్రయత్నిస్తాను. కానీ చెడగొట్టేలా ఎప్పుడు చేయనంటూ విష్ణు తన కుటుంబ సమస్యలపై పరోక్షంగా ప్రస్తావించాడు.ాజాగా భైరవం చిత్ర ట్రైలర్ లాంఛ్ వేడుకలో మంచు మనోజ్ సైతం ఎమోషనల్ అయ్యాడు. శివుడిని శివయ్యా అని పిలిస్తే రాడు.. ఆయన్ని మనసారా తలచుకుంటే మీ అందరి రూపంలో వస్తాడంటూ విష్ణు పై పంచ్ వేశాడు కుటుంబ గొడవలపై మనోజ్ మాట్లాడుతూ..ఈ మధ్య కాలంలో ఎన్నో జరిగాయి. ఎన్నో చూశాను. కట్టుబట్టలతో రోడ్డు మీదకు తెచ్చారు. నేను ఊరు వెళ్లొచ్చేసరికి నా పిల్లల వస్తువులతో సహా అన్నీ రోడ్డు మీద పెట్టారు. బయటకు వెళ్లడానికి కార్లు లేకుండా తీసుకెళ్లిపోయారు. కానీ నాకు ఆ శివుడు ఫ్యాన్స్ రూపంలో వచ్చాడు. వాళ్లు ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. నాకు ఎవరి మీద కోపం రావడం లేదు. అది నా బలహీనతో.. వారి బలమో అర్థం కావట్లేదని, నా కట్టె కాలేవరకూ నేను మోహన్ బాబు కుమారుడినేనన్నారు. చిన్నప్పటి నుంచి నీతి, న్యాయం వైపు నిలబడేలా పెంచారు. ఇప్పుడు తాను అదే పని చేస్తుంటే తప్పు అంటున్నారంటూ మనోజ్ ఎమోషనల్ అయ్యాడు.

# పురాతత్త్వ శాస్త్రవేత్తగా...



అందాల ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి కెరీర్ సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'తో మొదలైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోయినా... మీనాక్షి చౌదరికి మాత్రం మంచి గుర్తింపు లభించింది. గడిచిన నాలుగేళ్ళలో తమిళంతో కలిసి దాదాపు పది పన్నెండు సినిమాల్లో మీనాక్షి చౌదరి నటించింది. విశేషం ఏమంటే... సుశాంత్ తో టాలీవుడ్ లో కెరీర్ మొదలు పెట్టిన ఆమె... సుశాంత్ బావమరిది నాగ చైతన్య తో ఇప్పుడు జోడీ కడుతోంది. సుశాంత్ నాగార్జున మేనల్లుడు కావడంతో... అతనికి నాగచైతన్య బావమరిది అవుతాడు. అలా బావ, బావమరుదులతో అమ్మడు జంటగా నటిస్తోందన్న మాట. అంతేకాదు... నాగచైతన్య మేనమావతోనూ మీనాక్షి చౌదరి జోడీ కట్టిన సందర్భంగా ఈ యేడాదే జరిగింది. సంక్రాంతి కానుకగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీలో వెంకటేశ్ ప్రియురాలిగా నటించి, మెప్పించింది మీనాక్షి చౌదరి. వెంకటేశ్ సొంత సోదరి కొడుకే నాగచైతన్య. సో... మీనాక్షి చౌదరి ఇటు మేనమామ, మేనల్లుడితోనూ జోడీ కట్టినట్టు అయిపోయింది.ఈ ఫ్యామిలీ రిలేషన్స్ ను పక్కన పెడితే... ఇంకా పేరు నిర్ణయించని నాగచైతన్య సినిమాలో మీనాక్షి చేయబోతున్న పాత్ర చాలా కీలకం అని తెలుస్తోంది. ఆమె ఆర్కియాలజిస్ట్ గా ఇందులో నటిస్తోందట. ఈ సినిమా కోసం అన్నపూర్ణ స్టూడియోస్ సమీపంలో నిర్మాత బి.వి.యస్.ఎన్. ప్రసాద్ ఓ భారీ అండర్ గ్రౌండ్ సెట్ ను వేశారు. నాగచైతన్య ది కూడా ఆర్కియాలజిస్ట్ పాత్రే అంటున్నారు. దర్శకుడు కార్తీక్ దండు తన తొలి చిత్రం 'విరూపక్ష'( లోనూ కథానాయిక సంయుక్త కు చాలా కీలకమైన పాత్రను ఇచ్చాడు. కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంది. నిజం చెప్పాలంటే.. సంయుక్త తొలుత సైన్ చేసిన తెలుగు సినిమా కూడా అదే. అయితే చిత్ర నిర్మాణంలో జాప్యం జరగడంతో ఆ సినిమా ఆలస్యంగా విడుదలైంది. 'విరూపాక్ష'లో సంయుక్త పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉందో... నాగచైతన్య సినిమాలోనూ మీనాక్షి చౌదరికి అంతే ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఈ విషయాన్ని మీనాక్షి కూడా స్వయంగా చెప్పింది. తన కెరీర్ లో ఇలాంటి పాత్రను చేయలేదని, బడ్జెట్ పరంగా కూడా తన గత చిత్రాలకు మించి ఇది ఉంటుందని తెలిపింది. ఇంతవరకూ మీనాక్షి చేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు కాగా... నాగచైతన్య మూవీలో ఆమె చేస్తున్న పాత్ర మరో ఎత్తు అంటున్నారు. మరి ఈ సినిమా తర్వాత మీనాక్షి చౌదరి ఏ స్థాయికి చేరుకుంటుందో చూడాలి.

# దివి బిజీ



దివి సినిమాల మీద మక్కువతో 2017లో మోడలింగ్‌తో తన కెరీర్ మొదలు పెట్టింది. ఆమె పలు ఫాషన్ సంస్థలకు మోడలింగ్ చేసింది. దివి 2018లో తొలిసారిగా "లెట్స్ గో" అనే లఘు చిత్రంలో నటించింది. ఆమె 2019లో వచ్చిన మహర్షి సినిమా ద్వారా సినీరంగంలోకి అడుగు పెట్టింది. దివి 2019లో ఏ 1 ఎక్స్‌ప్రెస్, 2021లో క్యాబ్ స్టోరీస్ చిత్రాలలో నటించింది.ఆమె నటించిన 'సిలక ముక్కుదానా' అనే మ్యూజిక్ వీడియో 3 జూలై 2021న విడుదలైంది.దివి వైద్య 2020 సెప్టెంబరు 6న ప్రారంభమైన బిగ్ బాస్ తెలుగు 4లో పాల్గొంది. ఆమె 49 రోజులపాటు బిగ్‌బాస్ హౌస్‌లో ఉండి ఎలిమినేట్ అయ్యింది. ఈ మధ్య సినిమాలు అడపా దడపా చేస్తూనే ఉంది. సో దివి చాలా బీజీ అయ్యిందన్న మాట. హైదరాబాద్ అమ్మాయికి లక్కు కలిసి వచ్చింది.

# అన్ని భాషల్లోనూ నటిస్తున్న వామికా గబ్బీ

వామికా గబ్బి (జననం 1993 సెప్టెంబరు 29) ఒక భారతీయ నటి. ఆమె పంజాబీ, హిందీ, మలయాళం, తమిళం, తెలుగు చిత్రాలలో నటించింది. హిందీ చిత్రం జబ్ వి మెట్ (2007)లో ఆమె చిన్న పాత్రతో తెరపైకి అడుగుపెట్టింది. కానీ యో యో హనీ సింగ్, అమ్రీందర్ గిల్‌లతో కలిసి తు మేరా 22 మెయిన్ తేరా 22 (2013) చిత్రంతో మంచి గుర్తింపు వచ్చింది. పైగా ఆమెకు ఈ చిత్రంలో నటనకు పిటిసి పంజాబీ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఉత్తమ సహాయ నటి విభాగంలో నామినేషన్ దక్కింది. ఆ తర్వాత ఆమె ఇష్క్ బ్రాందీ (2014), నిక్కా జైల్దార్ 2 (2017), పరహునా (2018), దిల్ దియాన్ గల్లాన్ (2019), నిక్కా జైల్దార్ 3 (2019) వంటి అనేక పంజాబీ చిత్రాలలో నటించింది.



వ్యక్తిగత జీవితం..వామికా గబ్బి 1993 సెప్టెంబరు 29న చండీగఢ్‌లోని పంజాబీ కుటుంబంలో జన్మించింది.ఆమె తండ్రి గోవర్ధన్ గబ్బి హిందీ, పంజాబీ భాషలలో కవి, రచయిత. అతని కలం పేరు గబ్బి. ఆమె తల్లి రాజ్‌కుమారి టీచర్.

కెరీర్..ఆమె కథక్ నృత్యకారిణి. యో యో హనీ సింగ్, అమ్రీందర్ గిల్, తు మేరా 22 మై తేరా 22 పంజాబీ సినిమాతో ఆమెకు పెద్ద బ్రేక్ వచ్చింది. ఆమె మరో రెండు పంజాబీ చిత్రాలైన ఇష్క్ బ్రాందీ, ఇష్క్ హాజీర్ హైలో నటుడు దిల్జిత్ దోసాంజ్‌కి సహనటిగా నటించింది. తను తనీషాగా మొదటి మహిళా ప్రధాన పాత్రను రాజ్ పురోహిత్ దర్శకత్వం వహించిన హిందీ ఎరోటిక్ డ్రామా థ్రిల్లర్ చిత్రం సిక్స్‌టీన్ (2013)లో పోషించింది. తెలుగులో భలే మంచి రోజు అనే సినిమాలో కథానాయికగా నటించింది. వామికా గబ్బి తమిళ చిత్రం మలై నేరతు మయక్కం (2016)లో కథానాయికగా నటించింది. ఆమె మలయాళ చిత్రం గోధాలో టోవినో థామస్‌తో కలిసి కథానాయికగా నటించింది.%శ78%2017 మార్చిలో అశ్విన్ శరవణన్ దర్శకత్వం వహించిన కొత్త తమిళ చిత్రం ఇరవకాలమ్‌పై వామికా గబ్బి సంతకం చేసింది. ఇందులో శివాడ, ఎస్. జె. సూర్య సహ నటులు. పృథ్వీరాజ్ సుకుమారన్, మమతా మోహన్‌దాస్ కూడా నటించిన 9 (2019 సినిమా)లో వామికా గబ్బి ప్రధాన పాత్ర పోషించింది.

నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న వెబ్ సిరీస్ మాయి లో వామికా గబ్బి కనబరచిన నటనకు 'లాంగ్వేజ్ క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా పేరు గడించింది.

# నంది అవార్డులపై ప్రకటన.. మొత్తం మారిపోతుంది



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లో సినిమా ఇండస్ట్రీ డెవలప్ మెంట్ కోసం అవసరమైన ప్రణాళికలు సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌నేతృత్వంలో రచిస్తున్నామని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భైరవం' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. "ఏపీలో అద్భుతమైన అందాలున్నాయి. ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. ఇంకా మౌలిక సదుపాయా?ని అభివృద్ధి చెందాల్సి ఉంది. దానికి సంబంధించి స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు నిర్మించడానికి అవసరమైన మద్దతు ఇవ్వడానికి పాలసీ తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మాదిరిగానే విశాఖపట్నం అభివృద్ధి చేస్తాం. చాలాకాలంగా మూలన పడిపోయిన నంది అవార్డులను పునరుద్ధరిస్తాం. అతి తర్వలో ఆ అవార్డులకు సంబంధించి ప్రకటన ఇస్తాం. పరిశ్రమకు చెందిన ముఖ్యమైన నిర్మాతలు, దర్శకులు, నటులతో సమావేశం ఏర్పాటు చేయనున్నాం. నూటికి నూరు శాతం సినిమా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం"' అని అన్నారు.

# ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో..

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో యువ నటుడు ఇండస్ట్రీలోకి రానున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు నటుడు రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే అతను హీరోగా కొత్త సినిమా పట్టాలెక్కనుందని సమాచారం. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారని టాక్. వైజయంతి మూవీస్, ఆనంద్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ నిర్మించే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే జయకృష్ణ ఫొటోషూట్‌లో పాల్గొన్నారట. యాక్టింగ్‌లో శిక్షణ కూడా తీసుకున్నారట. మహేశ్‌బాబు సోదరుడు రమేశ్‌బాబు 1974లో బాలనటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. 'అల్లూరి సీతారామరాజు', 'మోసగాళ్లకు మోసగాడు', 'దేవుడు చేసిన మనుషులు' చిత్రాల్లో నటించి తండ్రి వారసత్వాన్ని చాటారు. 'నా ఇల్లే నా స్వర్గం', 'అన్నా చెల్లెలు', 'పచ్చతోరణం', 'ముగ్గురు కొడుకులు', 'సామ్రాట్', 'చిన్ని కృష్ణుడు', 'కృష్ణగారి అబ్బాయి', 'బజార్ రౌడీ', 'కలియుగ కర్ణుడు', 'బ్లాక్ టైగర్', 'కలియుగ అభిమన్యుడు' ఇలా 17 చిత్రాల్లో నటించారు. తన సోదరుడు మహేశ్‌బాబు నటించిన 'అతిథి', 'అర్జున్' చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. అనారోగ్యం కారణంగా 2022లో రమేశ్‌బాబు కన్నుమూశారు.



# ఆ వార్తలను కొట్టిపారేసిన బీసీసీఐ కార్యదర్శి



**న్యూదిల్లీ-నవభూమి:** ఆసియా క్రికెట్ మండలి నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండేందుకు బీసీసీఐ నిర్ణయించినట్లు వస్తున్న వార్తలపై బీసీసీఐకార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ఆసియా కప్‌తో పాటు మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో ఇండియా పాల్గొనడం లేదని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన రియాక్ట్ అయ్యారు. ఆ వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఏసీసీ ఈవెంట్లలో పాల్గొనాలా వద్దా అన్న అంశంపై బీసీసీఐలో ఎటువంటి చర్చ జరగలేదన్నారు. ఏసీసీకి కూడా ఎటువంటి ప్రతిపాదన చేయలేదన్నారు. ప్రస్తుతం తమ ఫోకస్ అంతా ఐపీఎల్, ఆ తర్వాత జరిగే ఇంగ్లండ్ సిరీస్‌పై ఉన్నట్లు దేవజిత్ సైకియా తెలిపారు. ఏసీసీ ఈవెంట్లను బహిష్కరిస్తున్నట్లు వస్తున్న వార్తలు అన్నీ ఊహాజనితమైనవే అన్నారు. తాము ఏ నిర్ణయాన్ని తీసుకున్నా మీడియా ద్వారా వెల్లడిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. వచ్చే నెలలో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇప్పటికే ఏసీసీకి బీసీసీఐ చెప్పినట్లు వార్తలు వ్యాపించాయి. ఇక సెప్టెంబర్‌లో జరగనున్న పురుషుల ఆసియా కప్ టోర్నీ నుంచి కూడా ఇండియా తప్పుకున్నట్లు వార్తలు వచ్చాయి. వాస్తవానికి ఆ టోర్నీని ఇండియానే నిర్వహించాల్సి ఉంది.ఆసియా క్రికెట్ మండలి ప్రస్తుతం అధిపతిగా మోషిన్ నఖ్వీ ఉన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ కూడా ఆయనే. పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. ఏసీసీ చీఫ్ ఓ పాకిస్థాన్ మంత్రి, అలాంటి వ్యక్తి నేతృత్వంలో జరిగే టోర్నీల్లో ఇండియా పాల్గొనబోదని బీసీసీఐ పేర్కొన్నట్లు వార్తలు వ్యాపించాయి.

# చాలా కేరింగ్ పర్సన్.. చాహల్‌పై తనకున్న అభిప్రాయాన్ని చెప్పిన మహ్‌వశ్



**న్యూదిల్లీ-నవభూమి:** టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ వార్తలకు బలం చేకురింది. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచే కాకుండా పలు ఈవెంట్స్‌లో కూడా ఇద్దరూ జంటగానే మెరిశారు. దీంతో చాహల్ మహ్‌వశ్‌తో ప్రేమలో పడ్డట్లు టాక్ నడుస్తోంది. ఇక తమ బంధంపై చాహల్ కానీ, మహ్ వశ్ కానీ ఇప్పటి వరకూ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మహ్‌వశ్.. చాహల్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇంటర్వ్యూలో భాగంగా 'చాహల్‌లో ఏ లక్షణం మీకు బాగా నచ్చింది..?' అంటూ మహ్‌వశ్‌ను విలేకరి ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. చాహల్ చాలా మంచివాడని, వినయపూర్వకంగా ఉంటాడని జవాబిచ్చింది. 'చాహల్ చాలా మంచివాడు. ఎంతో వినయం కలిగిన వ్యక్తి. చాలా కేరింగ్ పర్సన్. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రేమించిన వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాడు. అతనిలో ఉన్న ఆ లక్షణాన్ని నేను కూడా అందిపుచ్చుకోవాలనుకుంటున్నాను' అంటూ చెప్పుకొచ్చింది.

# పాకిస్థాన్‌కు జలక్.. ఆసియా కప్ నుంచి తప్పుకున్న బీసీసీఐ



**న్యూదిల్లీ-నవభూమి:** ఇండియా, పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. ఆసియా క్రికెట్ మండలి నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండేందుకు ఇండియా డిసైడైంది. దీంతో పాకిస్థాన్‌ను ఏకాకిని చేయాలన్న ఉద్దేశంతో బీసీసీఐ కసరత్తులు చేస్తోంది. మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇప్పటికే ఏసీసీకి బీసీసీఐ చెప్పింది. ఆ టోర్నీని వచ్చే నెలలో శ్రీలంకలో నిర్వహించనున్నారు. ఇక సెప్టెంబర్‌లో జరగనున్న పురుషుల ఆసియా కప్ టోర్నీ నుంచి కూడా ఇండియా తప్పుకున్నట్లు బీసీసీఐ పేర్కొన్నది. వాస్తవానికి ఆ టోర్నీని ఇండియానే నిర్వహించాల్సి ఉంది.ఆసియా క్రికెట్ మండలి ప్రస్తుతం అధిపతిగా మోషిన్ నఖ్వీ ఉన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ కూడా ఆయనే. పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. ఏసీసీ చీఫ్ ఓ పాకిస్థాన్ మంత్రి, అలాంటి వ్యక్తి నేతృత్వంలో జరిగే టోర్నీల్లో ఇండియా పాల్గొనబోదని బీసీసీఐ పేర్కొన్నది. టోర్నీల నుంచి తప్పుకున్న విషయాన్ని ఏసీసీకి చెప్పామని, కేంద్ర ప్రభుత్వంతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు బీసీసీఐ పేర్కొన్నది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**